

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


# ఉత్సవం... ఉత్సాహం

విజయవాడ ఉత్సవ్‌లో సందడి చేసిన ఏపీ, తమిళనాడు ముఖ్యమంత్రులు

## విజయ్ రాకతో విజయవాడ దద్దరిల్లిందన్న చంద్రబాబు

విజయవాడ (చైతన్యరథం): తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ రాకతో విజయవాడ నగరం దద్దరిల్లిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. సీఎం పదవి చేపట్టిన తర్వాత తొలిసారిగా ఏపీకి వచ్చిన విజయ్‌కు చంద్రబాబు ఆత్మీయ స్వాగతం పలికారు. ఉండవల్లిలో ఇద్దరూ ప్రత్యేకంగా భేటీ అయిన అనంతరం విజయవాడలోని పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తున్న 'విజయవాడ ఉత్సవ్'లో కలిసి పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలను ఇద్దరు నేతలూ ఆసక్తిగా తిలకించారు.



### మోదీ నాయకత్వంలో ఏదైనా సాధ్యమే: చంద్రబాబు

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... పార్టీ స్థాపించిన కేవలం రెండేళ్లలోనే విజయ్ తమిళనాడు సీఎం అయ్యారని, ఆ రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన కంకణం కట్టుకున్నారని కొనియాడారు. విజయవాడ ఉత్సవ్‌ను స్థానిక నేతలు, అధికారులు అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. 'పొరుగు రాష్ట్రాలు కూడా బాగుండాలని మేము కోరుకుంటాము. ప్రధాని మోదీ నాయకత్వంలో ఏది సాధించాలన్నా సాధ్యమే' అని స్పష్టం చేశారు. కనకదుర్గమ్మ తల్లి ఆశీస్సులతో గోదావరి–కావేరి నదుల అనుసంధానం వేగవంతంగా జరుగుతుందని, మొత్తం ఐదు నదులను అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని ఆకాంక్షించారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే నెం.1 దేశంగా ఎదుగుతుందనే ధీమాను చంద్రబాబు వ్యక్తం చేశారు.



### నదుల అనుసంధానంపై చర్చించాం: విజయ్

'అందరికీ నమస్కారం' అంటూ తమిళనాడు సీఎం విజయ్ తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించి ఆకట్టుకున్నారు. విజయవాడకు రావడం తనకు ఎంతో సంతోషంగా ఉందని, పవిత్రమైన దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనడం దక్కిన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబుతో జరిగిన భేటీలో నదుల అనుసంధాన ప్రక్రియపై విస్తృతంగా చర్చించానని వెల్లడించారు. విజయవాడకు విచ్చేసిన తనకు ప్రతి ఒక్కరూ ఘన స్వాగతం పలికారంటూ ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## గోదావరి-కావేరి నదుల అనుసంధానం అవశ్యం

- పలు అంశాలపై చర్చించిన ఏపీ, తమిళనాడు సీఎంలు చంద్రబాబు, విజయ్
- చెన్నై తాగునీటి అవసరాలు తీర్చాలని కోరిన విజయ్

అమరావతి (చైతన్యరథం): విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొనేందుకు విజయవాడ వచ్చిన తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. మంగళవారం ఉండవల్లిలోని క్యాంపు ఆఫీసుకువచ్చిన సీఎం విజయ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ సాదరంగా స్వాగతం పలికారు.అనంతరం ఇద్దరు ముఖ్యమంత్రులు అధికారులతో కలిసి పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా గోదావరి–కావేరి నదుల అను సంధానం ఆవశ్యకతను సీఎం చంద్రబాబు వివరించారు. నదుల అనుసంధానమే కరువుకు శాశ్వత పరిష్కారమని అభివర్ణించారు. మరోవైపు తెలుగు గంగ ద్వారా చెన్నైకు మరింతగా తాగునీరు విడుదల చేయాలని సీఎం విజయ్ కోరారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో కృష్ణా జలాలు తగ్గడం, తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొన్నప్పటికీ చెన్నయ్ దాహార్తి తీర్చే విషయంలో ఏపీ ప్రభుత్వం సాను కూలంగా ఉందన్నారు. ఇప్పటికే 4.08 టీఎంసీల నీటిని చెన్నై నగరానికి విడు దల చేసినట్టు సీఎం చంద్రబాబు చెప్పారు. నీటి లభ్యత, అవసరాలకు అనుగుణంగా మరికొంత నీటిని విడుదల చేయడంపైనా ఆలోచన చేస్తామని చెప్పారు.





### క్వాంటం వ్యాలీలో ట్విన్ టవర్లకు శంకుస్థాపన

- 11 ఎకరాల్లో 37.48 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం
- 47 అంతస్తులు, 206 మీటర్ల ఎత్తుతో టీ1, టీ2 నిర్మాణం
- క్వాంటం కంప్యూటింగ్‌తో విప్లవాత్మక మార్పులు ఖాయం
- పురపాలక శాఖ మంత్రి నారాయణ

6



'స్థానిక' సమరానికి

## వేళాయె

- మూడు దశల్లో ఎన్నికల నిర్వహణ
- నేడు షెడ్యూల్ విడుదల చేయనున్న ఎస్ఈసీ
- రేపటి నుంచి మున్సిపల్ నామినేషన్ల స్వీకరణ
- జడ్పీ చైర్‌పర్సన్ల రిజర్వేషన్లు ఖరారు చేస్తూ గెజిట్ విడుదల

*అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సర్వం సిద్ధంచేసింది.మొత్తం మూడు దశల్లో ఎన్నికలు జరిపేందుకు నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను ఎస్ఈసీ బుధవారం ఉదయం 11.30 గంటలకు అధికారికంగా విడుదల చేయనుంది. మంగళ వారం రాత్రికే అన్ని జిల్లాల నుంచి గెజిట్ నోటిఫికేషన్లు ఎన్నికల కమిషన్‌కు చేరాయి. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ కూడా బుధవారమే విడుదల కానుంది. గురువారం నుంచి మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. తొలి దశలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, రెండో దశలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, మూడో దశలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగుతాయి. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ల పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రాత్రి అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.*

| | | |
|---|---|---|
| విశాఖ | - | బీసీ |
| తిరుపతి | - | ఎస్సీ (మహిళ) |
| ఎన్టీఆర్ | - | ఎస్సీ |
| కృష్ణా | - | అన్ రిజర్వ్‌డ్ (మహిళ) |
| ప్రకాశం | - | ఎస్సీ |
| నెల్లూరు | - | జనరల్ |
| గుంటూరు | - | ఎస్సీ (మహిళ) |
| పల్నాడు | - | అన్ రిజర్వ్‌డ్ (మహిళ) |
| తూర్పు గోదావరి | - | జనరల్ (మహిళ) |
| కోనసీమ | - | ఎస్సీ (మహిళ) |
| పోలవరం | - | ఎస్టీ (మహిళ) |
| అల్లూరి | - | ఎస్టీ |
| అనకాపల్లి | - | బీసీ (మహిళ) |
| అనంతపురం | - | బీసీ |
| అన్నమయ్య | - | అన్ రిజర్వ్‌డ్ |
| బాపట్ల | - | అన్ రిజర్వ్‌డ్ (మహిళ) |
| కాకినాడ | - | జనరల్(మహిళ) |
| కర్నూలు | - | బీసీ |
| మార్కాపురం | - | జనరల్ |
| నంద్యాల | - | జనరల్ |
| పార్వతీపురం మన్యం | - | ఎస్టీ |
| శ్రీసత్యసాయి | - | జనరల్ |
| శ్రీకాకుళం | - | బీసీ మహిళ |
| విజయనగరం | - | బీసీ మహిళ |
| పశ్చిమ గోదావరి | - | జనరల్ |
| కడప | - | జనరల్ |





# సీఎంలు చంద్రబాబు, విజయ్ భేటీ





అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో తమిళనాడు సీఎం విజయ్ జోసెఫ్ మంగళవానం భేటీ అయ్యారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశమయ్యారు. తమ నివాసానికి వచ్చిన సీఎం విజయ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ సాదరంగా ఆహ్వానించారు. మంత్రులు నారాయణ, నిమ్మల రామానాయుడు, ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డిలను సీఎం విజయ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు పరిచయం చేశారు.











# విజయవాడ ఉత్సవ్ 2.0ను తిలకించి పులకించిన సీఎంలు



విజయవాడ (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తమిళనాడు సీఎం విజయ్ జోసెఫ్ విజయవాడ ఉత్సవ్ 2.0 వేడుకల్లో పాల్గొన్నారు. మంగళవారం రాత్రి విజయవాడ పున్నమి ఘాట్‌లో జరిగిన ఉత్సవాలకు వారిద్దరూ హాజరయ్యారు. సాంస్కృతిక ప్రదర్శలను తిలకించి పులకించారు. చప్పట్లతో కళాకారులను ఉత్సాహపరిచారు. హాజరైన ప్రజానీకాన్ని ఉద్దేశించి సీఎంలు ఇద్దరూ ప్రసంగించారు.













# కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న
# తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్




విజయవాడ(చైతన్యరథం): దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన జగన్మాత కనకదుర్గ అమ్మవారిని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మంగళవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రధానాలయంలోకి తోడ్కొని వెళ్లారు. సంప్రదాయ వస్త్రధారణతో ఆలయానికి చేరుకున్న సీఎం క్యూలైన్లలో ఉన్న భక్తులకు చేతులెత్తి నమస్కరిస్తూ అభివాదం చేశారు. అనంతరం అంతరాలయంలో అమ్మవారిని దర్శించుకుని, విశేష పూజలు నిర్వహించారు. దర్శనానంతరం అనివేటి మండపంలో వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం పలికారు. సీఎం విజయ్‌కు దేవదాయ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు, కమిషనరు కె.రామచంద్రమోహన్, దుర్గ గుడి పాలకమండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ(గాంధీ), కార్యనిర్వహణాధికారి వీకే నాయక్ సంయుక్తంగా అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు.

# చట్టం తనపని తాను చేయకపోతే ఎలా?

జగన్ రెడ్డి అక్రమాస్తుల కేసులు చట్టాన్ని సవాల్ చేస్తూ.. ప్రజాస్వామ్యాన్ని వెక్కిరిస్తున్నాయి. ఈ కేసులను దశాబ్దాల పాటు కాలయాపన చేయడం వల్ల సామాన్య ప్రజలకు చట్టంపై, న్యాయవ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని మసకబారుస్తున్నాయి. టన్నులకొద్దీ సాక్ష్యాలు, నేరతీవ్రత కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నా ఇంత సాగదీత ఎందుకు? చట్టాలపై, న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం సడలకూడదు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల విచారణ అంశం మరోసారి తీవ్ర చర్చనీయాంశమైంది. సుమారు పదమూడేళ్ళుగా కింది కోర్టుల్లో నలుగుతున్న ఈ మనీలాండరింగ్ కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈడీ ఇప్పటికైనా కళ్లు తెరిచి హైకోర్టు గడప తొక్కి విచారణను వేగవంతం చేయాలని కోరడం శుభపరిణామం. తెలంగాణ హైకోర్టులో ఈడీ దాఖలు చేసిన పిటిషన్ ప్రకారం.. సీబీఐ ప్రత్యేక కోర్టులో జగన్  రెడ్డికి సంబంధించి దాదాపు తొమ్మిది ఛార్జిషీట్లు పెండింగ్‌లో ఉన్నాయి. డిశ్చార్జ్ పిటిషన్లపై నిర్ణయాలు వెలువడకపోవడం వల్లనే విచారణ ముందుకు కదలడం లేదని ఈడీ తన పిటిషన్‌లో స్పష్టం చేసింది. ఈ పరిణామం నిజమైన ఫలితాన్ని సాధించాలంటే విచారణ వేగవంతం కావాలి. తదుపరి న్యాయప్రక్రియకు స్పష్టమైన దిశ ఏర్పడాలి.

ప్రజా జీవితంలో ఉన్నవారిపై తీవ్రమైన అవినీతి, అక్రమాస్తులు, క్విడ్ ప్రోకో ఆరోపణలు వచ్చినప్పుడు వాటి నిజానిజాలు సకాలంలో తేలడం అత్యంత అవసరం. ఈడీ తాజాగా కోరుతున్న రోజువారీ విచారణకు ప్రాధాన్యం ఉంది. పిటిషన్లపై నిర్ణయాలు తీసుకోవడం నుంచి తదుపరి విచారణను ముందుకు నడిపించడం వరకు ఒక స్పష్టమైన కార్యాచరణ అవసరం. గతంలో జగన్ కు కల్పించిన ప్రత్యేక మినహాయింపులు ఉండకూడదు. పెండింగ్‌లో ఉన్న డిశ్చార్జ్ పిటిషన్లను ప్రాధాన్య క్రమంలో విచారించి, ప్రతి పిటిషన్‌పై తగిన కారణాలతో నిర్ణయాలు తీసుకోవాలి. రెండోది కేసుల స్వభావాన్ని బట్టి సాధ్యమైన చోట రోజువారీ లేదా నిరంతర విచారణ చేపట్టేలా కార్యాచరణ రూపొందించాలి. మూడోది న్యాయమూర్తుల బదిలీలు లేదా ఇతర పరిపాలనా కారణాల వల్ల విచారణ ఆగిపోకుండా, కేసుల పురోగతిని పర్యవేక్షించే వ్యవస్థను బలోపేతం చేయాలి. నాలుగోది నిందితులు, దర్యాప్తు సంస్థలు, న్యాయవాదులు తమ తమ బాధ్యతలను సమయపాలనతో నిర్వర్తించేలా న్యాయస్థానాలు తగిన మార్గదర్శకాలు జారీ చేయాలి.



ఏకంగా వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని అప్పనంగా దోచుకున్నారనే తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి దాదాపు 13 ఏళ్లుగా బెయిలుపై స్వేచ్ఛగా తిరుగుతూ, నీతులు చెబుతూ  రాజకీయాలు చేయడం అంటే దేశంలో చట్టం ఎంత నిర్వీర్యమైపోయిందో చెప్పడానికి నిదర్శనం. ఈ కేసులు రాజ్యాంగ వ్యవస్థలనే సవాల్ చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయి. న్యాయం ఆలస్యం కావడం అంటే న్యాయాన్ని నిరాకరించడమే(జస్టిస్ డిలేడ్ ఈజ్ జస్టిస్ డినైడ్) అనే నానుడి జగన్ రెడ్డి కేసులో అక్షరాల నిజమవుతోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా, తీవ్ర ఆర్థిక నేరాలకు సంబంధించి దశాబ్దానికి పైగా ట్రయల్ కూడా ప్రారంభం కాకపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థ సిగ్గుపడాల్సిన విషయం. నిందితులు వేసే డిశ్చార్జ్ పిటిషన్లు, టెక్నికల్ స్టేలు, వాయిదాల పర్వాలు.. ఇవన్నీ చట్టం కళ్లు కప్పడానికి చేస్తున్న పన్నాగాలే అని చెప్పాలి. చట్టం ముందు అందరూ సమానులే అనే రాజ్యాంగ స్ఫూర్తిని ఈ సుదీర్ఘ కాలయాపన తుంగలో తొక్కింది.

సీబీఐ ప్రత్యేక కోర్టులు సైతం ఈ కేసుల తీవ్రతను గమనంలోకి తీసుకోకుండా నిద్రావస్థలో ఉండిపోయాయి. నిందితులకు అనుకూలంగా కాలం గడిచి పోవాలనే వ్యూహం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. చట్టం తన పని తాను చేసుకుపోతుందనే సూత్రం సామాన్య ప్రజల్లో పూర్తిగా నమ్మకం కోల్పోయింది. రాజకీయ బలమున్న నాయకులు ఏ నేరమైనా చేసి దశాబ్దాల పాటు చట్టం నుంచి తప్పించుకోవచ్చనే ప్రమాదకర సంకేతాన్ని జగన్ రెడ్డి కేసులు సమాజానికి ఇస్తున్నాయి. న్యాయ వ్యవస్థ అలసత్వం, నిందితులు వేసే డిశ్చార్జ్ పిటిషన్లు, టెక్నికల్ స్టేలు ఆసరాగా చేసుకుని విచారణను సంవత్సరాల తరబడి సాగదీయడం న్యాయ వ్యవస్థలోని లొసుగులను ఎత్తిచూపుతోంది.

సీబీఐ ప్రత్యేక కోర్టులో దాదాపు తొమ్మిది ఛార్జిషీట్‌లు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉండటం దర్యాప్తు సంస్థల నిస్సహాయతను, నిందితులు అనుసరిస్తున్న లీగల్ వ్యూహాలను బయటపెడుతోంది. జగన్మోహన్ రెడ్డి అవినీతి కేసులకు సంబంధించినవి. 'ఏ1' జగన్ రెడ్డికి  బెయిలొచ్చి 13 ఏళ్ళు అవుతుంది. దర్యాప్తు సాగుతున్న కేసులలో తీవ్రమైన నేరాలు దాగి ఉన్నాయి. కుట్రలు ప్రత్యేకంగానే ఉన్నాయంటూ గతంలో జగన్ కేసులో స్వయంగా సీబీఐనే సుప్రీంకోర్టుకు నివేదించింది. ఈ కేసులపై విచారణలు దశాబ్దకాలం పైగా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా ఉంది. జగన్ పై  సీబీఐ నమోదు చేసిన కేసులు ఇంతవరకు 3041 సార్లు వాయిదా పడ్డాయని.. ఇప్పటి డిప్యూటీ స్పీకర్, గతంలో వైసీపీ ఎంపీగా ఉన్న రఘురామకృష్ణంరాజు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్ళారు. ఆయన వేసిన వ్యాజ్యంపై స్పందించిన సుప్రీంకోర్టు.. జగన్మోహన్ రెడ్డి కేసుల్లో అసాధారణ జాప్యానికి కారణం చెప్పాలంటూ సీబీఐని నిగ్గదీసింది. అనేక కేసుల్లో విచారణ జరుగుతున్న తీరు, జాప్యాలపై సీబీఐ పంజరంలో చిలక కారాదని సుప్రీంకోర్టు చేసిన ఘాటైన వ్యాఖ్యల్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి.

ప్రజాప్రయోజనాలు ఇమిడి ఉన్న దృష్ట్యా ప్రజాప్రతినిధులకు సంబందించిన కేసుల్లో అనవసర వాయిదాలు వేయవద్దని, కిందిస్థాయి కోర్టులకు ఎప్పుడో  సర్వోన్నత న్యాయస్థానం దిశానిర్దేశం చేసింది. ఆవేశకావేశాల కారణంగా ఒక హత్య జరగవచ్చు కానీ, ఆర్థిక నేరాలు అలాంటివి కావు. ఉద్దేశపూర్వకంగా, ప్రణాళికతో చేసే ఆర్థిక నేరగాళ్లను కఠినంగా శిక్షించకపోతే మొత్తం సమాజమే అన్యాయమైపోతుందని సాక్షాత్తు సుప్రీంకోర్టే స్పష్టంచేసింది. లోతైన కుట్రలతో కూడిన ఆర్థిక నేరాలు దేశార్థిక ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమైనవని, వాటిని తీవ్రంగా పరిగణించాలని జగన్మోహన్ రెడ్డి కేసులోనే సుప్రీంకోర్టు పదేళ్ల క్రితమే వ్యాఖ్యానించింది. రఘురామ్(భారతి) సిమెంట్స్, ఇందూ, జగతి పబ్లికేషన్స్ తదితర కేసుల్లో నేరాభియోగాలు రుజువైతే జగన్ కు  గరిష్టంగా ఏడేళ్ల వరకు జైలుశిక్ష పడవచ్చు, వాన్ పిక్ కేసులోనైతే విచారణ పూర్తై అభియోగాలు వాస్తవమని తేలితే యావజ్జీవ కారాగార శిక్ష పడే అవకాశం ఉంది. అంతటి అభియోగాలను నెత్తిన మోస్తున్న నిందితుడు నీతులు చెబుతూ, రాజకీయాలు చేస్తూ, ప్రజాధనానికి అసలైన కాపాలాదారుడుని అంటూ ప్రచారం చేసుకోవడం నేర న్యాయ వ్యవస్థకే నగుబాటు.

న్యాయం ఆలస్యం ప్రజాస్వామ్యానికి ప్రమాదం. సీబీఐ, ఈడీ లాంటి రాజ్యాంగ వ్యవస్థలు తమ స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఈ వ్యవస్థలు నిక్కచ్చిగా, నిజాయతీగా వ్యవహరించకపోతే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది. విచారణలు వేగంగా, నిష్పక్షపాతంగా జరగాలి. దోషులు ఎంతటి శక్తివంతులైనా శిక్షలు తప్పవనే నమ్మకం ప్రజల్లో కలిగించాలి. ఇప్పటికైనా తెలంగాణ హైకోర్టు ఈడీ పిటిషన్‌ను తీవ్రంగా పరిగణించాలి. ఈ కేసులను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా రోజువారీ  విచారణ జరపాలి. అప్పుడే ఈ దేశంలో న్యాయ వ్యవస్థపై, రాజ్యాంగంపై ప్రజలకున్న కొద్దిపాటి నమ్మకమైనా మిగులుతుంది. లేదంటే, ధనమూ, బలము ఉన్నవాళ్లకు చట్టం చుట్టం  అనే ముద్ర చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుంది..

- మన్నవ సుబ్బారావు,
గుంటూరు మిర్చి యార్డ్ మాజీ ఛైర్మన్

# గ్రామీణాభివృద్ధికి రహదారుల బలోపేతం కీలకం

- ఆత్మకూరులో రూ.8.91 కోట్లతో నాలుగు లేన్ల రహదారి అభివృద్ధి
- రహదారికి వాయుపుత్ర మార్గ్‌గా నామకరణం
- మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్











మంగళగిరి/ ఆత్మకూరు (చైతన్య రథం): గ్రామీణ మౌలిక సదుపాయాల బలోపేతమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆత్మకూరు ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేస్తూ, ఎన్‌హెచ్-67 నుంచి ఆత్మకూరు బైపాస్ వరకు రూ. 8.91 కోట్ల వ్యయంతో నాలుగు లేన్ల రహదారిని అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. మొత్తం 2.2 కిలోమీటర్లమేర ఆధునిక హంగులతో రూపుదిద్దుకున్న రహదారికి వాయుపుత్ర మార్గ్‌గా నామకరణం చేశారు. మంగళవారం మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి ఆత్మకూరు రహదారిని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... "ఆత్మకూరు ప్రజల చిరకాల స్వప్నమైన ఎన్‌హెచ్-67 నుంచి ఆత్మకూరు బైపాస్ వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులు సాకారం కావడం ఎంతో సంతోషకరం. ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించడంతో పాటు, ట్రాఫిక్ సమస్యలను తగ్గించి, ఈ ప్రాంత అభివృద్ధికి మరింత ఊతమిచ్చే లక్ష్యంతో మొత్తం రూ. 8.91 కోట్లతో ఈ అభివృద్ధి పనులు చేపట్టాం. దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రత్యేక విజ్ఞప్తి మేరకు చేపట్టిన పనుల్లో భాగంగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ. 6.31 కోట్ల వ్యయంతో 2.2 కిలోమీటర్ల మేర నాలుగు లైన్ల రహదారిని విస్తరించాం. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధుల ద్వారా రూ. 2.6 కోట్లతో సెంట్రల్ డివైడర్, వీధి దీపాలు, సుందరీకరణ తదితర పనులు నిర్వహించామన్నారు.

ఆత్మకూరు పట్టణ ప్రజలు నిత్యం జాతీయ రహదారి ఎన్‌హెచ్-67కు చేరుకునేందుకు ఈ మార్గంపైనే ఆధారపడేవారు. ఇరుకైన రహదారి, గుంతల కారణంగా స్థానికులు, విద్యార్థులు, రైతులు రాకపోకల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్యను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టడంతో జాతీయ రహదారిని తలపించేలా నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ రహదారిని అభివృద్ధి చేశాం. ఈ రహదారి సమీపంలోని ఆలయంలో 50 అడుగుల ఎత్తైన ఆంజనేయస్వామి విగ్రహం కొలువై ఉంది. భక్తుల విశ్వాసానికి, ఆధ్యాత్మిక భావాలకు ప్రతీకగా నిలిచిన ఈ విగ్రహం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, రహదారికి వాయుపుత్ర మార్గ్ అని నామకరణం చేస్తున్నామని వెల్లడించారు.

**పల్లె పండుగతో గ్రామీణ రహదారుల అభివృద్ధి**

రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రహదారులను బలోపేతం చేసేందుకు పల్లె పండుగ 1.0, 2.0 కార్యక్రమాల కింద 9 వేల కిలోమీటర్లకు పైగా సీసీ రోడ్లు నిర్మించగా, మరో 10 వేల కిలోమీటర్ల బీటీ రోడ్లు మంజూరు చేశాం. ఆ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో పల్లె పండుగ 3.0 కార్యక్రమం ద్వారా మరో 6 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశాం. వ్యవసాయ క్షేత్రాలకు రాకపోకలు సులభతరం చేసేందుకు 161 డొంక రోడ్ల నిర్మాణానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు, రైతులు, విద్యార్థులు, స్థానిక ప్రజల ప్రయాణ ఇబ్బందులను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది" అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. సంగం మండలం వీర్లగుడిపాడు గ్రామానికి వెళ్లే మార్గంలో వంతెన నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కోరగా, వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు, అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్‌ను ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. అదేవిధంగా, తాగునీటి సమస్యను ప్రస్తావించగా.. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార కింద ఇప్పటికే రూ. 72 కోట్లతో 391 సింగిల్ విలేజ్ స్కీమ్స్‌ను ముందుకు తీసుకువెళ్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని స్పష్టం చేశారు.

**మంత్రి ఆనం సారథ్యంలో..**

రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సారథ్యంలో ఆత్మకూరు పట్టణ అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడింది. పట్టణంలో వాయుపుత్ర మార్గ్ బైపాస్ రహదారి ప్రారంభోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గతంలో రెండు వరుసలుగా ఉన్న రహదారిని, మధ్యలో డివైడర్‌తోపాటు సెంట్రల్ లైటింగ్, బ్యూటిఫికేషన్, మెరుగైన రహదారి సదుపాయాలతో నాలుగు వరుసలుగా తీర్చిదిద్దారు. దీనిపై ఆత్మకూరు పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేరుతో ఆత్మకూరు అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్ కళ్యాణ్ తరఫున ప్రసాదాలను, అయోధ్య శ్రీరాముని ప్రతిమను వేద పండితులు, మంత్రి ఆనం కుమార్తె లీలా కైవల్య రెడ్డి, స్థానిక మహిళలు మంత్రి ఆనంకు అందజేశారు. కార్యక్రమంలో నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా హాజరయ్యారు. మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ బాలూ నాయక్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా, ఆహ్లాదభరితంగా సాగింది.

**ప్రజల కృతజ్ఞతలు**

తమ చిరకాల కోరికను నెరవేర్చినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఆత్మకూరు ప్రజానీకం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.

---

# ఈడీ విచారణకు జగన్ వెనుకడుగు

- కేడీ బండారం బయటపడుతుందనా?
- నిజంగానే వ్యవస్థలు తమ చేతుల్లో ఉంటే 13 ఏళ్లుగా జగన్ బెయిల్ మీద ఉండేవారా?
- రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం నుంచి జగన్మోహన్ రెడ్డి శాశ్వతంగా తెరమరుగు ఖాయం
- టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్ ఆగ్రహం



అమరావతి (చైతన్య రథం): గడచిన దశాబ్ద కాలంగా అక్రమాస్తుల కేసుల విచారణ జరగకుండా డిశ్చార్జ్ పిటిషన్ల మాటున తప్పించుకు తిరుగుతున్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి బండారం బట్టబయలవు తోందని టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం మంగళగిరి లోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... జగన్ అక్రమాస్తుల కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేసి పదేళ్లు దాటినా, రోజువారీ ప్రాతిపదికన విచారణ జరగకుండా నిందితులు అడ్డుకుంటున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిందని గుర్తుచేశారు. 2013 సెప్టెంబర్ 23న కోర్టుకు వినయ విధేయతలు ప్రదర్శించి, దర్యాప్తునకు సహకరిస్తానని కండిషనల్ బెయిల్‌పై బయటకు వచ్చిన జగన్.. 13 ఏళ్ల 20 రోజులుగా విచారణ ముందుకు సాగకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు.

ముఖ్యమంత్రి కాకముందు పాదయాత్రకు సైతం విరామమిచ్చి ప్రతి శుక్రవారం కోర్టుకు హాజరైన జగన్, అధికారంలోకి రాగానే తన భద్రత పేరుతో ప్రజాధనం రూ. 60 లక్షలు ఖర్చవుతుందంటూ వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు పొందారని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఘోరంగా తిరస్కరించి రెండేళ్లు దాటినా, కనీసం అసెంబ్లీకి కూడా రాని జగన్ నేటికీ కోర్టు మెట్లు ఎక్కకపోవడం చట్టాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. వరుసగా ఏడుగురు సీబీఐ జడ్జిలు మారినా డిశ్చార్జ్ పిటిషన్లు ఎక్కడి గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని, ఈడీ స్వయంగా కోర్టును ఆశ్రయించి విచారణ వేగవంతం చేయాలని కోరితే.. సాక్షి పత్రికలో 'ఈడీ ఎల్లో కేడీ' అంటూ తప్పుడు రాతలు రాయిస్తున్నారని ధ్వజమెత్తారు.

వివేకా హత్య కేసు మొదలైన నాటినుంచి సాక్షి పత్రిక విశ్వసనీయత కోల్పోయిందని రాజేష్ ఎద్దేవా చేశారు. మొదట గుండెపోటుగా ప్రచారం చేసి, ఆపై 'నారాసుర రక్త చరిత్ర' అంటూ చంద్రబాబుపై నెపం మోపి, చివరకు వివేకా కుమార్తె సునీత న్యాయపోరాటం చేస్తుంటే వివేకా వ్యక్తిత్వాన్నే కించపరిచేలా కథనాలు రాయించిన చరిత్ర సాక్షి యాజమాన్యానిదని నిలదీశారు. ఇప్పుడు ఈడీ తలుపు తడుతుంటే చంద్రబాబు ఆదేశాలతో నడుస్తోందని అవాకులు చవాకులు పేలడం హాస్యాస్పదమన్నారు. నిజంగానే వ్యవస్థలు తమ చేతుల్లో ఉంటే 13 ఏళ్లుగా బెయిల్ వెసులుబాటు అనుభవిస్తూ జగన్ రాజకీయాలు చేయగలిగేవారా? అని ప్రశ్నించారు. బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఓఎస్డీ సత్యప్రసాద్, మాజీ ఎక్సైజ్ కమిషనర్ రజత్ భార్గవ్‌లు మేజిస్ట్రేట్ ఎదుట ఇచ్చిన వాంగ్మూలాలు నేరుగా తాడేపల్లి ప్యాలెస్‌నే ప్రధాన సూత్రధారిగా నిరూపిస్తుండటంతో జగన్ ముఠాలో వణుకు మొదలైందన్నారు.

వివేకా హత్య కోసం చేతులు మారిన రూ. 40 కోట్ల భారీ సుపారీ, హవాలా మూలాలను ఈడీ తవ్వి తీస్తుండటంతో తాడేపల్లి పునాదులు కదులుతున్నాయని అప్పసాని రాజేష్ పేర్కొన్నారు. ఏపీలో ఉంటే న్యాయం జరగదని సుప్రీంకోర్టు స్వయంగా విచారణను తెలంగాణకు బదిలీ చేసినప్పుడే జగన్ నైతిక బాధ్యతతో రాజీనామా చేసి ఉండాల్సిందన్నారు. అక్రమాస్తుల కేసుల్లో క్విడ్ ప్రోకో ద్వారా తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని వేల కోట్లు కొల్లగొట్టిన ఆధారాలను సీబీఐ, ఈడీలు ట్రంకు పెట్టెల కొద్దీ కోర్టుకు సమర్పించాయని గుర్తుచేశారు. కోర్టులను, దర్యాప్తు సంస్థలను మేనేజ్ చేయవచ్చనే జగన్ బరితెగింపు ఇంకెంతో కాలం సాగదని, త్వరలోనే న్యాయ విచారణలన్నీ కొలిక్కి వచ్చి ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రం నుంచి జగన్మోహన్ రెడ్డి శాశ్వతంగా తెరమరుగు కావడం ఖాయమని స్పష్టం చేశారు.

చైతన్యరథం

# క్వాంటం వ్యాలీలో ట్విన్ టవర్లకు శంకుస్థాపన

- 47 అంతస్తులు.. 206 మీటర్ల ఎత్తుతో టీ1, టీ2 నిర్మాణం
- 11 ఎకరాల్లో 37.48 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణాలు
- ట్విన్ టవర్లు అందుబాటులోకి వస్తే 25 వేలమంది ఉపాధికి ఛాన్స్
- క్వాంటం కంప్యూటింగ్‌తో విప్లవాత్మక మార్పులు ఖాయం
- పురపాలక మంత్రి మంత్రి నారాయణ వెల్లడి



అమరావతి (చైతన్య రథం): రాజధాని అమరావతిలో క్వాంటం టెక్నాలజీ రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా కీలక అడుగు పడింది. ఉద్దండరాయునిపాలెంలోని క్వాంటం వ్యాలీలో ట్విన్ టవర్స్ నిర్మాణానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ శంకుస్థాపన చేశారు. సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన 11 ఎకరాల్లో నిర్మించనున్న టవర్లకు మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు.

**47 అంతస్తులు.. 206 మీటర్ల ఎత్తు**

క్వాంటం వ్యాలీ ప్రాజెక్టులో భాగంగా మొత్తం 50 ఎకరాల్లో అభివృద్ధి పనులు చేపడుతుండగా, తాజాగా శంకుస్థాపన చేసిన ట్విన్ టవర్స్‌ను 11 ఎకరాల్లో నిర్మించనున్నారు. ఒక్కో టవర్‌లో 47 అంతస్తులు ఉండగా, 206 మీటర్ల ఎత్తుతో నిర్మించనున్నారు. రెండు టవర్లలో కలిపి 37,48,847 చదరపు అడుగుల నిర్మిత విస్తీర్ణం అందుబాటులోకి రానుంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనలు, నూతన ఆవిష్కరణలకు అవసరమైన సదుపాయాలతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక కార్యాలయ ప్రాంగణాలను ఏర్పాటు చేయనున్నారు.

**మొత్తం ఎనిమిది టవర్ల నిర్మాణం**

క్వాంటం వ్యాలీ ప్రాజెక్టులో మొత్తం ఎనిమిది టవర్లను నిర్మించనున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. ట్విన్ టవర్స్ అందుబాటులోకి వస్తే సుమారు 25 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో అత్యాధునిక సాంకేతిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు.

**పలు రంగాల్లో క్వాంటం కంప్యూటింగ్ కీలకం**

క్వాంటం కంప్యూటింగ్ ద్వారా రక్షణ, వైద్యం, బ్యాంకింగ్ వంటి కీలక రంగాల్లో గణనీయమైన మార్పులు సాధ్యమవుతాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు. సంక్లిష్ట సమస్యలను పరిష్కరించడంలో ఈ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని అంచనా వేయడం, వాటివల్ల కలిగే నష్టాలను తగ్గించే పరిష్కారాలను రూపొందించడం వంటి అంశాల్లోనూ ఉపయోగపడుతుందని వివరించారు.

**నిర్ణీత సమయంలో నిర్మాణాలు పూర్తి చేస్తాం**

క్వాంటం వ్యాలీలో నిర్మాణాలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి, యువతకు విస్తృతంగా ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. ప్రపంచస్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ అమరావతిని అధునాతన సాంకేతిక రంగానికి కీలక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ట్విన్ టవర్స్ అందుబాటులోకి రావడంతో రాజధానిలో పరిశోధన, నూతన ఆవిష్కరణలు, క్వాంటం టెక్నాలజీ రంగాలకు మరింత ప్రోత్సాహం లభించనుంది. తద్వారా అమరావతి అంతర్జాతీయ స్థాయి సాంకేతిక కేంద్రంగా ఎదిగేందుకు బాటలు పడనున్నాయి.

# శ్రీశైలం ప్రాజెక్టుకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

*- తెలుగు రాష్ట్రాలకే గర్వకారణమన్న మంత్రి గొట్టిపాటి*



అమరావతి (చైతన్య రథం): "శ్రీశైలం ప్రాజెక్టుకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కడం తెలుగు రాష్ట్రాలకే గర్వకారణం" అని విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వ్యాఖ్యానించారు. విద్యుదుత్పత్తితో పాటు ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందిస్తున్న బహుళార్థ సాధక ప్రాజెక్టు శ్రీశైలమని పేర్కొన్నారు. భారీ వరదలను తట్టుకున్న శ్రీశైలం డ్యామ్ నిర్మాణ పటిష్టతకు అంతర్జాతీయ గుర్తింపు దక్కడం ఆనందదాయకమని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా లక్షలాది ప్రజల తాగునీటి, సాగునీటి అవసరాలను ఈ జలాశయం తీరుస్తోందని గుర్తు చేశారు.

**పట్టిసీమతో రాయలసీమకు ప్రయోజనం**

ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపుతో పట్టిసీమ ప్రాజెక్టు అందుబాటులోకి తేవడంవల్ల రాయలసీమకు శ్రీశైలం జలాల వినియోగంలో ఎంతో ప్రయోజనం కలిగిందని మంత్రి స్పష్టం చేశారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు 500టీఎంసీ నీటిని అందించడంతో, శ్రీశైలం జలాలను రాయలసీమ అవసరాలకు వినియోగించుకునేందుకు వెసులుబాటు కలిగిందని వివరించా రు. కృష్ణా డెల్టా రైతులకు నీరందిస్తూనే రాయలసీమ సాగు, తాగునీటి అవసరాలకు శ్రీశైలం జలాశయం అండగా నిలుస్తోందని ఆయన అన్నారు.

**చంద్రబాబు దూరదృష్టి**

జలవనరుల సమర్థ వినియోగం, ప్రజల అవసరాలకు ప్రాధాన్యమివ్వడంలో చంద్రబాబు దూరదృష్టి స్పష్టమవుతోందని మంత్రి పేర్కొన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు ఇంజినీరింగ్ పటిష్టత, విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, బహుముఖ ప్రయోజనాలకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు నిదర్శనమని మంత్రి గొట్టిపాటి తెలిపారు.




# డీఎస్సీ-2026 ద్వారా 2,721 ఉపాధ్యాయ పోస్టుల

## భర్తీకి షార్ట్ నోటిఫికేషన్ విడుదల

అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ-2026 ద్వారా 2,721 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతించింది. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ అక్టోబర్ 13న ఉత్తర్వులు జారీ చేయగా, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ అదే రోజు షార్ట్ నోటిఫికేషన్‌ను అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేశారు.

**పోస్టుల వివరాలు:**

- ప్రభుత్వ, జెడ్పీ, ఎంపీపీ, మున్సిపల్ పాఠశాలలు: 2,111 పోస్టులు
- స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ): 906
- సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ): 1,205
- ప్రత్యేక విద్య (స్పెషల్ ఎడ్యుకేషన్): 350 పోస్టులు
- స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ-ఎస్ఈ): 150
- సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ-ఎస్ఈ): 200
- సొసైటీలు, ఇతర యాజమాన్యాలు: 260 పోస్టులు
- ప్రిన్సిపాళ్లు: 30
- పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు (పీజీటీ): 81
- ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు (టీజీటీ): 113
- ఫిజికల్ డైరెక్టర్లు (పీడీ): 2
- ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు (పీఈటీ): 34
- నవంబర్ 3లోగా పూర్తి నోటిఫికేషన్

పోస్టుల వారీగా ఖాళీల వివరాలు, విద్యా మరియు వృత్తిపరమైన అర్హతలు, వయోపరిమితి, అర్హత ప్రమాణాలు, ముఖ్యమైన తేదీలు, ఇతర మార్గదర్శకాలతో కూడిన పూర్తి నోటిఫికేషన్‌ను నవంబర్ 3, 2026లోగా అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేయనున్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) రూపంలో నిర్వహించనున్నారు. పరీక్ష తేదీలను పూర్తి నోటిఫికేషన్‌లో వెల్లడిస్తారు. పరీక్ష సిలబస్ ఇప్పటికే అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంది. జిల్లాల వారీగా, సొసైటీలవారీగా ఖాళీల వివరాలను అనుబంధాల రూపంలో ప్రకటించారు. ప్రస్తుతం వెల్లడించిన ఖాళీలు తాత్కాలికమైనవని, రోస్టర్‌తో సహా తుది ఖాళీల వివరాలను పూర్తి నోటిఫికేషన్‌లో ప్రకటిస్తామని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. పూర్తి వివరాల కోసం అభ్యర్థులు https://tet2dsc.apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

# హజ్-2027 ఏర్పాట్లపై చైర్మన్ హసన్ బాషా కీలక సమావేశం



ముంబై: ముంబైలోని హజ్ కమిటీ ఆఫ్ ఇండియా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ బాషా, హజ్ కమిటీ ఆఫ్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) షానవాజ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హజ్-2027 యాత్రకు సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. హజ్ యాత్రికులకు అవసరమైన సౌకర్యాల కల్పన, యాత్ర నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, సేవల మెరుగుదల, యాత్రికులకు మరింత మెరుగైన సహకారం అందించడం వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు. హజ్ యాత్రికుల ప్రయోజనాలకు ప్రాధాన్య తనిస్తూ, హజ్-2027 యాత్రను సజావుగా నిర్వహిం చేందుకు సంబంధిత విభాగాల మధ్య సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం హజ్ యాత్రికుల సంక్షేమానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తోందని హసన్ బాషా పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మైనార్టీ సంక్షేమ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆదేశాల మేరకు యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

# రహదారుల అభివృద్ధికి కూటమి ప్రత్యేక ప్రాధాన్యత

- మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పనే లక్ష్యం
- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వెల్లడి
- నంద్యాలలో రూ.4.5 కోట్లతో రహదారి అభివృద్ధి పనులు ప్రారంభం



నంద్యాల (చైతన్య రథం): రాష్ట్రవ్యాప్తంగా రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాల మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. రహదారి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజల రాకపోకలను సులభతరం చేస్తూ, రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తున్నామని పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలో రూ.4.5 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులను రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, ఎన్ఎండి ఫరూక్ ప్రారంభించారు. సంజీవనగర్ నుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు మంత్రులు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ, రహదారులు మెరుగుపడితే ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు పెరగడంతోపాటు రవాణా వ్యవస్థ మరింత సమర్థవంతంగా మారుతుందని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తూ, రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రహదారి సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# బీసీల రాజకీయ సాధికారతకు కూటమి పెద్దపీట

- స్థానిక సంస్థల్లో బీసీలకు 40 శాతానికి పైగా ప్రాతినిధ్యం
- వైసీపీ పాలనలో రిజర్వేషన్లు 34 నుంచి 24 శాతానికి కోత
- బీసీ నాయకత్వానికి రక్షణగా త్వరలో బీసీ రక్షణ చట్టం
- మీడియా సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టీకరణ

మంగళగిరి (చైతన్య రథం): బీసీల రిజర్వేషన్లకు వైసీపీ ప్రభుత్వం కోత విధిస్తే, కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల్లో 40 శాతానికి పైగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తూ బీసీలకు భరోసా ఇస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో చిత్తశుద్ధితో చేసిన ప్రయత్నాల ఫలితంగానే ఇది సాధ్యమైందని, ఇందుకు ఆయనకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని చెప్పారు.

**బలహీన వర్గాలకు టీడీపీ పునాదులు**

బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా పునాదులు వేసిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని రవీంద్ర అన్నారు. పార్టీ ఆవిర్భావానికి ముందు బలహీన వర్గాలు అనేక ప్రాంతాల్లో ఆధిపత్య వ్యవస్థల కింద అణచివేతకు గురయ్యాయని, ఆవిర్భావం తర్వాతే వారికి ప్రత్యేక గుర్తింపు లభించిందని చెప్పారు. పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేసి, మండల వ్యవస్థను తీసుకొచ్చి రాజకీయ చైతన్యం కల్పించిన ఘనత స్వర్గీయ ఎన్టీ రామారావుదేనని పేర్కొన్నారు. ఎన్టీఆర్ తొలుత 20 శాతం రిజర్వేషన్లు కల్పించగా, చంద్రబాబు నాయుడు వాటిని 34 శాతానికి పెంచారని, దాదాపు 1996-97 నుంచి ఇవి కొనసాగుతూ వచ్చాయని గుర్తుచేశారు.

**వైసీపీ హయాంలో కోత**

2019లో అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి ప్రభుత్వం 2020-21 స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో బీసీ రిజర్వేషన్లను 34 నుంచి 24 శాతానికి తగ్గించిందని మంత్రి ఆరోపించారు. తమ అనుయాయులతో న్యాయస్థానాల్లో కేసులు వేయించి, సరైన న్యాయవాదులను నియమించకుండా, తగిన వాదనలు వినిపించకుండా వ్యవహరించారని



విమర్శించారు. సొంత కేసుల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసే జగన్, బీసీల రిజర్వేషన్ల విషయంలో మాత్రం చిత్తశుద్ధి చూపలేదన్నారు. బీసీ నాయకులు, ప్రజలు తెలుగుదేశం పార్టీతో ఉన్నారన్న అక్కసుతోనే, వారిని రాజకీయంగా అణచివేయాలనే ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. ఈ కోతవల్ల సుమారు 16,800 మంది బీసీలు స్థానిక సంస్థల్లో చట్టబద్ధంగా పొందాల్సిన పదవులు కోల్పోయారని అన్నారు.

**కూటమి ప్రభుత్వ చర్యలు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీ రిజర్వేషన్లపై ప్రత్యేక దృష్టి సారించి, రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం కనీసం కమిషన్‌ను కూడా నియమించలేదని విమర్శించారు. కమిషన్ ద్వారా సర్వే నిర్వహించి, నివేదిక సిద్ధం చేసి రిజర్వేషన్ల అంశంపై ముందుకు సాగుతోందని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోతే 16వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన సుమారు రూ.12,500 కోట్ల నిధులు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని, అందుకే ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. తొలుత 34 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లాలని అసెంబ్లీ సాక్షిగా నిర్ణయించి, ఆ దిశగా చర్యలు చేపట్టిన సమయంలో మళ్లీ కోర్టుల్లో కేసులు వేయించి అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. ప్రభుత్వం హైకోర్టుతో పాటు సుప్రీం కోర్టులోనూ న్యాయపోరాటం చేసినా, అమలులో ఎదురైన పరిస్థితులను పరిశీలించి, సాధ్యమైన మార్గాల్లో బీసీలకు ఎక్కువ ప్రాతినిధ్యం కల్పించే నిర్ణయం తీసుకుందని మంత్రి వెల్లడించారు.

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పరిమితులకు అదనంగా పార్టీపరంగా బీసీలకు టికెట్లు ఇచ్చి, పార్టీ అభ్యర్థులుగా పోటీ చేసే అవకాశం కల్పించడం ద్వారా 40 శాతానికి పైగా ప్రాతినిధ్యం లభించేలా తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నాయన్నారు. 24 శాతం నుంచి 40 శాతానికి పైగా ప్రాతినిధ్యం పెరగడం బీసీల రాజకీయ సాధికారతకు దోహదపడుతుందన్నారు. ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, భారతీయ జనతా పార్టీ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**కులవృత్తులకు ఆర్థిక దన్ను**

బీసీ సామాజిక వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని కొల్లు రవీంద్ర అన్నారు. బీసీ కార్పొరేషన్లను గాడిలో పెట్టి, ఆయా వర్గాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వడ్డెరలకు నిర్మాణ రంగం, భవన నిర్మాణం, రోడ్లకు అవసరమైన కంకర సరఫరా పనుల్లో 32 శాతం కేటాయింపులు; కల్లుగీత కార్మికులకు రాష్ట్రంలోని మద్యం దుకాణాల్లో 10 శాతం కేటాయింపులు; చేనేత కార్మికులకు నేతన్న సేవ పథకం కింద ఏటా రూ.25 వేలు, మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్; నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కనీస వేతనం రూ.25 వేలకు పెంపు; మత్స్యకారులకు వారి హక్కుల పరిరక్షణలో భాగంగా గత ప్రభుత్వం తెచ్చిన జీవో నంబర్ 217 రద్దు, మత్స్యకార సేవ పథకం ద్వారా ఏటా రూ.20 వేల సాయం, వలలు, పడవల పంపిణీ, మొత్తం సుమారు రూ.400 కోట్ల మేర ప్రయోజనం కల్పించామన్నారు. విద్యారంగంలోనూ బీసీ పిల్లలకు మెరుగైన అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి వెల్లడించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ప్రత్యేక విద్యా కార్యక్రమాలతో పాటు తల్లికి వందనం పథకం ద్వారా చదువుకు ఆర్థిక సహకారం అందిస్తున్నామన్నారు. పిల్లల సంఖ్యతో సంబంధం లేకుండా అర్హులైన కుటుంబాలకు ఈ పథకం వర్తింపజేయడంవల్ల ఎక్కువమంది విద్యార్థులకు చదువుకునే అవకాశం లభిస్తోందని తెలిపారు. కులవృత్తులు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగాల్లోనూ బీసీలకు అవకాశాలు పెరుగుతున్నాయన్నారు.

**బీసీ నాయకులపై వేధింపులు, త్వరలో రక్షణ చట్టం**

గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో బీసీ నాయకత్వాన్ని అణచివేసే ప్రయత్నాలు జరిగాయని మంత్రి ఆరోపించారు. అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు, యనమల రామకృష్ణుడు, కొల్లు రవీంద్ర, బీద రవిచంద్ర, పల్లా శ్రీనివాస్‌వంటి బీసీ నాయకులపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని గుర్తుచేశారు. పల్లా శ్రీనివాస్ ఇంటిపై దాడి చేయడం, బీసీ నాయకులను జైళ్లకు పంపడంవంటివి బలహీన వర్గాలను రాజకీయంగా దెబ్బతీసే ప్రయత్నాల్లో భాగమని విమర్శించారు. తోట చంద్రయ్య, నందం సుబ్బయ్య, అమర్‌నాథ్ గౌడ్ ఘటనలను ప్రస్తావిస్తూ, బీసీలపై జరిగిన దాడులు, హత్యలు, వాటి కేసుల విషయంలో గత ప్రభుత్వ వైఖరిని ప్రజలు మర్చిపోలేరన్నారు. బీసీలకు రాజకీయంగా రావాల్సిన పదవులను దూరం చేసిన వైసీపీని ఆ వర్గాలు ఎప్పటికీ క్షమించవని వ్యాఖ్యానించారు. బీసీ నాయకత్వానికి రక్షణ కల్పించేందుకు యువ నాయకుడు నారా లోకేష్ ఆధ్వర్యంలో బీసీ రక్షణ చట్టం ముసాయిదా సిద్ధమైందని, త్వరలోనే చట్టాన్ని తీసుకురానున్నామని తెలిపారు.

**వైసీపీ విమర్శలకు ఖండన**

గొడ్డలి పార్టీ వైసీపీ నేతల విమర్శలను మంత్రి ఖండించారు. గుడ్డ కాల్చి ముఖంపై వేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. వల్లభనేని వంశీ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ, నోరు ఉందని ఇష్టానుసారం మాట్లాడటం, వయసు, వ్యక్తులపట్ల గౌరవం లేకుండా వ్యవహరించడం తగదన్నారు. బెదిరింపుల రాజకీయాలకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదని, దర్యాప్తు సంస్థల విచారణ నుంచి ఎవరూ ఎక్కువ కాలం తప్పించుకోలేరని వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలున్నాయని చూపించి ప్రజలను భయపెట్టడంకు, పెట్టుబడులు రాకుండా చేసేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు పారదర్శకంగా జరిగినప్పటికీ, అభ్యర్థులు శాంతియుతంగా సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన సమయంలో సచివాలయ ఉద్యోగుల సంఘం కార్యాలయం వద్ద జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ, ప్రతిపక్షం అనవసరంగా ఉద్రిక్తతలు సృష్టిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడ నేరాలు జరిగినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా సమీక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. శాంతిభద్రతలు మెరుగ్గా ఉండటంతోనే రాష్ట్రానికి రూ.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందకూడదని, ప్రజలకు సంక్షేమ పథకాలు అందకూడదని, స్థానిక సంస్థల ఎన్నికలు జరగకూడదని వైసీపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా మరిన్ని అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

# దివ్యాంగులంటే మాకు గౌరవం, అభిమానం

**పాలకొల్లులో రూ.1.10 కోట్ల సహాయ ఉపకరణాలు పంపిణీ - కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మతో కలిసి పంపిణీ చేసిన మంత్రి నిమ్మల**

పాలకొల్లు (చైతన్య రథం): "భగవంతుని స్వరూపమైన దివ్యాంగులంటే మాకు గౌరవం, అభిమానం" అని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో దివ్యాంగులకు ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీ మెగా శిబిరాన్ని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మతో కలిసి ఆయన నిర్వహించారు. సెయిల్ సీఎస్ఆర్ నిధులతో రూ.1.10 కోట్ల విలువైన 540 సహాయ ఉపకరణాలను 365 మంది దివ్యాంగులకు మంత్రులు ఇద్దరూ అందజేశారు. శిబిరంలో దివ్యాంగులతో మమేకమైన మంత్రులు వారి సమస్యలు, అవసరాలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు.

**"అసలైన వికలాంగులు వారే"**

అన్ని అవయవాలు సక్రమంగా ఉండి చెడు మార్గంలో నడిచేవారే అసలైన వికలాంగులని నిమ్మల వ్యాఖ్యానించారు. రక్తపాతం, విధ్వంసం వైపు



నడిపించే రాజకీయాలకు భిన్నంగా కూటమి ప్రభుత్వం ప్రేమ, దయ, సేవాభావాన్ని పెంపొందిస్తోందని ఆయన పేర్కొన్నారు. "2005లో నా తండ్రి పేరుతో ఫౌండేషన్ ఏర్పాటు చేశాం.



పాలకొల్లు నియోజకవర్గంలో 100 మంది వృద్ధులు, 100 మంది దివ్యాంగులను దత్తత తీసుకుని సంరక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్నాం" అని మంత్రి వివరించారు. సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పెన్షన్ అందని దివ్యాంగులకు తమ సొంత నిధులతో, దాతల సహకారంతో ప్రతినెలా ఆర్థిక సాయం అందిస్తున్నామని స్పష్టం చేశారు.

**కూటమి ప్రభుత్వ లక్ష్యం.. సంక్షేమం**

వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు రూ.4 వేలు, రూ.6 వేలు, రూ.10 వేలు, రూ.15 వేల వరకు పెన్షన్లు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని నిమ్మల అన్నారు. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది కూడా ఈ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. అభివృద్ధి, సంక్షేమంతోపాటు సీఎస్ఆర్ నిధులను సమీకరించి ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. దివ్యాంగుల సంక్షేమం, ఆత్మగౌరవం, స్వావలంబనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్పష్టం చేశారు. శిబిరానికి వచ్చిన వందలాది దివ్యాంగులకు మంత్రి నిమ్మల రామానాయుడు టిఫిన్, భోజనం, పానీయాల ఏర్పాట్లు చేశారు.

## డ్వాక్రా మహిళా పారిశ్రామికవేత్తలకు

# ‘స్త్రీనిధి’ భారీ ఊతం

- **48 గంటల్లోనే రు.3 లక్షల వరకు రుణం**
- **3 లక్షల లోపు పీఎంఎఫ్ఎంఈ సబ్సిడీ రుణాలు స్త్రీ నిధి ద్వారా మంజూరు**
- **మహిళా సాధికారతే కూటమి ప్రభుత్వ లక్ష్యం**
- **11 శాతం వడ్డీకే రూ.3 లక్షల స్త్రీనిధి రుణాలు: మంత్రి కొండపల్లి శ్రీనివాస్**




విజయవాడ (చైతన్య రథం): ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా ‘స్త్రీనిధి ఆంధ్రప్రదేశ్’ ద్వారా ప్రత్యేక మహిళా పారిశ్రామికవేత్తల రుణ పథకాన్ని ప్రారంభించినట్టు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన ప్రతి స్వయం సహాయక సంఘం మహిళకు రూ.3 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పిస్తామని.. ఒక్కో స్వయం సహాయక సంఘం నుంచి గరిష్టంగా ముగ్గురి చొప్పున అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. 48 గంటల్లోనే రుణం మంజూరు అవుతుందని.. వడ్డీ యేడాదికి 11శాతం మాత్రమేనని మంత్రి తెలిపారు. డిజిటల్, బయోమెట్రిక్ ప్రక్రియతో పాటు 2024-25 నుంచి 8 అక్టోబర్ 2026 వరకు సుమారు 17.96 లక్షల మంది మహిళలకు రూ.14,467.12 కోట్ల రుణాలు మంజూరు చేసినట్టు మంత్రి పేర్కొన్నారు. డిజిటల్ విధానంలో రూ.4,443.13 కోట్లు వసూలు కాగా.. గ్రామ సంస్థల కోసం రూ.6 కోట్ల విలువైన 30,000 బయోమెట్రిక్ పరికరాల పంపిణీ చేశామన్నారు. 98శాతంతో ఆదర్శవంతమైన రికవరీ రేటు కూడా నమోదైందని మంత్రి స్పష్టం చేశారు. ఎస్‌హెచ్‌జీ రుణ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.17 లక్షలకు, గ్రామ సంస్థల పరిమితిని రూ.1.50 కోట్లకు పెంచామన్నారు. పిల్లల చదువులు, వివాహాలకు 4శాతం వడ్డీ రాయితీతో విద్యా, వివాహ రుణాలు మంజూరు చేయడంతో పాటు పీఎంఎఫ్ఎంఈ పథకం కింద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు సబ్సిడీ రుణాలు, గిరిజన ప్రాంతాల మహిళలకు ప్రత్యేక స్వల్పకాలిక రుణాలు అందిస్తామన్నారు.

2026-27 సంవత్సరపు ఆర్థిక లక్ష్యంలో ఏకంగా రూ.3,000 కోట్లను కేవలం మహిళా పారిశ్రామికవేత్తల రుణాల కోసమే కేటాయించినట్టు మంత్రి పేర్కొన్నారు. రుణగ్రహీత మరణిస్తే కుటుంబానికి ఆసరాగా లోన్ ప్రొటెక్షన్ మరియు ప్రమాదవశాత్తు మరణ సహాయ పథకం వర్తిస్తుందన్నారు. మహిళా సాధికారత, పారిశ్రామికాభివృద్ధి, మరియు డిజిటల్ ఆర్థిక భాగస్వామ్యానికి ‘స్త్రీనిధి’ని ఒక ఆదర్శవంతమైన సంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు.



## కోటబొమ్మాళిలో వైభవంగా కొత్తమ్మతల్లి 101వ వార్షిక జాతర

**కొత్తమ్మతల్లికి పట్టువస్త్రాలు, సారె సమర్పించిన మంత్రులు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు**

కోటబొమ్మాళి (చైతన్య రథం): కోటబొమ్మాళిలో శ్రీశ్రీశ్రీ కొత్తమ్మతల్లి 101వ వార్షిక జాతర మహోత్సవాలు భక్తిశ్రద్ధలు, సంప్రదాయాల నడుమ అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. నేటినుంచి మూడు రోజులపాటు ఉత్సవాలు జరగనున్నాయి. ప్రభుత్వం తరపున రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కుటుంబ సమేతంగా హాజరై అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పించారు. కొత్తమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులకు దేవాదాయ శాఖ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని ఈ సందర్భంగా మంత్రులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**మూడోసారి రాష్ట్రస్థాయి పండువగా..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తమ్మతల్లి జాతరను వరుసగా మూడోసారి రాష్ట్రస్థాయి పండుగగా నిర్వహిస్తున్నారు. జాతర ప్రారంభంతో కోటబొమ్మాళి ఆధ్యాత్మిక సందడితో నిండిపోయింది. ఉత్సవాల్లో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడ్డాయి.

# త్వరలో కొత్తగా 22 డయాలసిస్ కేంద్రాలు

- **రోగుల అవసరాలకు అనుగుణంగా కొత్త కేంద్రాల ఏర్పాటు**
- **పేదలకు ఉపశమనం, సేవల విస్తృతికి ప్రభుత్వ ప్రాధాన్యం**
- **2025-26లో డయాలసిస్ సేవలకు రూ.197.88 కోట్లు వ్యయం**
- **ఈ ఏడాది ఇప్పటివరకు రూ.90.09 కోట్ల విలువైన సేవలు**
- **వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి**



అమరావతి (చైతన్య రథం): మూత్రపిండాల (కిడ్నీ) వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో రాష్ట్రంలో ప్రధానమంత్రి జాతీయ డయాలసిస్ కార్యక్రమం (పీఎంఎన్‌డీపీ) కింద మరో 22 కేంద్రాలు త్వరలో ఏర్పాటు కానున్నాయని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రోగుల అవసరాలు, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని వీటిని ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రంలో పీఎంఎన్‌డీపీ కింద 61 కేంద్రాలు పనిచేస్తున్నాయి. కొత్తవి కలిపితే వీటి సంఖ్య 83కు చేరుతుందని, ఉచిత డయాలసిస్ (రక్తశుద్ధి) సేవలు పేదలకు మరింత చేరువవుతాయని మంత్రి చెప్పారు. వీటికి అదనంగా డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా 170 కేంద్రాలు నడుస్తున్నాయని తెలిపారు.

**కూటమి ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు 14 కొత్త కేంద్రాలు**

పీఎంఎన్‌డీపీ కింద రాష్ట్రంలో 2019కు ముందు 28 కేంద్రాలు ఏర్పాటయ్యాయి. 2019-24 మధ్య 19 కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. 2024-25 నుంచి మరో 14 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు 22 కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వీటిలో పలు కేంద్రాల ఏర్పాటులో న్యాయస్థానంలో విచారణ వంటి కారణాలతో జాప్యం జరిగింది. ఈ 22 కేంద్రాలను రోగులకు సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఒక్కో డయాలసిస్ సెషన్‌కు ప్రభుత్వం రూ.999 వ్యయం చేయనుంది. ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఒక్కో సెషన్‌కు రూ.3,000 నుంచి రూ.4,000 వరకు ఖర్చవుతుంది. రోగుల ఆరోగ్య పరిస్థితిని బట్టి నెలకు నాలుగైదు సార్లు డయాలసిస్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉచితంగా రక్తశుద్ధి సేవలు అందుబాటులో ఉండటం బాధిత కుటుంబాలకు ఆర్థికంగా ఉపశమనం కలిగిస్తుంది.

**22 కేంద్రాలు.. ఎక్కడెక్కడంటే?**

**పశ్చిమగోదావరి:** భీమవరం ఏరియా ఆసుపత్రి
**చిత్తూరు:** పీలేరు ఏరియా ఆసుపత్రి
**వైఎస్సార్ కడప:** జమ్మలమడుగు ఏరియా ఆసుపత్రి, మైదుకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం
**కృష్ణా:** గన్నవరం సామాజిక ఆసుపత్రి, గుడివాడ ఏరియా ఆసుపత్రి
**ఎస్పీఎస్ఆర్ నెల్లూరు:** వెంకటగిరి, ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాలు
**బాపట్ల:** అద్దంకి, రేపల్లె సామాజిక ఆరోగ్య కేంద్రాలు
**తిరుపతి:** రైల్వేకోడూరు, సత్యవేడు సామాజిక ఆరోగ్య కేంద్రాలు
**ప్రకాశం:** కొండెపి సామాజిక ఆరోగ్య కేంద్రం
**తూర్పుగోదావరి:** కొవ్వూరు సామాజిక ఆరోగ్య కేంద్రం
**ఎన్టీఆర్:** నందిగామ సామాజిక ఆరోగ్య కేంద్రం
**పల్నాడు:** వినుకొండ సామాజిక ఆరోగ్య కేంద్రం, సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రి
**విజయనగరం:** బొబ్బిలి సామాజిక ఆరోగ్య కేంద్రం
**నంద్యాల:** డోన్ ఏరియా ఆసుపత్రి, సున్నిపెంట సామాజిక ఆరోగ్య కేంద్రం
**శ్రీ సత్యసాయి:** పెనుకొండ సామాజిక ఆరోగ్య కేంద్రం, మడకశిర ఏరియా ఆసుపత్రి

**ఒక్కో కేంద్రంలో 5 డయాలసిస్ మెషీన్లు**

కొత్తగా ఏర్పాటు చేసే ప్రతి కేంద్రంలో సుమారు రూ.85 లక్షల వ్యయంతో ఐదు డయాలసిస్ యంత్రాలు అందుబాటులోకి వస్తాయి. వీటి ద్వారా రోజుకు 15 సెషన్లు నిర్వహించే అవకాశం ఉంటుంది. దీర్ఘకాలంగా డయాలసిస్ చేయించుకోవాల్సిన రోగులకు సమీప ప్రాంతాల్లోనే చికిత్స లభిస్తుంది. దూరప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో రోగులు, వారి కుటుంబాలపై ప్రయాణ భారం, ఇతర ఖర్చులు తగ్గుతాయి. ఈ కేంద్రాల ద్వారా అందే సేవలకు ఏడాదికి రూ.11 కోట్ల వరకు వ్యయమవుతుంది. ఇప్పటికే పీఎంఎన్‌డీపీ ద్వారా నడుస్తున్న 61 కేంద్రాల్లో 754 మెషీన్లు పనిచేస్తున్నాయి.

**పెరుగుతున్న వైద్య సేవల వ్యయం**

పీఎంఎన్‌డీపీ, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు కేటగిరీల్లో కలిపి డయాలసిస్ సేవలకు ప్రభుత్వం 2024--25లో రూ.126.58 కోట్లు వెచ్చించింది. 2025--26 నాటికి ఈ మొత్తం రూ.197.88 కోట్లకు చేరింది. 2026-27లో ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు రూ.90.09 కోట్ల విలువైన సేవలను పేద రోగులు పొందారు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు కింద ప్రభుత్వ రంగంలో 21, ప్రైవేటు, కార్పొరేట్ రంగాల్లో కలిపి 149 డయాలసిస్ కేంద్రాలున్నాయి.

# మడ అడవుల సంరక్షణతోనే మానవ మనుగడకు భరోసా

- ప్రకృతి సంపదను కాపాడుకోవడం మనందరి బాధ్యత
- వృక్ష సంపద పరిరక్షణకు వాల్టా చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తాం
- సంఘమేశ్వరంలో మడ అడవుల పునరుద్ధరణలో ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ నాగబాబు



అవనిగడ్డ (చైతన్య రథం): మడ అడవుల సంరక్షణ పర్యావరణ పరిరక్షణతో పాటు మానవ మనుగడకు అత్యంత కీలకమని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ నాగబాబు పేర్కొన్నారు. ప్రకృతి ప్రసాదించిన విలువైన వృక్ష సంపదను కాపాడుకోవాల్సింది పోయి, ఒకప్పుడు కట్టెల కోసం మడ అడవులను విచ్చలవిడిగా నరికివేసి పర్యావరణానికి నష్టం కలిగించామని ఆవేదన వ్యక్తం చేశారు. మడ అడవులను సంరక్షిస్తే అవి భవిష్యత్తులో మనకు గొప్ప జీవనాధారంగా నిలుస్తాయని స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోని సంఘమేశ్వరంలో మంగళవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి మడ అడవుల పునరుద్ధరణ కార్యక్రమంలో నాగబాబు పాల్గొన్నారు. 100 హెక్టార్ల విస్తీర్ణంలో మూడు లక్షల మడ మొక్కలను నాటే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆయన స్వయంగా మొక్కలు నాటి పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో చెట్లను నరికివేయడంపై కఠినమైన ఆంక్షలు ఉన్నాయని, ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ వృక్ష సంపద పరిరక్షణకు చట్టాలు ఉన్నప్పటికీ, వాటి అమలులో కొన్ని లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు త్వరలోనే వాల్టా చట్టాన్ని మరింత పటిష్టంగా, క్రియాశీలంగా అమలు చేస్తామని వెల్లడించారు.

**ప్రకృతిని కాపాడితేనే మన భవిష్యత్తుకు భరోసా**

ఒక్కో మొక్క పర్యావరణానికి అందించే ప్రయోజనాలు వెలకట్టలేనివని నాగబాబు అన్నారు. విలువైన చెట్లను, మడ అడవులను నరికివేస్తూ ప్రకృతి సంపదను నాశనం చేయడం ఆందోళనకరమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని, వృక్ష సంపదను కాపాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మనం చెట్లను కాపాడితే అవే మనల్ని కాపాడతాయని స్పష్టం చేశారు. ఇల్లు నచ్చకపోతే మరో ఇంటికి, ఊరు నచ్చకపోతే మరో ఊరికి, దేశం నచ్చకపోతే మరో దేశానికి వెళ్లవచ్చని, కానీ భూమి నివాసయోగ్యంగా లేకపోతే ఎక్కడికి వెళ్లగలమని ప్రశ్నించారు. భూమి మనుగడకు అనుకూలంగా ఉండాలంటే ప్రకృతిని పరిరక్షించడం ఒక్కటే మార్గమన్నారు. పర్యావరణ కాలుష్యం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని, హైదరాబాద్‌లో పెరుగుతున్న వాయు కాలుష్యం శ్వాసకోశ సమస్యలకు కారణమవుతోందని పేర్కొన్నారు. గోదావరి జిల్లాల్లోనూ నీటి కాలుష్యంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. కాలుష్యాన్ని నియంత్రించి ప్రజారోగ్యాన్ని కాపాడాలంటే పర్యావరణ పరిరక్షణకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**సమస్త జీవరాశులతో సహజీవనం చేయాలి**

ప్రకృతిలోని ప్రతి చెట్టు, ప్రతి జీవి పర్యావరణ సమతుల్యతలో కీలక పాత్ర పోషిస్తాయని నాగబాబు అన్నారు. భూమిపై జీవించే హక్కు మానవులతో పాటు సమస్త జీవరాశులకూ ఉందని, ఆ హక్కును గౌరవిస్తూ ప్రకృతితో సహజీవనం చేయాలని సూచించారు. మడ అడవులు, వృక్ష సంపద, జల వనరులను పరిరక్షించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. ప్రకృతిని కాపాడుకోవడం అంటే మన భవిష్యత్తును కాపాడుకోవడమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ గ్రీన్ కమిషనర్ బి.ఎన్.ఎన్. మూర్తి, అటవీశాఖ సలహాదారు మల్లికార్జున రావు, డీఎఫ్‌వో త్రిమూర్తుల రెడ్డి, ప్రజా ప్రగతి సేవా సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**అశ్వారావుపాలెంలో పార్క్ ప్రారంభం.. రహదారి పనులకు శంకుస్థాపన**

అవనిగడ్డ మండలం అశ్వారావుపాలెం గ్రామంలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన పార్క్‌ను నాగబాబు ప్రారంభించారు. గ్రామ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడంతో పాటు, పిల్లలు ఆటపాటలతో గడిపేందుకు, పెద్దలు సేదతీరేందుకు వీలుగా ఈ పార్కును గ్రామ మాజీ సర్పంచ్, జనసేన పార్టీ మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వాహక దళ్ సభ్యుడు పంద్రాజు లంకమ్మ ప్రసాద్ ఏర్పాటు చేశారు. అదే ప్రాంగణంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి వెంకట కృష్ణారావు నూతన విగ్రహాన్ని నాగబాబు ఆవిష్కరించారు. అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, రహదారుల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన పల్లెపండుగ 1.0, పల్లెపండుగ 3.0 కార్యక్రమాల కింద సుమారు రూ.54.60 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న మూడు సీసీ రోడ్లు, ఒక బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.

# వైసీపీ అక్రమ మైనింగ్‌ను అరికట్టాలని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

- పిచ్చాటూరు గ్రామంలో తాగునీటి సమస్యలపై ఫిర్యాదులు
- బృందావనంలో ఆశ్రమ నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతి
- 79 ఏళ్ల వృద్ధుడి పింఛను పునరుద్ధరించాలని గ్రీవెన్స్‌లో వినతి



మంగళగిరి (చైతన్య రథం): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీ వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస రెడ్డి ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను వివరిస్తూ అర్జీలు అందజేశారు. అక్రమ మైనింగ్‌ను అరికట్టాలని, భూ వివాదాలు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని, వృద్ధాప్య పింఛన్లు పునరుద్ధరించాలని పలువురు కోరారు.

ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెలగలేరు గ్రామానికి చెందిన వడ్డికుండి సునీల్ తమ గ్రామంలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు, తరలింపును అరికట్టాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అసైన్డ్, పోరంబోకు భూములు, రహదారులు, అటవీ ప్రాంత బఫర్ జోన్ పరిధిలో అక్రమ తవ్వకాలు జరిగాయని తెలిపారు. ఈ వ్యవహారంలో జాతీయ హరిత ట్రిబ్యునల్ విచారణ అనంతరం సంబంధిత వ్యక్తిపై కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. గతంలో అక్రమ గ్రావెల్ తరలింపును అడ్డుకున్న సమయంలో తనపై దాడి చేసి, లారీలతో తొక్కించి చంపుతానని బెదిరించారని ఆరోపించారు. అధికారుల జోక్యంతో కొంతకాలం నిలిచిపోయిన మైనింగ్ కార్యకలాపాలను మళ్లీ ప్రారంభించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి అక్రమ మైనింగ్‌ను అరికట్టడంతో పాటు సంబంధిత అనుమతులను రద్దు చేసి తనకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు.

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గానికి చెందిన కటాకే ఇలియాజ్ తమ కుటుంబ భూమిని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని ఫిర్యాదు చేశారు. టీడీపీకి మద్దతుగా నిలిచినందుకు అప్పటి వైసీపీ ఎమ్మెల్యే తమ కుటుంబంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడి మూడు అక్రమ కేసులు పెట్టించారని ఆరోపించారు. కుటుంబ సభ్యులను బెదిరించడంతో పాటు వైసీపీకి ఓటు వేయాలని, ఆ పార్టీ తరఫున ప్రచారం చేయాలని ఒత్తిడి తెచ్చారని తెలిపారు. తమపై నమోదైన కేసులపై సమగ్ర విచారణ జరిపి, వాటిని తొలగించి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం పిచ్చాటూరు మండలం అగ్రహారం గ్రామానికి చెందిన బొల్లినేని బాలాజీ తమ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తగిన నీటి సదుపాయం లేక గ్రామస్థులు, ముఖ్యంగా వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొందరు నీటి వసతి లేక ఇళ్లను ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. గ్రామంలో కుళాయి సదుపాయంతో పాటు తాగునీటి వసతి కల్పించి సమస్యను పరిష్కరించాలని కోరారు. అదే జిల్లా సత్యవేడు నియోజకవర్గం శివగిరి గ్రామానికి చెందిన జల్లివారి సురేష్ తన తండ్రి జల్లివారి దూపలపూడి నాగయ్య (79)కు వృద్ధాప్య పింఛను పునరుద్ధరించాలని అర్జీ ఇచ్చారు. గతంలో పింఛను అందేదని, 2021 జనవరి నుంచి నిలిచిపోయిందని తెలిపారు. ప్రస్తుతం గ్రామ సచివాలయంలో బయోమెట్రిక్ సమస్య కారణంగా పింఛను మంజూరు ప్రక్రియ కూడా ముందుకు సాగడం లేదని పేర్కొన్నారు. తన తండ్రి వృద్ధాప్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని పింఛను తిరిగి మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం అడ్డతీగల మండలం గొంతువానిపాలెం గ్రామానికి చెందిన తిరగటి తంబిరాజు అక్రమ లేటరైట్ మైనింగ్‌పై ఫిర్యాదు చేశారు. గతంలో మైనింగ్‌కు ఇచ్చిన అనుమతుల గడువు ముగిసినప్పటికీ, ప్రస్తుతం అనుమతులు లేకుండా ఖనిజాన్ని తరలిస్తున్నారని ఆరోపించారు. రోజుకు వందల టన్నుల ఖనిజాన్ని తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో మైనింగ్, రెవెన్యూ, అటవీ శాఖలకు చెందిన కొందరు అధికారులు సహకరిస్తున్నారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వారితో పాటు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని బృందావనానికి వెళ్లే భక్తులు బస, భోజన సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గొగంట వీరమణి తెలిపారు. ఏపీ భక్తుల సౌకర్యార్థం బృందావనంలో ఆశ్రమ నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలని కోరారు. ఆశ్రమ నిర్మాణానికి అవసరమైన దాతలను తాము సమకూర్చుకుంటామని, స్థలం కేటాయిస్తే భక్తులకు వసతి, భోజన సదుపాయాలు కల్పించవచ్చని అర్జీలో పేర్కొన్నారు. వీటితో పాటు పలువురు పింఛన్లు, ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు సమర్పించగా, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఆర్థిక సాయం అందించాలని కోరారు.



## ఎన్టీఆర్ వర్సిటీ రూబీ జూబ్లీ వేడుకలకు ఉపరాష్ట్రపతి

***- అక్టోబర్ 26న హాజరుకానున్న సీపీ రాధాకృష్ణన్ : వీసీ పి చంద్రశేఖర్ వెల్లడి***

విజయవాడ (చైతన్య రథం): డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 40 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న రూబీ జూబ్లీ వేడుకలకు భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అక్టోబర్ 26న హాజరుకానున్నారని విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ పి చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఈ విషయాన్ని వెల్లడించిన ఆయన, వేడుకలకు ఉపరాష్ట్రపతిని సాదరంగా ఆహ్వానించినట్లు పేర్కొన్నారు.

విశ్వవిద్యాలయం 40 ఏళ్ల ప్రస్థానంలో భాగంగా నిర్వహిస్తున్న రూబీ జూబ్లీ వేడుకలకు ఉపరాష్ట్రపతి హాజరుకానుండటం సంస్థకు గర్వకారణమని వీసీ అన్నారు.

ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టనున్నట్లు వెల్లడించారు. వైద్య విద్య, ఆరోగ్య రంగాల్లో విశ్వవిద్యాలయం అందించిన సేవలను స్మరించుకోవడంతో పాటు, భవిష్యత్తులో మరింత నాణ్యమైన వైద్య విద్యను అందించేందుకు ఈ వేడుకలు స్ఫూర్తినిస్తాయని డా. చంద్రశేఖర్ ఆశాభావం వ్యక్తం చేశారు

# విశ్వ వేదికపై మెరిసిన శ్రీశైలం జలవైభవం!

శ్రీశైలం ప్రకృతి ప్రసాదించిన అపురూప వరం, మానవ మేధస్సు మలిచిన మహోన్నత నిర్మాణం, కృష్ణమ్మ గుండెల్లో కొలువుదీరిన జలసిరుల సామ్రాజ్యం. ఎత్తైన కొండలు, లోతైన లోయలు, పచ్చని అటవీ సోయగాలు, నిండుకుండలా పరవళ్లు తొక్కే జలరాశి, ఇవన్నీ కలగలిసిన శ్రీ శైలం దృశ్యం ప్రకృతి ప్రేమికులకే కాదు, ప్రతి తెలుగువాడి హృదయానికి ఓ మధురానుభూతి. ఇక్కడ నీరు కేవలం నదీ ప్రవాహం కాదు. రైతు ఆశలకు జీవధార. జలాశయం కేవలం నీటి నిల్వ కేంద్రం కాదు, వ్యవసాయానికి భరోసా, విద్యుత్తు ఉత్పత్తికి ఆలంబన, లక్షలాది ప్రజల జీవనానికి ఆధారం, జలవిద్యుత్తు వెలుగులు విరజిమ్ముతూ, సాగునీటి అవసరాలకు బాసటగా నిలుస్తూ, ప్రకృతి వైభవాన్ని మానవ ప్రగతితో అనుసంధానిస్తున్న శ్రీశైలం ప్రాజెక్టు రెండు తెలుగు రాష్ట్రాలకు అత్యంత కీలకమైన జలవనరు. కాలాలు మారినా,తరాలు మారినా, కృష్ణమ్మ ప్రవాహంతో ముడిపడిన ఈ జలవైభవ ప్రాధాన్యం చెక్కుచెదరదు. శ్రీశైలం జలాశయం ఇంజినీరింగ్ ప్రతిభకు నిదర్శనం, జలవనరుల ప్రాముఖ్యతకు ప్రతీక, తెలుగు నేల గర్వించే అపురూప సంపద

శ్రీశైలం డ్యాంకు ప్రపంచ గుర్తింపు ఆరు దశాబ్దాల జలవైభవానికి దక్కిన అంతర్జాతీయ గౌరవం. కృష్ణా నది అందాల నడుమ, దట్టమైన నల్లమల అడవుల మధ్య రూపుదిద్దుకున్న శ్రీశైలం జలాశయం విశిష్టత కేవలం నీటి నిల్వకే పరిమితం కాదు. దీని విశేషమైన ఇంజనీరింగ్ ప్రతిభ, నిర్మాణ పటిష్టత, జల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, ప్రకృతి విపత్తులను తట్టుకునే అసాధారణ పటిష్టత, ఈ అంతర్జాతీయ గౌరవానికి శ్రీకారం చుట్టాయి. ఆనకట్ట అంటే కేవలం రాళ్లు, సిమెంటు, కాంక్రీటుతో నిర్మించిన కట్టడం కాదు. అది ఒక ప్రాంత భవిష్యత్తును మార్చే శక్తి. లక్షలాది ఎకరాలకు జీవ జలాలను అందించే భరోసా. రైతు కళ్లలో ఆశలు నింపే వరప్రదాయిని. విద్యుత్తు వెలుగులతో పరిశ్రమల ప్రగతికి బాటలు వేసే అభివృద్ధి చిహ్నం. అలాంటి అసాధారణ ప్రాధాన్యం కలిగిన శ్రీశైలం ప్రాజెక్టు ఇప్పుడు మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. లండన్‌కు చెందిన 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' లో చోటు సంపాదించి దేశంలోనే ఈ గుర్తింపు పొందిన తొలి ప్రాజెక్టుగా నిలిచింది. దశాబ్దాలుగా కృష్ణా నది బలమైన వరద ప్రవాహాలను ఎదుర్కొంటూ, తెలుగు రాష్ట్రాలకు సాగునీరు, తాగునీరు, విద్యుత్తు అందిస్తున్న ఈ జలవైభవానికి దక్కిన గుర్తింపు. ఈ ప్రపంచ స్థాయి గుర్తింపు కేవలం సిమెంట్, కాంక్రీటు నిర్మాణానికి దక్కింది మాత్రమే కాదు, దశాబ్దాల క్రితం ఎలాంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం లేని రోజుల్లో, అంకితభావంతో పనిచేసిన నాడు ఇంజనీర్లు, కార్మికులు, నిపుణుల చెమట చుక్కలకు దక్కిన ఘనమైన నివాళి. నల్లమల కొండల మధ్య ఉధృతంగా ప్రవహించే కృష్ణా నదిని బంధించి, రాయలసీమ, తెలంగాణ జిల్లాల రాతను మార్చాలన్న నాటి నేతల దార్శనికత నేడు ప్రపంచ దేశాల చేత ప్రశంసలందుకునేలా చేసింది. ఇది తెలుగు జాతి గర్వించ దగ్గ ప్రగతి సోపానం. దక్షిణాసియాలోని ఏ ఇతర ప్రాజెక్టులోనూ లేనివిధంగా, శ్రీశైలం డ్యామ్‌లో సుమారు 60 అడుగుల వెడల్పు, 55 అడుగుల ఎత్తు కలిగిన 12 భారీ క్రస్ట్ గేట్లు ఉండటం దీని నిర్మాణ నైపుణ్యానికి తార్కాణం. 2009 లో ఊహించని రీతిలో ఏకంగా 25.4 లక్షల క్యూసెక్కుల భారీ వరద నీరు పోటెత్తినా, ఏమాత్రం చెక్కుచెదరకుండా నిలబడి తన అసాధారణ ధృఢత్వాన్ని చాటుకుంది. ఈ ప్రత్యేకతలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన 'వరల్డ్



బుక్ ఆఫ్ రికార్డ్స్' ప్రతినిధులు శ్రీశైలం ప్రాజెక్టును తమ సంస్థలో అధికారికంగా నమోదు చేశారు. శ్రీశైలం నిల్వ చేసే జలాశయం మాత్రమే కాదు. తెలుగు రాష్ట్రాల్లో వ్యవసాయాన్ని పరిపుష్టం చేస్తూ, లక్షలాది ఎకరాలకు జీవ జలాలను అందిస్తూ, రెండు తెలుగు రాష్ట్రాలకు వెలుగులు పంచుతున్న జలవిద్యుత్ కేంద్రంగా అవిశ్రాంతంగా సేవలందిస్తోంది ఈ ప్రాజెక్టు.

శ్రీశైలం ప్రాజెక్టు 1963లో ప్రారంభమైన నిర్మాణ ప్రస్థానం దేశ సాగునీటి చరిత్రలో ఒక ముఖ్య ఘట్టం. 1963 జూలై 24న అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ శ్రీశైలం ఆనకట్టకు శంకుస్థాపన చేశారు. 1982 ఆగస్టు 30న అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ప్రాజెక్టును ప్రారంభించారు. ఆనకట్ట పొడవు సుమారు 512 మీటర్లు.ఎత్తు, పునాది లోతైన స్థాయి నుంచి సుమారు 143-145 మీటర్లు. స్పిల్‌వే గేట్లు 12 రేడియల్ గేట్లు. విద్యుత్ ఉత్పత్తి కుడి గట్టు విద్యుత్ కేంద్రం 770 మెగావాట్లు, ఎడమ గట్టు కేంద్రం 900 మెగావాట్ల స్థాపిత సామర్థ్యంతో నిర్మించారు. రెండు కేంద్రాల సామర్థ్యాన్ని కలిపితే 1,670 మెగావాట్లు. విద్యుత్తు డిమాండ్ పెరిగే సమయాల్లో జలవిద్యుత్తు కేంద్రాలు కీలకంగా పనిచేస్తాయి. కృష్ణా నదీ జలాలను సద్వినియోగం చేసుకోవాలనే దూరదృష్టితో ప్రారంభమైన ఈ బృహత్తర నిర్మాణం అనేక సవాళ్లను అధిగమిస్తూ ముందుకు సాగింది. నల్లమల కొండల మధ్య లోతైన లోయలో ఆనకట్ట నిర్మించడం అప్పటి ఇంజనీర్లకు సాంకేతికంగా పెద్ద సవాల్ అని చెప్పాలి. దాదాపు రెండు దశాబ్దాల కృషి, వేలాది మంది కార్మికుల శ్రమ, ఇంజనీర్ల నైపుణ్యం కలగలిసి శ్రీశైలం ప్రాజెక్టును సాకారం చేశాయి. శ్రీశైలం ప్రాజెక్టుకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు రావడానికి ప్రధానంగా దాని నిర్మాణ విశిష్టత, భారీ క్రస్ట్ గేట్లు, ఎత్తైన భౌగోళిక స్థానం, గతంలో ఎదుర్కొన్న భారీ వరదల సమయంలో ప్రదర్శించిన పటిష్టత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు. పూర్తి నిల్వమట్టం వద్ద స్థూల నిల్వ సామర్థ్యం సుమారు 215.8 టీఎంసీలు. కృష్ణా నదిపై నిర్మించిన ఈ జలాశయం తెలుగు రాష్ట్రాల నీటి అవసరాలు తీర్చడంలో కీలకమైనది. నదిలో ప్రవహించే జలాలను నిల్వచేసి, ప్రాజెక్టుల నిర్వహణ నిబంధనలు, నీటి లభ్యత, కేటాయింపులకు అనుగుణంగా దిగువ ప్రాంతాలకు విడుదల చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

ప్రత్యేకించి రాయలసీమ వంటి వర్షాభావ ప్రాంతాలకు కృష్ణా జలాలను అందించే సాగునీటి పథకాలకు శ్రీశైలం జలాశయం ఆధారంగా నిలుస్తుంది. రాయలసీమలో సాగునీటి విస్తరణకు ప్రాధాన్యమైన పథకాలలో హంద్రీ-నీవా సుజల స్రవంతి ఒకటి. కృష్ణా నదీ వ్యవస్థలో లభించే నీటిని ఎత్తిపోతల ద్వారా ఎత్తైన ప్రాంతాలకు తరలించి, కరువు ప్రభావిత ప్రాంతాలకు సాగునీటి ప్రయోజనాలు అందించాలన్నది ఈ పథకం ప్రధాన ఉద్దేశం. గాలేరు-నగరి సుజల స్రవంతి పథకం కూడా రాయలసీమ, పరిసర ప్రాంతాల సాగునీటి అవసరాలతో ముడిపడి ఉంది. నీటి వనరుల నుంచి కాలువల ద్వారా జలాలను తరలించి వ్యవసాయానికి ఉపయోగించుకోవడం ఈ పథకం లక్ష్యం. శ్రీశైలం జలాశయంతో అనుసంధానమై ఉన్న మరో ముఖ్యమైన పథకం తెలుగు గంగ. ఇది అంతర్రాష్ట్ర ప్రయోజనాలు కలిగిన జలవనరుల పథకం. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ, నెల్లూరు ప్రాంతాల సాగునీటి అవసరాలతో పాటు చెన్నై నగరానికి తాగునీటిని అందించడంలోనూ ఈ పథకానికి ప్రాధాన్యం ఉంది. శ్రీశైలం జలాశయం నుంచి ఆంధ్రప్రదేశ్-తమిళనాడు సరిహద్దు వరకు సుమారు 408 కిలోమీటర్ల కాలువ వ్యవస్థతో పాటు వెలుగోడు, ఎస్‌పీవీబీ, సోమశిల, కండలేరు వంటి సమతుల్య జలాశయాలు కీలక భాగాలుగా ఉన్నాయి. ఆధునిక యంత్రాలు, డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా అందుబాటులో లేని కాలంలో ఇంతటి భారీ ప్రాజెక్టును నిర్మించడం నాటి ఇంజనీర్ల నైపుణ్యానికి నిదర్శనం. కొండలు, లోయలు, కృష్ణా నది ప్రవాహం, నిర్మాణానికి అవసరమైన సామగ్రి రవాణా వంటి ఎన్నో సవాళ్లను అధిగమించి వారు నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లారు. వారి కృషి ఫలితంగానే నేటికీ శ్రీశైలం ప్రాజెక్టు కోట్లాది ప్రజల జీవితాలలో వెలుగులు నింపుతుంది.

శ్రీశైలం ప్రాజెక్టు దేశానికే తలమానికంగా నిలుస్తూ వరల్డ్ బుక్ఆఫ్ రికార్డ్స్ వంటి అరుదైన గౌరవం కలిగిన అవార్డును కైవసం చేసుకోవడం గర్వకారణం. దక్షిణ ఆసియా ఖండంలోనే ప్రత్యేకత కలిగిన భారీ ఆనకట్టగా గుర్తింపు లభించిన సందర్భంగా సున్నిపెంటలోని జెన్‌కో అతిథిగృహంలో లండన్ డబ్ల్యూబీఆర్ సౌత్ రీజన్ జాయింట్ సెక్రటరీ ఇలియాజర్ నుంచి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అవార్డును అందుకోవడం అభినందనీయం. శ్రీశైలం ప్రాజెక్టు అంటే అది చరిత్ర, సాంకేతిక నైపుణ్యం, రైతు ఆశ, విద్యుత్తు వెలుగు, ప్రాంతీయ అభివృద్ధి కలగలిసిన మహా నిర్మాణం. ఆరు దశాబ్దాల తర్వాత ప్రపంచ రికార్డుల్లో చోటు సంపాదించే స్థాయికి చేరింది. ఈ ప్రస్థానం వెనుక తరతరాల శ్రమ, దూరదృష్టి, ఇంజనీరింగ్ ప్రతిభ ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి వేసిన పునాది. శ్రీశైలం గేట్ల ఘనత కేవలం కాంక్రీటు బలం కాదు, తరతరాల భారతీయ ఇంజనీర్ల మేధోబలం. ప్రపంచ గుర్తింపు ఈ జలవైభవానికి కొత్త కీర్తిని తెచ్చిపెట్టడమే కాదు, దాని భద్రతను కాపాడుతూ భవిష్యత్ తరాలకు మరింత సమర్థంగా సేవలందించాల్సిన బాధ్యతను కూడా గుర్తుచేస్తోంది. శ్రీశైలం ప్రాజెక్టు లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవడం ద్వారా,మన దేశ జలరంగ సత్తా ఏమిటో ప్రపంచానికి మరోసారి చాటిచెప్పింది. తెలుగు నేల మీద రూపుదిద్దుకున్న ఈ ఇంజనీరింగ్ అద్భుతం అంతర్జాతీయ స్థాయిలో ఇలా ప్రశంసలందుకోవడం మనందరికీ ఎంతో గర్వకారణం.

శ్రీశైలం జలవైభవం ఒక ప్రాంతానికో, ఒక తరానికో పరిమితమైన సంపద కాదు. భావితరాల భవిష్యత్తుతో ముడిపడిన అమూల్యమైన జాతీయ వనరు. కృష్ణమ్మ ఒడిలో ఒదిగిన ఈ జలరాశి రైతు పొలాల్లో పచ్చదనంగా పరిమళించాలి. జలవిద్యుత్తుగా ఇళ్లలో వెలుగులు నింపాలి..ప్రజల జీవనానికి భరోసాగా నిలవాలి. అయితే ఈ లక్ష్యాల సాధనకు జలాశయంలో నీటి లభ్యతతోపాటు నదీ నిర్వహణ నిబంధనలు, రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపులు, పర్యావరణ పరిరక్షణ, ప్రాజెక్టుల సమర్థ నిర్వహణ కూడా కీలకం. ప్రతి నీటి బొట్టునూ సద్వినియోగం చేసుకుంటూ, జలవనరులను భావితరాలకు భద్రంగా అందించడమే నిజమైన అభివృద్ధి. శ్రీశైలం అందాలను ఆస్వాదించడం ఎంత ముఖ్యమో.దాని జలసంపదను కాపాడుకోవడం అంతకంటే ముఖ్యం. ప్రకృతి ప్రసాదించిన ఈ అపురూప వరాన్ని నిర్లక్ష్యానికి వదలకుండా, బాధ్యతతో పరిరక్షిస్తూ, అభివృద్ధికి ఆలంబనగా మలచుకోవాలి. ఎందుకంటే శ్రీశైలంలో నిలిచేది నీరు మాత్రమే కాదు..కోట్లాది ప్రజల ఆశలు, అక్కడ ప్రవహించేది కృష్ణమ్మ మాత్రమే కాదు, తెలుగు నేల ప్రగతి ఆకాంక్షలు, జలమే జీవం-జలమే సంపద-జలమే ప్రగతికి పునాది, ఆ జలశక్తికి ప్రతీకగా శ్రీశైలం కలకాలం విరాజిల్లాలి. అదే శ్రీశైలం జలవైభవానికి నిజమైన నీరాజనం.

**- నీరుకొండ ప్రసాద్**

## జెండర్ రిసోర్స్ కేంద్రాలను ప్రారంభించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్



గజపతినగరం (చైతన్యరథం): అత్యవసర సమయంలో మహిళలకు తక్షణ సహాయాన్ని అందించే విధంగా ప్రభుత్వం జెండర్ రిసోర్స్ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం విజయనగరం జిల్లా గజపతినగరంలోని వెలుగు కార్యాలయం పైగదిలో ఏర్పాటు చేసిన జెండర్ రిసోర్స్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రాత్రి సమయంలో మహిళలకు అత్యవసర సహాయం అందించేలా ఈ కేంద్రాలు పనిచేస్తాయన్నారు. ఈ కేంద్రంలో మహిళా పోలీసులు, ఆరోగ్య సహాయకులు, ఇతర శాఖల ఉద్యోగులు సమన్వయం చేసుకుంటూ సేవలందిస్తారని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు రెండే కేంద్రాలు ఉండేవని ఇప్పుడు మరో పదకొండు కేంద్రాలు మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిని త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మలక్ష్మీపురంలో జయహో బీసీ కార్యక్రమం... పాల్గొన్న తోయక



గుమ్మలక్ష్మీపురం (చైతన్యరథం): గుమ్మలక్ష్మీపురంలో మంగళవారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు, గ్రంథాలయ చైర్మన్ దొంకాడ రామకృష్ణ, అరకు పార్లమెంట్ కార్యదర్శి దత్తి లక్ష్మణరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బీసీలకు అదనంగా సీట్లు కేటాయించడం హర్షణీయం అన్నారు. రాజకీయ పదవుల్లో మరింత మంది బీసీలకు అవకాశం దక్కుతుందని, బీసీల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని మరోసారి నిరూపించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాపు, కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్లు పాత్రుడు, మధుసూదనరావు, మండల కన్వీనర్ నారాయణస్వామి నాయుడు, కొండయ్య, భుజంగరావు, నాయకులు రామారావు, మన్మథరావు, రాజేష్, శ్రీరామమూర్తి, ధనంజయ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆనందపురం జంక్షన్ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంటా శ్రీకారం



విశాఖపట్నం (చైతన్యరథం): ట్రాఫిక్ సమస్యలకు నెలవుగా మారిన విశాఖ జిల్లా ఆనందపురం జంక్షన్ అభివృద్ధి పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని రూ. 81 లక్షలతో జంక్షన్ విస్తరణ పనులు చేపట్టామని తెలిపారు. భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభం కావడంతో ఆనందపురం జంక్షన్పై ట్రాఫిక్ ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో జంక్షన్ విస్తరణ పనులు ప్రతిపాదించామని వెల్లడించారు. జంక్షన్ ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్దేశించిన గడువులోగా విస్తరణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే అథారిటీ డిప్యూటీ మేనేజర్ గోపీకృష్ణ, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, తాట్రాజు అప్పారావు, ఘట్టమనేని సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లి జిల్లా అభివృద్ధిలో వీఎంఆర్డీఏ కీలకపాత్ర

**●రూ.10 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శ్రీకారం**



అనకాపల్లి (చైతన్యరథం): నగర పరిధిలో వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో సుమారు రూ. 10 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు మంగళవారం ప్రారంభోత్సవాలు జరిగాయి. అనకాపల్లి కొత్తూరు వద్ద వీఎంఆర్డీఏ రూ. 5.40 కోట్లతో అభివృద్ధి తెలుగుతల్లి పార్కును ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్, అనకాపల్లి జిల్లా టీడీపీ అధ్యక్షుడు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అనకాపల్లి తుంపాల వద్ద నూతనంగా రూ. 4.40 కోట్ల తో నిర్మించిన కన్వెన్షన్ సెంటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ... గత రెండేళ్లలో వీఎంఆర్డీఏ ద్వారా సుమారు రూ. 17 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు జరుపుకున్నామని, నిధులు మంజూరు చేసిన వీఎంఆర్డీఏ చైర్మన్‌కి, అధికారులకు అభినందలు తెలిపారు. మరిన్ని నిధులు మంజూరు చేసి, అనకాపల్లి జిల్లాను మరింత తీసుకుతీర్చిదిద్దాలని కోరారు. కొత్తూరు వద్ద సుమారు రూ. 5.40 కోట్లతో అత్యాధునిక హంగులతో అందరికి అవసరమైన సదుపాయాలతో పార్కును తీర్చిదిద్దటం జరిగిందన్నారు. అలానే తుంపాల వద్ద మధ్య తరగతి, పేదలు శుభ కార్యక్రమాలు జరిపేందుకు అవసరమైన సదుపాయాలతో అందరికి అందుబాటులో ఉండేలా కన్వెన్షన్ సెంటర్ ను అందుబాటులో తీసుకురావటం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

**అనంతరం ఎం.వి ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ...** అనకాపల్లి జిల్లా సమగ్ర అభివృద్ధిలో వీఎంఆర్డీఏ కీలక పాత్ర పోషిస్తోందని చెప్పటానికి ఆనందంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విజన్‌తో రాష్ట్రంలో ఇటు సంక్షేమం, అటు అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హయంలో ఉత్తరాంధ్రను ఉత్తమాంధ్రగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే గతంలో ఎన్నడూ లేనంతగా అన్ని ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించటం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ నేతృత్వంలో అన్ని నియోజకవర్గాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వటంతో పాటు భారీగా నిధులు కేటాయించటం జరుగుతోందన్నారు.

**సామాజిక భవనాల నిర్మాణాలకు ప్రాధాన్యత**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీఎంఆర్డీఏ మూడు జిల్లాల పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో రహదారులు, కాలువలు, తాగునీరు, కల్వర్టులు, వీధి దీపాలు, కన్వెన్షన్ సెంటర్లు, పార్కులు, సామాజిక భవనాల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వటం జరిగిందన్నారు. అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం, పాయకరావుపేట, యలమంచిలి, చోడవరం, మాడుగుల వంటి నియోజకవర్గాల్లో అభివృద్ధి కోసం సుమారు రూ. 120 కోట్ల వరకు కేటాయించటం జరిగిందన్నారు. అనకాపల్లిలో రావుగోపాలరావు ఆడిటోరియంను రూ. 5.30 కోట్లతో అభివృద్ధి చేశామని, అదేవిధంగా ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా జోనల్ కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.

## విజయవాడ ఉత్సవ్‌కు ఒడిశా గవర్నర్‌కు ఆహ్వానం

**● గవర్నర్ కంభంపాటి హరిబాబును కలిసిన ఎంపీ కలిశెట్టి**




విజయనగరం/ ఒడిశా (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆహ్వానం మేరకు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు మంగళవారం ఒడిశా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని రాజ్‌భవన్‌లో ఒడిశా రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దసరా నవరాత్రి ఉత్సవాల ప్రత్యేకతను చాటుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "విజయవాడ ఉత్సవ్" కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా గవర్నర్‌కి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబించేలా నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక విశిష్టతను జాతీయ స్థాయిలో చాటిచెప్పడంతో పాటు, రాష్ట్ర పర్యాటక రంగానికి మరింత ప్రోత్సాహాన్ని అందించనుందని తెలిపారు.

## రైతుల సంక్షమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే బేబి నాయన



రామభద్రపురం (చైతన్యరథం): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన అన్నారు. రామభద్రపురం మండల కేంద్రంలోని వ్యవసాయ సాగు యంత్రాల అద్దె కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. వెలుగు అధికారులు తక్కువ ధరకే రైతులకు యంత్రాలు అందజేస్తున్నారని తెలిపారు. రైతులకు ప్రభుత్వం అనేక రాయితీలు అందిస్తోందని, రైతులంతా ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. అనంతరం స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. జగనన్న కాలనీ సమీపంలో స్మశాన వాటిక మంజూరు చేయాలని టీడీపీ నాయకుడు చింతల రామకృష్ణ ఆధ్వర్యంలో కాలనీవాసులంతా వినతి పత్రం అందించారు. స్మశాన వాటిక నిర్మాణానికి స్థలాన్ని సమకూర్చాలని తహసీల్దార్ రఫీ జానును ఎమ్మెల్యే ఆదేశించారు. డీలర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు రామారావు ఆధ్వర్యంలో డీలర్లు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతల రామకృష్ణ, మడక తిరుపతిరావు, కరణం భాస్కరరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## విజయనగరంలో వైసీపీకి షాక్... టీడీపీలోకి చేరికలు



విజయనగరం (చైతన్యరథం): విజయనగరం జిల్లాలో వైసీపీకి వరుస షాక్లు తగులుతున్నాయి. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మేనల్లుడు చిన్న శ్రీను ఇటీవల టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. తాజాగా, చిన్న శ్రీను, కళా వెంకట్రావు ఆధ్వర్యంలో 3,500 మందికిపైగా వైసీపీ నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల పరిధిలోని 13 పంచాయతీలకు చెందిన మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, వైసీపీ హయాంలో వివిధ హోదాల్లో పని చేసిన వారంతా మంగళవారం టీడీపీలో చేరారు.

## రూ.3.13 కోట్లతో గిరిజన రహదారికి శంకుస్థాపన

**●మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆధ్వర్యంలో పార్టీలోకి చేరికలు**



సాలూరు (చైతన్యరథం): గిరిజన గ్రామాల అభివృద్ధికి మరో ముందడుగు పడిందని, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు దూసుకుపోతుందని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వ్యాఖ్యానించారు. పాచిపెంట మండలం గొట్టూరు పంచాయితీ గురివినాయుడుపేట – కూడికాళ్ళవలస రోడ్డు నుండి మారుమూల గిరిజన గ్రామమైన వేటగానివలస వరకు రూ. 3.13 కోట్ల వ్యయంతో తారురోడ్డుకు మంగళవారం మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శంకుస్థాపన చేశారు. గిరిజన గ్రామాలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించి, గర్భిణీలు, వృద్ధులకు, విద్యార్థులకు, వ్యాపారస్తులకు రవాణా ఇబ్బందులను తొలగించి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచి అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులైన పలువురు వైసీపీ కార్యకర్తలు నేడు టీడీపీలో వచ్చి చేరుతున్నారని అన్నారు. గొట్టూరు, బొర్రమామిడి, తగ్గాం, గరిసిగుడ్డి

## కునికినిపాడులో రూ.56 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



నందిగామ (చైతన్యరథం): కంచికచర్ల మండలం కునికినిపాడు గ్రామంలో DMF గ్రాంట్ కింద రూ.56 లక్షల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అధికారులతో, కూటమి నేతలతో కలిసి శంకుస్థాపన చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలను మెరుగుపరిచి, ప్రజలకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించడంతో పాటు రవాణా సౌకర్యాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు రాకపోకల్లో సౌలభ్యం కలగనుంది. గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న ఈ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

## కొండపల్లి అభివృద్ధికి రూ.25 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన

**●అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్**



కొండపల్లి (చైతన్యరథం): కొండపల్లి మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు రూ.25 కోట్లతో వివిధ మౌలిక సదుపాయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మైలవరం శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మంగళవారం కొండపల్లి మున్సిపాలిటీలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ... పట్టణాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.

**రూ.25 కోట్లతో కీలక అభివృద్ధి పనులు**

కొండపల్లి మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో సుమారు 13 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.16.62 కోట్లు కేటాయించామని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు గారు తెలిపారు. ఆధునిక వసతులతో మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.3.36 కోట్లు, మూడు పార్కుల నిర్మాణం, అభివృద్ధికి రూ.5.02 కోట్లు వెచ్చించనున్నట్లు వివరించారు. మొత్తంగా రూ.25 కోట్లతో చేపట్టనున్న ఈ పనులు పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు.

**ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు**

వివిధ వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయితే ప్రజల రాకపోకలు మరింత సులభతరం అవుతాయని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు అన్నారు. అంతర్గత రహదారుల అభివృద్ధితో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు స్థానికంగా ఎదురవుతున్న రహదారి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

**పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం**

మూడు పార్కుల నిర్మాణం, అభివృద్ధితో కొండపల్లి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు పేర్కొన్నారు. పిల్లలు, యువత, వృద్ధులు సేదతీరేందుకు, కుటుంబ సభ్యులతో సమయం గడిపేందుకు ఈ పార్కులు ఉపయోగపడతాయని తెలిపారు.

**నాణ్యత విషయంలో రాజీ పడకుండా పనులు పూర్తి చేయాలి**

ప్రజాధనంతో చేపట్టే ప్రతి అభివృద్ధి పనీ ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించేలా ఉండాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ స్పష్టం చేశారు. నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా పనులు నాణ్యతతో పూర్తయ్యేలా చూడాలని సూచించారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై దేవినేని ఉమా కీలక సమావేశాలు



రాజమండ్రి (చైతన్యరథం): తూర్పుగోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు రాజమండ్రిలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుతో పాటు తూర్పుగోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షుడు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరితో కలిసి సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. అనంతరం ఎన్నికల సన్నద్ధత, పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యాచరణ, నాయకుల మధ్య సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో పార్టీ కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన వ్యూహాలు, నాయకులు సమన్వయంతో ముందుకు సాగాల్సిన అంశాలపై ఈ సమావేశాల్లో ప్రధానంగా చర్చించినట్లు తెలిసింది.

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం: ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే చింతమనేని



దుగ్గిరాల (చైతన్యరథం): ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకుని, ప్రభుత్వ యంత్రాంగం ద్వారా వాటికి తక్షణ పరిష్కారం చూపడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ స్పష్టం చేశారు. దుగ్గిరాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిత్య ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. పి-4లో భాగంగా అప్పనవీడు జనసేన వీర మహిళ తాజా మాజీ PHS SMC CHAIR PERSON మోగంటి లక్ష్మీ దుర్గాకి కుట్టు మిషన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి తరలివచ్చిన వృద్ధులు, మహిళలు, రైతులు, సామాన్య ప్రజలు తమ సమస్యలు, వినతులను ఎమ్మెల్యేకి స్వయంగా విన్నవించుకున్నారు. వచ్చిన ప్రతి ఒక్కరి అర్జీని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్వయంగా పరిశీలించి, వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ, వైద్య ఆరోగ్య తదితర శాఖలకు సంబంధించిన సమస్యలపై సంబంధిత అధికారులతో అక్కడికక్కడే ఫోన్లో మాట్లాడి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

## పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి: బాపట్ల ఎమ్మెల్యే వేగేశన

**●122 మంది లబ్ధిదారులకు రూ.59,27,754 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**




బాపట్ల (చైతన్యరథం): ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) ఒక వరమని, బాధితులకు మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం అండగా నిలుస్తుందని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మరాజు పేర్కొన్నారు. బాపట్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 122 మంది అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన రూ.59,27,754 విలువ గల CMRF చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరుపేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఆసుపత్రి ఖర్చుల భారంతో ఇబ్బంది పడుతున్న కుటుంబాలను ఆదుకోవడమే లక్ష్యంగా ఈ నిధులు మంజూరు చేయడం జరుగుతోంది. బాపట్ల నియోజకవర్గంలో ఏ ఒక్క పేదవాడు వైద్యం కోసం ఇబ్బంది పడకూడదన్నదే మా సంకల్పం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా నిరంతరం కృషి చేస్తాం అని అన్నారు. ముఖ్యమంత్రి నిరంతరం ప్రజల కష్టాలను ఆలకించి, తక్షణమే స్పందిస్తున్నారని, అందుకు ఈ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులే నిదర్శనమని పేర్కొన్నారు. ఎటువంటి మధ్యవర్తులు లేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. బాపట్ల నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా తానూ, ప్రభుత్వం అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే గ్రామాల్లో అభివృద్ధి పనులు : ఎంపీ పుట్టా మహేష్



ఏలూరు (చైతన్యరథం): గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన రోడ్లను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి చేసుకోగలుగుతున్నామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ చెప్పారు. నూజివీడు నియోజకవర్గంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం గ్రామం చేరుకున్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ రూ.20 లక్షలతో నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి మంత్రి కొలుసు పార్థసారథితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం తోటపల్లి గ్రామంలో 1 కోటి 20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణం, 20 లక్షల వ్యయంతో అభివృద్ధి చేస్తున్న స్మశాన వాటిక పనులకు, రూ.25 లక్షల వ్యయంతో నిర్మించే వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు మంత్రి పార్థసారథితో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని గ్రామాలలో రోడ్ల నిర్మాణం చేపట్టామని, కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ప్రజలంతా మద్దతుగా నిలవాలని కోరారు.

## రూ.8 కోట్లతో హైటెక్ బస్టాండ్ వద్ద డ్రైనేజీ పనులు ప్రారంభం

**●ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): నగరంలో ఏళ్ల తరబడి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న హైటెక్ బస్టాండ్ ముంపు సమస్య పరిష్కారానికి రూ.8 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఇందులో పబ్లిక్ హెల్త్ శాఖ ద్వారా రూ.6 కోట్లు, నగరపాలక సంస్థ ద్వారా రూ.2 కోట్లు వెచ్చించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ హైటెక్ బస్టాండ్ వద్ద ముంపు సమస్య గత 30-40 ఏళ్లుగా నగర ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. గతంలో పరిష్కారం కాని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. నగరం విస్తరిస్తుండటంతో కంబాల చెరువు పరిసరాల నుంచి వచ్చే మురుగునీరు, వర్షపు నీరు ప్రస్తుత ప్రధాన డ్రైన్ సామర్థ్యానికి మించి ప్రవహిస్తోందని వివరించారు. ఈ సమస్యను అధిగమించేందుకు కిమ్స్ ఆసుపత్రి మార్గం మీదుగా అదనపు డ్రైన్ నిర్మించి నల్లా ఛానల్‌కు అనుసంధానం చేస్తామన్నారు. అలాగే హైటెక్ బస్టాండ్ వద్ద లోతుగా ఉన్న రహదారిని ఎత్తు పెంచడంతోపాటు, నల్లా ఛానల్ వద్ద డబుల్ వెంట్ నిర్మాణం చేపట్టి నీటి ప్రవాహ సామర్థ్యాన్ని పెంచనున్నట్లు తెలిపారు. మొత్తం రూ.8 కోట్లతో చేపడుతున్న పనులను మూడు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. నగర అభివృద్ధిలో భాగంగా వీఎల్ పురంలోని పాత లారీ స్టాండ్ సమీపంలో రూ.28 కోట్లతో నిర్మించనున్న మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అరేనా-1 పనులను బుధవారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ హైటెక్ బస్టాండ్ లోతట్టు ప్రాంతంలో ఉండటంతో స్వల్ప వర్షం కురిసినా నీరు నిలిచిపోతోందన్నారు. ప్రస్తుతం ఉన్న డ్రైన్ సామర్థ్యం రోజువారీ మురుగునీటి ప్రవాహానికే సరిపోతోందని, వర్షపు నీరు అదనంగా చేరడంతో సమస్య తీవ్రతరం అవుతోందని వివరించారు. ఈ నేపథ్యంలో అదనపు డ్రైన్ నిర్మాణం, రహదారి ఎత్తు పెంపు, నల్లా ఛానల్ వద్ద నీటి ప్రవాహ సామర్థ్యం పెంపు పనులను సమాంతరంగా చేపడుతున్నట్లు తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి, భవిష్యత్తులో ముంపు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# ఆపదలో ఉన్న పేదలకు అండగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే బొండా

**●ముఖ్యమంత్రి సహాయనిధి.. 9 మంది లబ్ధిదారులకు రూ.5.89 లక్షల చెక్కులు అందజేత**



విజయవాడ (చైతన్యరథం): సింగ్‌నగర్‌లోని సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో 58వ డివిజన్‌కు చెందిన 9 మంది లబ్ధిదారులకు రూ.5.89 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ... పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆపద సమయంలో అండగా నిలుస్తూ, మెరుగైన వైద్య సేవలు పొందేందుకు ఆర్థిక సహాయం అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సేవలందిస్తోందని, అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు పేద కుటుంబాలు వైద్య ఖర్చులను భరించలేక అనేక ఇబ్బందులు పడుతున్నాయని, అటువంటి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఊరటనిస్తోందని తెలిపారు. అర్హులైన బాధితులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి వైద్య ఖర్చుల భారాన్ని కొంతమేర తగ్గించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, పేదల ఆరోగ్యం, ఆర్థిక భద్రతకు ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటూ, సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరవేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

**ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం**

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని బొండా ఉమా తెలిపారు. వైద్య ఖర్చుల కారణంగా ఏ కుటుంబమూ మరింత ఆర్థిక ఇబ్బందులకు గురికాకూడదనే ఉద్దేశంతో అర్హులైన బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైన వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

# వేమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మెగా వైద్య శిబిరం

**●వైద్య సేవలను పరిశీలించిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు**



వేమూరు (చైతన్యరథం): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న “సేవా సంకల్ప అభియాన్” కార్యక్రమంలో భాగంగా నేడు వేమూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (CHC)లో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. ఈ మెగా వైద్య శిబిరంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వివిధ వైద్య విభాగాలకు చెందిన సేవలను అందుబాటులో ఉంచారు. ఇందులో భాగంగా రక్త పరీక్షలు, కంటి పరీక్షలు, ఎక్స్‌రే, హెచ్‌ఐవీ కౌన్సెలింగ్, ఫిజియోథెరపీ, ప్రసూతి మరియు శిశు వైద్య సేవలు అందించారు. ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా దీర్ఘకాలిక వ్యాధుల గుర్తింపు, మధుమేహం (షుగర్), రక్తపోటు (బీపీ) పరీక్షలు, వృద్ధులకు అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల వివరాలను తెలుసుకుని, వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ప్రజలు ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని, వ్యాధులను ముందుగానే గుర్తించి తగిన చికిత్స పొందాలని, తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల ముందస్తు గుర్తింపు, అవసరమైన వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయడమే ఈ మెగా వైద్య శిబిరం ప్రధాన ఉద్దేశమని వ్యాఖ్యానించారు.

# మైనార్టీల సంక్షేమం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**●పొన్నూరులో ఉర్దూఘర్, షాదీఖానా నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ శ్రీకారం**



పొన్నూరు (చైతన్యరథం): మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి, రాజకీయ ప్రాతినిధ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని శాసనమండలి మాజీ చైర్మన్, రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారు మహమ్మద్ షరీఫ్, పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ స్పష్టం చేశారు. పొన్నూరు పట్టణంలోని 25వ వార్డులో ఉర్దూఘర్, షాదీఖానా నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు రూ.2.85 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మహమ్మద్ షరీఫ్, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్, ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ షిబ్లి పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా మహమ్మద్ షరీఫ్ మాట్లాడుతూ...** చట్టసభల్లో అన్ని వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్నది ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యమని తెలిపారు. గత శాసనసభ ఎన్నికల్లో ముగ్గురు మైనార్టీలకు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించారని గుర్తుచేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మైనార్టీలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో వారికి ప్రాధాన్యతనిస్తూ రాజకీయ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. రాయలసీమ ప్రాంతంలో మైనార్టీలు అధికంగా ఉన్న ప్రాంతాలకు మూడు నుంచి నాలుగు చైర్మన్ పదవులు కేటాయించే అవకాశం ఉందని తెలిపారు. కోస్తా ప్రాంతంలోనూ మైనార్టీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు, అవసరమైన చోట్ల ఎంపీటీసీ, జడ్పీటీసీ, కో-ఆప్షన్ పదవుల్లో వారికి ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ...** 2024 ఎన్నికల సమయంలో మైనార్టీలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు. పొన్నూరు నియోజకవర్గంలో మైనార్టీలకు మార్కెటింగ్ యార్డు చైర్పర్సన్, సొసైటీ చైర్మన్ పదవులను కేటాయించి రాజకీయంగా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. మైనార్టీల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి తగిన ప్రాధాన్యత కల్పిస్తామని స్పష్టం చేశారు. పొన్నూరులో ఉర్దూఘర్, షాదీఖానా నిర్మాణాన్ని పూర్తి చేయడం మైనార్టీలకు ఇచ్చిన హామీల్లో ముఖ్యమైనదని పేర్కొన్నారు. 2018లో 52 సెంట్ల స్థలంలో షాదీఖానా నిర్మాణానికి రూ.1.25 కోట్ల నిధులు కేటాయించి పనులు ప్రారంభించామని, అయితే 2019లో ప్రభుత్వం మారిన తరువాత నిర్మాణం నిలిచిపోయిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ ఫరూఖ్ సహకారంతో అదనపు నిధులు మంజూరు చేయించి నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని వెల్లడించారు.

# మార్చి నాటికి 15 వేల మందికి రుణాలు ఇవ్వాలి

**●పేదలకు సబ్సిడీ, ముద్ర రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు ఆదేశం : చీఫ్ విప్ జీవీ**



వినుకొండ (చైతన్యరథం): నియోజకవర్గంలోని పేద కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించి, స్వయం ఉపాధి ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీలు, ఇతర పేద వర్గాల ప్రజలకు బ్యాంకు రుణాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు బ్యాంకర్లు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్, సంబంధిత ఉన్నతాధికారులతో సమన్వయం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చిన్న వ్యాపారాలు, పాడి పరిశ్రమ, గొర్రెల పెంపకం, కోళ్ల పెంపకం వంటి ఆదాయ మార్గాలను ఎంచుకునే వారికి సబ్సిడీ రుణాలతో పాటు ముద్రా రుణాల ద్వారా సహకారం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని, గ్రామం, మండలం, నియోజకవర్గ స్థాయిలో సమగ్ర ప్రగతి సాధించడం ద్వారా ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచాలన్నది ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

**వినుకొండలో రూ.3.50 కోట్లతో ఆధునిక పార్కు**

వినుకొండ పట్టణంలోని ఎన్‌ఎస్‌పీ కార్పొరేషన్ పేట రోడ్డులో, ఎన్‌ఎస్‌పీ కార్పొరేషన్ సమీపంలో రూ.3.50 కోట్లతో ఆధునిక మున్సిపల్ అమ్యూజ్‌మెంట్ పార్కును అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పిల్లలకు ఆట పరికరాలు, పెద్దలకు ఆహ్లాదకరమైన వాతావరణం, చక్కటి పచ్చదనంతో పార్కును తీర్చిదిద్దుతామని చెప్పారు. అవసరమైతే అదనపు నిధులు సమకూర్చి పార్కును మరింత అభివృద్ధి చేస్తామని, ఏడాదిలోగా పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు.

**వినుకొండ పట్టణంలో 36 ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైన్ల అభివృద్ధి**

వినుకొండ మున్సిపాలిటీలోని 36 వార్డుల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, పార్కులు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ వంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంలో సీసీ రోడ్లు లేని 36 ప్రాంతాలను గుర్తించి, అక్కడ రోడ్ల నిర్మాణానికి నిధులు సమకూర్చినట్లు వెల్లడించారు. ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య సదుపాయాలు, సురక్షితమైన ప్రయాణ సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని పేర్కొన్నారు.

**సుమారు రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు**

వినుకొండ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పథకాల కింద సుమారు రూ.300 కోట్లతో పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా అభివృద్ధి చేసి, వినుకొండను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతిపై ఎమ్మెల్యే యార్లగడ్డ దిగ్భ్రాంతి



విజయవాడ (చైతన్యరథం): నున్న గ్రామానికి చెందిన కొమ్మారెడ్డి రాందేవ్, ఆయన తల్లి అరుణ, ఏడాది వయసున్న కుమారుడు మహాత్రు వెస్ట్ బైపాస్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం మృతుల పార్థివదేహాలకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి మృతికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని భగవంతుడిని ప్రార్థించారు.

# జీవ వైవిధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత : నాగబాబు

అవనిగడ్డ (చైతన్యరథం): జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని ‘ఏపీ-గ్రీన్’ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్, శాసన మండలి సభ్యుడు కొణిదెల నాగబాబు పిలుపునిచ్చారు. మంగళవారం కృష్ణాజిల్లా నాగాయలంక మండలం సంగమేశ్వరం సముద్రతీరంలో మడ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్తో కలిసి ప్రారంభించారు. కృష్ణాజిల్లా తీరప్రాంతంలో క్షీణించిన మడ అడవుల పునరుద్ధరణ దశ-2 కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజా ప్రగతి సేవా సంఘం వారి ఆధ్వర్యంలో 15 లక్షల మడ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. సముద్ర తీర రక్షణ కవచంలా, సముద్ర జీవరాశి సంవృద్ధిగా పెరిగేందుకు మడ అడవులు దోహదం చేస్తాయని నాగబాబు పేర్కొన్నారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

# అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి శంకుస్థాపన



మార్కాపురం (చైతన్యరథం): నికరంపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి శంకుస్థాపన చేశారు. మార్కాపురం మండలంలోని నికరంపల్లి గ్రామంలో పల్లెపండుగ -2.0లో భాగంగా 15 లక్షల రూపాయలతో నిర్మితమైనసీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం ఇదే గ్రామంలో 32 లక్షల రూపాయలతో అతిస్వల్ప నిధులతో నిర్మించ న పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ఇదే గ్రామంలో 36 లక్షల రూపాయలతో 15 ఫైనాన్స్ నిధుల ద్వారా నిర్మితమైన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. మొత్తంగా నికరంపల్లి గ్రామంలో మొత్తంగా 83 లక్షల రూపాయల విలువైన పనులను గౌరవ మార్కాపురం శాసనసభ్యులు వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మునుపెన్నడూ లేని విధంగా మార్కాపురం శాసనసభ్యులు వారు మా గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ ప్రజలు, పంచాయతీరాజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీకి మరోసారి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం

● గత ఎన్నికల్లో ప్రజలు ఒక చెంప దెబ్బ కొట్టారు

● ఇప్పుడు మరోసారి ఓటుతో గట్టిగా కొట్టేందుకు రెడీ

● పాత గుంటూరులో రూ.1.30 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



గుంటూరు (చైతన్యరథం): జగన్ లాంటి సైకో అధ్యక్షుడిగా ఉన్న వైసీపీకి గత సాధారణ ఎన్నికల్లో ప్రజల ఓటు ద్వారా ఒక చెంప మీద కొట్టి బుద్ధి చెప్పారు. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల్లో మరో ప్రజా తీర్పు ద్వారా మరో చెంపపై గట్టిగా కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. తమది అభివృద్ధికి చిరునామా అయితే.. వైసీపీ విధ్వంసానికి మారు పేరు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించండి. పాత గుంటూరును అభివృద్ధిలో మోడల్ గుంటూరుగా తీర్చిదిద్దుతాం అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. స్థానిక పాత గుంటూరులోని సోమువారి వీధి, కట్టవారివీధి, కోసారాజువారి వీధిలో రూ.1.30 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ పాత గుంటూరు లో రెండు దశాబ్దాలుగా కనీసం రోడ్లుగానీ, డ్రెయిన్లుగానీ, వీధి దీపాలుగానీ లేవని, చినుకులు పడితే ఇళ్లలో నుంచి బయటికి రాలేని పరిస్థితి ఉండేదని తెలిపారు. పదేళ్లుగా వైసీపీ నేతల నిర్దయ కారణంగా నిరాదరణకు గురైన ఈ ప్రాంతంలోని ఒక్కొక్క సమస్యను ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. రెండున్నరేళ్ల కాలంలోనే కూటమి పాలనలో అభివృద్ధిని ఈ ప్రాంతానికి పరిచయం చేశామని తెలిపారు. సుమారు 50 వేల మంది నివసించే పాత గుంటూరువాసులకు అవసరమైన నందివెలుగు బ్రిడ్జికి వైసీపీ పాలకులు తట్ట మట్టి కూడా వేయలేదన్నారు. అభివృద్ధి చేయడం చేతగాని వారు రోడ్లపైకి వచ్చి విమర్శలు మాత్రం చేస్తున్నారని, అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పబోతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గ ప్రజలు నాకు ఇచ్చిన అవకాశాన్ని ప్రతి క్షణం అభివృద్ధి కోసం ఆలోచిస్తున్నారని చెప్పారు.

# సర్వేపల్లిలో రికార్డు స్థాయిలో సీఎం రిలీఫ్ ఫండ్

● ఒక్క రోజే రూ.1.12 కోట్లకు పైగా చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సోమిరెడ్డి

సర్వేపల్లి (చైతన్యరథం): అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారికి సీఎంఆర్ఎఫ్ సంజీవనిలా మారిందని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం నెల్లూరులోని వేదాయపాళెం కార్యాలయంలో 113 మందికి రూ.1.12 కోట్ల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. రెండేళ్లలో మొత్తంగా 1231 మందికి రూ.10.92 కోట్ల మేర సీఎం సహాయనిధి సాయం చేశామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలో సుమారు రూ.11 కోట్లు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయించడం చాలా సంతోషంగా ఉందని, మరో రూ.1.50 కోట్ల విలువైన చెక్కులు ప్రాసెసింగ్‌లో



ఉన్నాయని అన్నారు. ఇంత భారీ ఎత్తున సాయం మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి రుణపడి ఉంటామని, సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలందరి తరఫున సీఎం చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా పేదలను ఆదుకునే విషయంలో సీఎం చంద్రబాబు నాయుడు రాజీపడటం లేదని సోమిరెడ్డి పేర్కొన్నారు.

# నూతన పీహెచ్‌సీ భవనానికి స్పీకర్ అయ్యన్న శంకుస్థాపన



చీడిగుమ్మల (చైతన్యరథం): గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామంలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) భవన నిర్మాణానికి ఘనంగా శంకుస్థాపన జరిగింది. రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు వారి సతీమణి చింతకాయల పద్మావతి ఈ కార్యక్రమంలో పాల్గొని... రూ.1 కోటి 93 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఆసుపత్రి భవనానికి కొబ్బరికాయ కొట్టి, శిలాఫలకం ఆవిష్కరించి లాంఛనంగా పనులను ప్రారంభించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించే ఉద్దేశంతో ఒక మినీ ఆసుపత్రి తరహాలో దీనిని నిర్మిస్తున్నామని, రాబోయే ఆరు నెలల్లో అంటే మార్చి నాటికి ఈ భవన నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి తాము ఎంతో చిత్తశుద్ధితో పని చేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఒక్క చీడిగుమ్మల పంచాయతీ పరిధిలోనే గత రెండున్నరేళ్ల వ్యవధిలో పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టామని, గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం కోసం 2 కోట్ల 49 లక్షల రూపాయలు, శ్మశాన వాటికకు 10 లక్షల రూపాయలు మంజూరు చేశామన్నారు. నేడు శంకుస్థాపన చేసుకున్న 1 కోటి 93 లక్షల పీహెచ్‌సీ భవనంతో కలుపుకుని మొత్తంగా ఈ ఒక్క పంచాయతీకే 4 కోట్ల 52 లక్షల రూపాయల నిధులు అందించామని వివరించారు. గొలుగొండ మండల వ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాల కోసం సుమారు 53 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని, అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పన కోసం ఏకంగా సుమారు 575 కోట్ల రూపాయలు వెచ్చించామని ఆయన పేర్కొన్నారు.

# గుడివాడ పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

● 21వ వార్డు ఆదర్శనగర్‌లో రూ.34 లక్షలు, 14వ వార్డులో రూ.45 లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపన

● పట్టణాన్ని సుందరంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలి.... ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపు



గుడివాడ (చైతన్యరథం): పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన రహదారి సదుపాయాలు కల్పించడంతో పాటు పట్టణ పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరిచే దిశగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళు న్నామన్నారు. ఈ క్రమంలో మంగళవారం పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రాము పాల్గొన్నారు. ముందుగా పట్టణంలోని 21వ వార్డు ఆదర్శనగర్‌లో రూ.34 లక్షలతో, 14వ వార్డులో రూ.45 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు స్థానికులతో కలిసి భూమిపూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. అనంతరం గుడివాడ పురపాలక సంఘ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా మంజూరైన ఐదు ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఈవీ) చెత్త సేకరణ వాహనాలను ఎమ్మెల్యే రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ... గుడివాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు నిత్యం అవసరమయ్యే రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో గుడివాడలో సానిటేషన్ మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ఈ క్రమంలో చెత్త సేకరణ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు నూతనంగా ఐదు ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బంది సమన్వయంతో ఇంటింటి నుంచి చెత్త సేకరణను సమర్థవంతంగా నిర్వహించాలని, పట్టణంలో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. గుడివాడ పట్టణాన్ని సుందరంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు కూడా పురపాలక సంఘానికి సహకరించాలని ఎమ్మెల్యే రాము కోరారు.

# ఓటమి భయంతోనే ఎన్నికల్నే జగన్ రాజకీయం చేస్తున్నాడు

● 2021 ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు వ్యాఖ్యల్ని జగన్ మర్చిపోయినా.. ప్రజలు మర్చిపోలేదు : ఎమ్మెల్యే ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): సార్వత్రికమైనా, స్థానిక ఎన్నికలైనా కూటమే విజయం సాధిస్తుందని, ప్రజాస్వామ్యబద్ధంగా స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు జరిగితే వైసీపీకి డిపాజిట్లు రావని జగన్‌కు అర్థమైందని, తన అసమర్థతను, భయాన్ని కప్పిపుచ్చుకుంటూ, ఓటమి భయంతోనే ఆయన ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తున్నాడని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన యడ్లపాడు మండలం కారుచోల, గుత్తావారిపాలెం గ్రామాల్లో పర్యటించారు. కారుచోలలో రూ.20 లక్షలతో నిర్మించే సీసీరోడ్లకు శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి, రూ.6 లక్షలతో మరమ్మతులు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం గుత్తావారిపాలెంలో రూ. 10 లక్షలతో నిర్మించే సీసీరోడ్లకు శంకుస్థాపన చేసి మాట్లాడారు.

**తన హయాంలో స్థానిక ఎన్నికలు ఎలా జరిగాయో జగన్ మర్చిపోతే ఎలా?**

తన ప్రభుత్వంలో స్థానిక ఎన్నికలు ఎలా జరిగాయో జగన్ మర్చిపోయినా... ప్రజలు మర్చిపోలేదని, ఆనాడు నామినేషన్ల ప్రక్రియ మొదలు, ఫలితాల వరకు జరిగిన దారుణాలు మాటల్లో చెప్పలేనివన్నారు. 2021లో విడుదలైన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ పై నాటి హైకోర్టు చేసిన వ్యాఖ్యల్ని జగన్ ఒకసారి గుర్తుచేసుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ విధానాన్ని తప్పుపడుతూ, 'డెమొక్రటిక్ బ్యాక్ స్లైడింగ్' అనే పదాన్ని ఎందుకు వాడారో జగన్ సమాధానం చెప్పాలన్నారు. పారామిలటరీ బలగాల పర్యవేక్షణ... వెబ్ కాస్టింగ్, సీసీటీవీ లైవ్ లు ఏర్పాటు చేయాలంటున్న జగన్.. తన ప్రభుత్వంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో ఇవన్నీ ఎంత సమర్థవంతంగా అమలుచేశాడో చెప్పాలని ప్రత్తిపాటి డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడి.. ప్రజల మద్దతు లేదని తెలిసినప్పుడు ప్రభుత్వంపై నిందలేయడం జగన్ కే చెల్లిందని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని తన జేబుసంస్థగా మార్చుకొని ముఖ్యమంత్రిగా ఆనాడు జగన్ నిర్వహించిన స్థానిక ఎన్నికలు పూర్తిగా ప్రజాస్వామ్య నాణ్యతను మసకబార్చాయని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం స్వేచ్ఛాయుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించి, ప్రజాబలంతో తిరుగులేని విజయం సాధించి, మరోసారి చరిత్ర సృష్టిస్తుందని ప్రత్తిపాటి తెలిపారు. నిన్నటి వరకు బీసీ రిజర్వేషన్ల ముసుగులో కోర్టుల్లో తప్పుడు పిటిషన్లు వేసిన జగన్.. నేడు ఎన్నికల నిర్వహణ అంశాల్ని రాజకీయం చేస్తూ న్యాయస్థానాల్ని తప్పుదారి పట్టిస్తున్నాడని ప్రత్తిపాటి అసహనం వ్యక్తంచేశారు. జగన్ తీరు ఆడలేక మద్దెల ఓడు అన్నట్టు ఉందని ఆయన ఎద్దేవాచేశారు.

# తిరుమలలోని కర్ణాటక సత్రాన్ని పర్యాటక శాఖకు బదిలీ చేయడంపై అభ్యంతరం

●టీటీడీతో కుదిరిన ఒప్పందాన్ని ఉల్లంఘించవద్దు

●ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు అట్లూరి నారాయణరావు



తిరుపతి (చైతన్యరథం): తిరుమలలోని కర్ణాటక సత్రం నిర్వహణను పర్యాటక శాఖకు బదిలీ చేయాలన్న కర్ణాటక ప్రభుత్వ నిర్ణయంపై ఏపీ సాధు పరిషత్, తిరుక్షేత్రాల రక్షణ సమితి, వివిధ హిందూ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ అంశంపై ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు అట్లూరి నారాయణరావు మంగళవారం తిరుపతిలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా అట్లూరి నారాయణరావు మాట్లాడుతూ.. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయానికి సంబంధించిన ప్రతి అంగుళం భూమి స్వామివారికే చెందుతుందని, అక్కడ నిర్మించిన మఠాలు, సత్రాలు, ఇతర నిర్మాణాల విషయంలో టీటీడీదే తుది అధికారం అని పేర్కొన్నారు. టీటీడీకి, కర్ణాటక రాష్ట్రంలోని సంబంధిత ధార్మిక సంస్థల విభాగానికి మధ్య 2007లో కుదిరిన లీజు ఒప్పందం ప్రకారం, తిరుమలలోని సుమారు ఏడు ఎకరాల రెండు సెంట్ల స్థలాన్ని 50 సంవత్సరాల కాలానికి, అంటే 2057 వరకు లీజుకు ఇచ్చినట్లు వివరించారు. భక్తుల సౌకర్యార్థం పాత భవనాన్ని తొలగించి, నూతన వసతి సముదాయాన్ని నిర్మించినట్లు తెలిపారు. 2022 నాటికి ఈ నిర్మాణం పూర్తయి కర్ణాటక భక్తుల కోసం అందుబాటులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. కర్ణాటక ప్రభుత్వ ప్రతినిధి ఆధ్వర్యంలో సత్రం నిర్వహణ సక్రమంగా జరగడం లేదనే కారణంతో, దాని నిర్వహణ బాధ్యతలను పర్యాటక శాఖకు బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. ఈ నిర్ణయం టీటీడీతో కుదిరిన ఒప్పందానికి విరుద్ధంగా ఉందా అనే అంశాన్ని పరిశీలించి, సంబంధిత పత్రాల ఆధారంగా వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో పాటు సంబంధిత ప్రభుత్వ పెద్దలు ఈ అంశంపై పునరాలోచించాలని అట్లూరి నారాయణరావు కోరారు. తిరుమల వంటి పవిత్ర పుణ్యక్షేత్రంలోని భక్తుల వసతి సముదాయాన్ని సాధారణ పర్యాటక కేంద్రంగా పరిగణించరాదని ఆయన అభిప్రాయపడ్డారు. ధార్మిక సంస్థల ఆస్తులు, భక్తుల సౌకర్యాలు, టీటీడీ హక్కులకు సంబంధించిన విషయాల్లో ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఒప్పంద నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటే హిందూ సంఘాలు వ్యతిరేకిస్తాయని, ఈ విషయంలో అవసరమైన కార్యాచరణ చేపడతాయని హెచ్చరించారు. తిరుమల పవిత్రతను, భక్తుల ప్రయోజనాలను కాపాడేందుకు సంబంధిత ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు అట్లూరి నారాయణరావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏపీ సాధు పరిషత్, తిరుక్షేత్రాల రక్షణ సమితి, వివిధ హిందూ సంఘాలు పాల్గొన్నాయి.

# కూటమి ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం పెరుగుతోంది : ఎమ్మెల్యే భూమా



ఆళ్లగడ్డ (చైతన్యరథం): కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో రోజురోజుకూ విశ్వాసం పెరుగుతోందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పేర్కొన్నారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలంలోని కోట కందుకూరు గ్రామంలో 30 కుటుంబాలకు చెందిన వారు తెదేపాలోకి చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలు టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. తమపై నమ్మకంతో పార్టీలోకి చేరిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కోట కందుకూరులో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ప్రత్యేక చొరవతో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని, రెండు నెలల్లో మార్పు స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు.

# కోడుమూరులో ఎమ్మెల్యే బొగ్గుల పల్లె పండుగ కార్యక్రమం



కర్నూలు (చైతన్యరథం): కర్నూలు మండలం రుద్రవరం గ్రామంలో పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.11,085 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనుల్లో భాగంగా కోడుమూరు నియోజవర్గంలోని కోడుమూరు మండలం, బెళగల్ మండలం, గూడూరు మండలాలకు 7 కోట్ల 65 లక్షలతో గ్రామీణ రహదారులు, మౌలిక వసతులు తదితర పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా రుద్రవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధి, రైతుల సంక్షేమం, మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు నియోజకవర్గ DE కర్రెన్న, వైద్య సిబ్బంది, కర్నూలు మండల టీడీపీ కన్వీనర్ బుర్ర వెంకటేష్ నాయుడు, బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కుల సంఘాలకు స్థలాలు

●ఐదు కుల సంఘాలకు 2.05 ఎకరాల భూమి కేటాయింపు... స్థలాల పత్రాలు పంపిణీ చేసిన మంత్రి సవిత



పెనుకొండ (చైతన్యరథం): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వివిధ కుల సంఘాల భవన నిర్మాణాలకు స్థలాలు కేటాయించినట్లు మంత్రి సవిత తెలిపారు. పెనుకొండ క్యాంపు కార్యాలయంలో సోమందేపల్లి ప్రాంతానికి చెందిన ఐదు కుల సంఘాల ప్రతినిధులకు స్థలాల కేటాయింపు పత్రాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కురుబ, వడ్డెర, వాల్మీకి, నాయి బ్రాహ్మణ, పద్మశాలి కుల సంఘాలకు భవన నిర్మాణాల కోసం స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. కుల సంఘాల ప్రతినిధులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ స్థలాల పత్రాలను అందజేసినట్లు పేర్కొన్నారు. కురుబ కుల సంఘానికి 70 సెంట్లు, వడ్డెర కుల సంఘానికి 30 సెంట్లు, వాల్మీకి కుల సంఘానికి 60 సెంట్లు, నాయి బ్రాహ్మణ కుల సంఘానికి 20 సెంట్లు, పద్మశాలి కుల సంఘానికి 25 సెంట్ల చొప్పున మొత్తం 2.05 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలాల్లో ఆయా కుల సంఘాల భవనాల నిర్మాణానికి అవకాశం కలగనుంది. ఈ సందర్భంగా కుల సంఘాల నాయకులు మంత్రి సవితకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా కుల సంఘ నాయకులు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతుల ఆస్తి పత్రాలపై రాజముద్ర.. ఇది చంద్రబాబు మార్క్ పాలన

●గత ప్రభుత్వ రంగులు, ఫోటోలకు స్వస్తి పలికామన్న పరిటాల సునీత

●కుంటిమద్దిలో 1,280మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

●భూసమస్యలు పరస్పర రాజీతో పరిష్కరించుకోవాలని సూచన

●8మందికి రూ.4.70లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే సునీత



రాప్తాడు (చైతన్యరథం): గత ప్రభుత్వం రైతుల భూముల పత్రాలపై తమ ఫోటోలు వేసుకుంటే.. కూటమి ప్రభుత్వంలో రాజముద్రతో రైతులకు పాసుపుస్తకాలు అందజేస్తున్నామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరి మండలం కుంటిమద్ది గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె రైతులకు నూతన పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే సునీతకు స్థానిక నాయకులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రెవెన్యూ అధికారులు, టీడీపీ నాయకులతో కలసి పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. గ్రామంలో మొత్తం 1,450 పాస్ బుక్స్ ఉండగా, మొదటి విడతగా ప్రస్తుతం 1,280 పాస్ పుస్తకాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో రీ-సర్వే పేరుతో తీవ్ర గందరగోళం సృష్టించారని, దీనివల్లనే అనేక భూ సమస్యలు వచ్చాయన్నారు. రైతుల ఆస్తి పత్రాలపై అప్పటి రాజకీయ నాయకుల ఫోటోలు వేసుకుని, వాళ్ల తాత, నాయన సొమ్ము ఇచ్చినట్లు ప్రగల్భాలు పలికారని మండిపడ్డారు. నాడు దీనిపై తాము పెద్ద ఎత్తున పోరాటం చేశామని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రబాబునాయుడు తన ఫోటో వేసుకోవచ్చు కానీ, ఆయన అలా ఆలోచించలేదని.. రాజకీయ ప్రచారానికి తావులేకుండా ఆస్తి పత్రాలపై రాజముద్రను తీసుకొచ్చారన్నారు. కేవలం పాసు పుస్తకాలే కాకుండా, గతంలో తిండి చిక్కీలు, విద్యార్థుల బ్యాగులపై ఉన్న ఫోటోలను తొలగించి, ఇప్పుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం, సర్వేపల్లి రాధాకృష్ణ పేర్లతో విద్యావ్యవస్థలో సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. గత ప్రభుత్వం జరిపిన రీ-సర్వేలో సర్వే రాళ్లపై మాజీ సీఎం ఫోటోలు వేసి వందల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారని, కూటమి ప్రభుత్వం రాగానే ఆ ఫోటోలను తొలగించామని సునీత తెలిపారు. ప్రస్తుత పాస్ పుస్తకాల్లో నకిలీలకు తావులేకుండా ప్రతి పుస్తకంపైనా ప్రత్యేక క్యూ.ఆర్ కోడ్‌ను ముద్రించామన్నారు. ప్రస్తుతం భూముల ధరలు పెరగడంతో చిన్న చిన్న విషయాలకే గొడవలు పడి కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని, దీనివల్ల సమస్యలు ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే ఉండిపోతాయని ఎమ్మెల్యే రైతులకు సూచించారు. గ్రామాల్లోని పెద్దమనుషులు చొరవ తీసుకుని భూవివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, అధికారులు కూడా భూ రికార్డుల మార్పులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి రైతులకు న్యాయం చేయాలని ఆదేశించారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సునీత**

పేద ప్రజల ఆరోగ్య భద్రతకు, కార్పొరేట్ వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించడానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరి మండలం కుంటిమద్ది గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం 8మందికి రూ.4.70లక్షల విలువైన చెక్కులను ఆయా గ్రామాల నాయకుల సమక్షంలో ఆమె పంపిణీ చేశారు.

# మడకశిర నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు 60 ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ

●కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి



మడకశిర (చైతన్యరథం): నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు మేలు చేకూర్చేలా ప్రభుత్వం మంజూరు చేసిన 60 ట్రాన్స్‌ఫార్మర్లను మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) ఎం.ఎస్. రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి విచ్చేసి, రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, వ్యవసాయ రంగానికి నిరంతరం విద్యుత్ అందించడమే లక్ష్యంగా ఈ పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాసమూర్తి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి, డైరెక్టర్ రామకృష్ణ, మాజీ జెడ్పీటీసీ ఉమేష్, అలాగే అన్ని మండలాల కన్వీనర్లు, సింగిల్ విండో అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కూటమి కుటుంబ సభ్యులు, పెద్ద సంఖ్యలో రైతులు మరియు ప్రజలు పాల్గొన్నారు.



## జీఆర్‌టీపీ 6ఏ6 క్రికెట్ టోర్నమెంట్

# గ్రాండ్ సక్సెస్

**యూఎస్ఏ:** జీఆర్‌టీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 6ఏ6 క్రికెట్ టోర్నమెంట్–2026 అత్యంత వైభవంగా ముగిసింది. క్రీడా స్ఫూర్తి, అంకితభావంతో ఈ టోర్నీని అందరూ కలిసి విజయవంతం చేశారు. ఇందుకు సహకరించిన క్రీడాకారులకు, జట్లకు, విజేతలకు, రన్నరప్‌లకు, ఉత్సాహంగా మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

విజేతలు, రన్నరప్‌ల వివరాలు:
డివిజన్ I:
విన్నర్ – సాడ్లర్ సేన
రన్నరప్ – టీ2ఐ ట్రక్
డివిజన్ II:
విన్నర్ – డెక్కన్ వారియర్స్
రన్నరప్ – ఎంసీసీ
డివిజన్ III:
విన్నర్ – టైటాన్స్
రన్నరప్ – సాండ్లర్ థండర్స్

ఈ టోర్నమెంట్‌లో పాల్గొని పోటీతత్వాన్ని, వినోదాన్ని పంచుకున్న ప్రతి జట్టుకు నిర్వాహకులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ టోర్నమెంట్‌ను మొదటి నుంచి చివరి వరకు విజయ వంతంగా నిర్వహించిన స్పోర్ట్స్ సెక్రటరీ స్నేహిత్ రెడ్డికి జీఆర్టీఏ టీం సభ్యులు అభినందనలు తెలిపారు. డైరెక్టర్లు రమేష్, యుగి, వాలంటీర్లు కిరణ్, భాను, మాహి, రాజా, రామ్‌కి, ఇతర వాలంటీర్ల సేవలను ప్రశంసించారు. మాజీ అధ్యక్షులు షేకర్ రెడ్డి, కృష్ణ, శంకర్, కృష్ణారెడ్డి, గణేష్, విజయ్, కమ్యూనిటీ లీడర్లు రాజ్ గద్దం, శివారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు విచ్చేసి మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ టోర్నీ కేవలం క్రికెట్ మాత్రమే కాకుండా మన సమాజాన్ని ఒక్కచోటికి చేర్చి, ఒకరికొకరు మద్దతునిస్తూ మంచి జ్ఞాపకాలను పంచుకునే వేదికగా నిలిచిందని పేర్కొన్నారు.

జీఆర్‌టీఏ–టుగెదర్ వి గ్రో! (GRTA-Together We Grow!) నినాదంతో ఈ టోర్నమెంట్‌ను చిరస్మరణీయంగా మార్చిన అందరికీ జీఆర్టీఏ బృందం ధన్యవాదాలు తెలిపింది.

## అట్లాంటా హిందూ ఆలయంలో 24న

# శ్రీవారి ఉదయస్తమాన సేవా వైభవం

**అట్లాంటా:** అట్లాంటా హిందూ ఆలయం ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన శ్రీవారి ఉదయస్తమాన సేవా మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. తిరుమలలో జరిగే శ్రీవారి సేవల మాదిరిగానే ఉదయం సుప్రభాత సేవ నుంచి రాత్రి శయనోత్సవం వరకు ఒక పూర్తిరోజు పాటు దివ్యమైన సేవలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. భక్తులు కుటుంబ సమేతంగా ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొని శ్రీవేంకటేశ్వర స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు ఆహ్వానించారు.

**కార్యక్రమాల వివరాలు:**
ఉదయం 6 గంటలకు: సుప్రభాతం, విశ్వరూప సేవ (గోమాత, దూడతో), విష్ణు ఆలయం. (గమనిక: శ్రీవారి మూల విగ్రహ అభిషేకం శుక్రవారం ఉదయం 11 గంటలకు ఉంటుంది). 7 గంటలకు: నిత్య ఆరాధన, తోమాల సేవ, విష్ణు ఆలయం.
8 గంటలకు సేవా కాలం–కొలువు, పంచాంగ శ్రవణం, విష్ణు ఆలయం.
9 గంటలకు సహస్రనామార్చన, విష్ణు ఆలయం. 11 గంటలకు తిరుప్పావడ సేవ, శాత్తుమొర, తీర్థ ప్రసాదం, విష్ణు ఆలయం.
మధ్యాహ్నం 12:30 గంటలకు శ్రీవారి కల్యాణ ఉత్సవం, నిత్య కల్యాణి. మధ్యాహ్నం 1:30 గంటలకు: భజన (మధ్యాహ్న భోజన విరామం).
మధ్యాహ్నం 3 గంటలకు ఆర్జిత బ్రహ్మోత్సవం, సకల వాద్య సేవ, నిత్య కల్యాణి. సాయంత్రం 5 గంటలకు వసంతోత్సవం, విష్ణు సహస్రనామ పారాయణం, నిత్య కల్యాణి. రాత్రి 7 గంటలకు సహస్ర దీపోత్సవం, నిత్య కల్యాణి. రాత్రి 8 గంటలకు పుష్ప పల్లకి ప్రాకార ఉత్సవం. రాత్రి 8:30 గంటలకు ప్రణయ కలహోత్సవం–శ్రీవారి యథాస్థానం, శయనోత్సవం, విష్ణు ఆలయం.
స్పాన్సర్‌షిప్, విరాళాల వివరాలు:
గ్రాండ్ స్పాన్సర్‌షిప్ ($2,500): అన్ని సేవలతో పాటు శేష వస్త్రం, లడ్డు, వడ ప్రసాదం అందజేస్తారు.
గోల్డ్ స్పాన్సర్‌షిప్ ($1,116): అన్ని సేవలతో పాటు శేష వస్త్రం, లడ్డు, వడ ప్రసాదం లభిస్తాయి.
సిల్వర్ స్పాన్సర్‌షిప్ ($501): సుప్రభాత సేవ, తోమాల సేవ ఉంటాయి, లడ్డు, వడ ప్రసాదం అందిస్తారు.
శ్రీవారి కల్యాణోత్సవం: $251 (లడ్డు ప్రసాదం లభిస్తుంది).
తోమాల సేవ: $251.
ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపోత్సవం, సుప్రభాత సేవ, శ్రీవారి సహస్ర కలశాభిషేకం, తిరుప్పావడ సేవ: ఒక్కో సేవకు రూ.$101.
శయనోత్సవ సేవ, అన్నదానం: ఒక్కో దానికి $51.

మరిన్ని వివరాలకు ఆలయ కార్యాలయాన్ని 770-907-7102 నెంబరు ద్వారా సంప్రదించవచ్చు. అధ్యక్షుడు రవి (678-464-9027), పూజా కమిటీ చైర్ అరుణ కైలాస (404-368-1509), వైస్ ప్రెసిడెంట్ సాయిరామ్ సూరపనేని (404-578-2298)లను సంప్రదించవచ్చని ఆలయ వర్గాలు తెలిపాయి.




## తెలుగు అసోసియేషన్ ఆఫ్ బ్లూమింగ్టన్ ఆధ్వర్యంలో నవంబరు 15న సంబరాలు

**బ్లూమింగ్టన్:** తెలుగు అసోసియేషన్ ఆఫ్ బ్లూమింగ్టన్ ఆధ్వర్యంలో దసరా, దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించేందుకు రెడీ అయ్యారు. నవంబరు 15 Heartedland Community College 1500W. Raab Road, Normal, IL వేదికగా ఈ వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా కిడ్స్ టాలెంట్ షో, మ్యూజికల్ నైట్‌తో పాటు మరిన్ని సాంస్కృతిక కార్యక్రమాలు కూడా జరగనున్నాయి. మరిన్ని విషయాలను అతి త్వరలోనే అసోసియేషన్ ప్రకటించనుంది. వివరాలకు tabn.il@gmail.com వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు. మరోవైపు ఈ సంబరాలకు హాజరు కాదలచిన వారు https://form.jotform.com/tabilcultural/tab-deepavali-kids-registartion అనే లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 309-532-9577 నెంబరును సంప్రదించవచ్చు.



## న్యూయార్క్‌లో కన్నుల పండువగా

# దుర్గా ఉత్సవ్

**న్యూయార్క్ (అమెరికా):** న్యూయార్క్ నగరంలోని ప్రసిద్ధ టైమ్స్ స్క్వేర్‌లో 'దుర్గా ఉత్సవ్'ను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక భారతీయులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు విశేష ఉత్సాహంతో పాల్గొన్నారు. దుర్గామాతకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కళాకారుల సంగీత విభావరి, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు పండుగ ప్రాంగణాన్ని అలరించాయి. యూఎస్ఏలోని పలు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన ప్రవాస భారతీయులు ఈ వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొని సందడి చేశారు. ఈ ప్రత్యేక కార్యక్రమానికి న్యూయార్క్‌లోని భారత కాన్సుల్ జనరల్ బినయా ప్రధాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను సుదీర్ఘకాలంగా కాపాడుతూ ప్రచారం చేస్తున్నందుకు, ఐదు దశాబ్దాలకు పైగా కృషి చేస్తున్న ఆరు అమెరికా తెలుగు/భారతీయ సంస్థలను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. విదేశాల్లో సైతం మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించడం, వాటిని భావితరాలకు పరిచయం చేయడమే ఈ ఉత్సవాల ప్రధాన లక్ష్యమని సత్కారం పొందిన ఆయా సంస్థల ప్రతినిధులు తెలిపారు.

## కనెక్టికట్ తెలుగు సంఘం ఆధ్వర్యంలో

# 24న దసరా, దీపావళి సంబరాలు

**వెర్నాన్:** కనెక్టికట్ తెలుగు సంఘం (TACT) దసరా, దీపావళి సెలబ్రేషన్స్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. వేడుకల్లో భాగంగా ప్రఖ్యాత గాయని సుమంగళి, తరుణ్ బృందం ఆధ్వర్యంలో అద్భుతమైన లైవ్ మ్యూజికల్ సింగింగ్ ఈవెంట్ ఏర్పాటు చేసింది. మధురమైన పాటలు, ఉత్సాహపరిచే రిథమ్‌తో కూడిన సంగీత విభావరి ప్రేక్షకులను అలరించనుంది.
కార్యక్రమ వివరాలు...
తేదీ: అక్టోబరు 24 (శనివారం)
వేదిక: రాక్‌విల్లే హైస్కూల్, 70 లోవ్‌ల్యాండ్ హిల్ రోడ్, వెర్నాన్, CT 06006
సాంస్కృతిక కార్యక్రమాలు: మధ్యాహ్నం 1.30–సాయంత్రం 5 PM
విందు భోజనం: సాయంత్రం 5.30 PM–6.30 PM (డిన్నర్ కూడా ఏర్పాటు చేస్తున్నారు)
లైవ్ కన్సర్ట్: సాయంత్రం 6:30 PM–రాత్రి 9 గంటల వరకు
డాన్స్ పోటీలు, లైవ్ సింగింగ్‌తో వేడుకలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. డాన్స్ రిజిస్ట్రేషన్లు, వెండర్ స్టాల్స్ కోసం tactevent@yahoo.com మెయిల్ ద్వారా సంప్రదించవచ్చు. టికెట్ల కోసం... ttps://eventvidia.com/s/tactdasaradiwali వెబ్‌సైట్‌ని విజిట్ చేయాలని నిర్వాహకులు కోరారు. సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు: ఉష: +1(732) 874-0355, లిఖిత: +1(443) 881-8009



చైతన్యరథం

# లద్దాఖ్ భారత్‌లో అంతర్భాగం

- వాదిస్తే అబద్ధాలు నిజాలు కావు
- చైనాకు విదేశాంగశాఖ గట్టి కౌంటర్



భారత్‌లో లద్దాఖ్ అంతర్భాగమని కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. లద్దాఖ్ భారత్‌లో అంతర్భాగం కాదంటూ చైనా వ్యక్తం చేసిన అభ్యంతరంపై గట్టి కౌంటర్ ఇచ్చింది. చైనా అడ్డగోలుగా వాదించినంతమాత్రాన నిజాలు అబద్ధాలు కాలేవని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తేల్చి చెప్పారు. మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ కేంద్రపాలిత ప్రాంతం లద్దాఖ్ ఎప్పుడూ భారత్‌లో అంతర్భాగమేనన్నారు. దానిని ఎవరూ భారత్ నుంచి విడదీయలేరు. గతంలో అది మన దేశంలో అంతర్భాగంగా ఉంది. ఇప్పుడూ ఉంది. భవిష్యత్తులోనూ ఉంటుంది. ఎవరూ ఈ వాస్తవాన్ని కాదనలేరు. భారత్‌లో లద్దాఖ్ అంతర్భాగం కాదంటూ చైనా అడ్డగోలుగా వాదించినంతమాత్రాన నిజాలు అబద్ధాలైపోవని జైస్వాల్ స్పష్టం చేశారు.

కాగా.. లద్దాఖ్ ప్రాంతంలో 28 భౌగోళిక ప్రదేశాలను గుర్తిస్తూ కేంద్ర హోం శాఖ ఈనెల 2న కొత్తగా భారత మ్యాప్‌ను విడుదల చేసింది. ఆ మ్యాప్‌పై చైనా అభ్యంతరం తెలిపింది. లద్దాఖ్‌ను భారత్‌లో అంతర్భాగంగా తాము ఎప్పుడూ గుర్తించలేదని, ఆ ప్రాంతంలో భౌగోళిక ప్రదేశాలను గుర్తించడం చట్టవిరుద్ధం అని చైనా పేర్కొంది. ఈ మేరకు చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రాంతంలో తమకూ భాగం ఉందని చైనా వాదించింది. కాగా.. లద్దాఖ్‌లో కేంద్ర హోం శాఖ గుర్తించిన ప్రదేశాల్లో 10 పర్వత శిఖరాలు, రెండు పాస్‌లు, మూడు పర్వతాలు, ఏడు ల్యాండ్ ఏరియాలు, రెండు గ్లేసియర్లు, రెండు వాటర్ బాడీలు, ఒక లోయ, ఒక నది ఉన్నాయి.

# సీబీటీ విధానం మేలు



- పేపర్ లీక్‌లకు పరిష్కారం అదే
- ముందుగానే ప్రశ్నపత్రం తయారీ తగదు
- పెద్ద క్వచ్చన్ బ్యాంక్ నుంచి చివరి నిమిషంలో రూపొందించటం సరైన ప్రత్యామ్నాయం

ప్రశ్నపత్రాల లీకేజీ కట్టడిపై ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, పరీక్షల సంస్కరణలపై ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్‌కు నేతృత్వం వహిస్తున్న నందన్ నీలేకని కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సమస్య పరిష్కారానికి కంప్యూటర్ ఆధారిత పరీక్షా (సీబీటీ) విధానం వైపు మళ్లాలని సూచించారు. ఇందుకోసం పరీక్షా కేంద్రాల నెట్‌వర్క్‌ను మరింతగా విస్తరించాలని ఆయన సూచించారు. ముందుగానే తయారు చేసిన ప్రశ్నపత్రానికి బదులు.. ఒక పెద్ద క్వశ్చన్ బ్యాంక్ నుంచి చివరి నిమిషంలో ప్రశ్నపత్రాన్ని రూపొందించడమనేది లీకేజీ సమస్యను అరికట్టేందుకు ఒక మార్గమని చెప్పారు. ఢిల్లీలో 'బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్ 2026' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరీక్ష జరిగే రోజే కృత్రిమ మేధతో పరీక్ష పత్రాన్ని రూపొందించగలమా? అని అడగ్గా.. ఆయన అవునని సమాధానమిచ్చారు.

చివరి నిమిషంలో పేపర్ సెట్టింగ్ చేసి, కంప్యూటర్ ఆధారిత టెస్టింగ్ సెంటర్స్‌తో పరీక్షను నిర్వహించవచ్చని అన్నారు. ముందుగానే రూపొందించే ప్రశ్న పత్రంపై ఆధారపడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. పరీక్ష విధానంలో మార్పులతో ఈ సమస్యకు పరిష్కారించవచ్చని సూచించారు. పరీక్షల నిర్వహణకు ఏదోక ప్రశ్నపత్రంపై ఆధాపడే బదులు భారీ సంఖ్యలో వివిధ రకాల ప్రశ్నలు ఉండే ఓ క్వశ్చన్ బ్యాంక్‌ను సిద్ధం చేయాలని ఆయన సూచించారు. వాటి నుంచి చివరి నిమిషంలో ప్రశ్నపత్రం సిద్ధం చేసి విద్యార్థులకు అందించాలని అన్నారు. దీంతో, ప్రశ్నపత్రాన్ని ముందుగానే సిద్ధం చేయాల్సిన అవసరం తప్పిపోతుందని చెప్పారు. ప్రశ్న పత్రం ఉందంటే దాన్ని విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించే వారు కూడా ఉంటారని ఆయన వ్యాఖ్యానించారు.

అసలు ఈ సమస్య ఎందుకు తలెత్తుతోందో దాని మూల కారణాలను గుర్తించి, ఒక క్రమబద్ధమైన విధానంతో పరిష్కరించవచ్చు. దీని కోసం సాంకేతికత వినియోగం అవసరం. మా కమిటీ ఇలాంటి వ్యవస్థాపరమైన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తుంది. అదేవిధంగా అన్ని పరీక్షలను సీబీటీగా మార్చే అంశాన్ని కూడా పరిశీలిస్తోంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా 1.5 లక్షల కేంద్రాల్లో విద్యార్థులు సీబీటీ విధానంలో పరీక్ష రాసే సదుపాయం ఉందని అన్నారు. దీన్ని మరింతగా విస్తరించాలని సూచించారు. వీటి అమలుపై ప్రధాని కూడా సుముఖంగానే ఉన్నారని తెలిపారు. సాంకేతికతను పెద్దఎత్తున అమలు చేస్తున్నప్పుడు.. అది ప్రజలందరికీ ఎలా ప్రయోజనకరంగా ఉంటుందనే దానిపై తాను ఎల్లప్పుడూ దృష్టి పెడతానన్నారు. ఇటీవల దేశంలో కలకలం రేపిన నీట్ పేపర్ లీక్ ఉదంతం చివరకు కేంద్ర మంత్రి రాజీనామాకు దారి తీసిన విషయం తెలిసింది. లీకులను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా కేంద్రం దృష్టి పెట్టింది.

## కేంద్రమంత్రి మురుగన్ రాజీనామా



కేంద్ర మంత్రివర్గంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఊహాగానాల నడుమ కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. తమిళనాడులో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తనను పూర్తిగా రాష్ట్ర రాజకీయాలకే పరిమితం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని ఆయన కోరారు. ప్రధాని మోదీకి తన రాజీనామా లేఖను సమర్పించిన ఎల్. మురుగన్.. కేంద్ర కేబినెట్‌లో తనకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తమిళనాడులో పార్టీని క్షేత్రస్థాయిలో సంస్థాగతంగా శక్తివంతం చేయడమే తన ముందున్న ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. రాబోయే రాజకీయ పరిణామాలు, ఎన్నికల వ్యూహాల నేపథ్యంలో తమిళనాడులో బీజేపీ జెండాను ఎగరవేయడానికి, పార్టీని గ్రామస్థాయిలో ప్రజలకు చేరువ చేయడానికి రాష్ట్ర బాధ్యతలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. కేంద్ర మంత్రి పదవికి వీడ్కోలు పలికిన ఎల్. మురుగన్ త్వరలోనే పూర్తిగా తమిళనాడు రాష్ట్ర రాజకీయాల్లోకి వెళ్లి పార్టీ బలోపేతం కోసం సుడిగాలి పర్యటనలు చేయనున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## డ్రగ్స్ అమ్మకాలపై నిలదీస్తే.. లైవ్‌లోనే కాల్చేశాడు



మెడికల్ షాపుల్లో మత్తుపదార్థాల విక్రయాలను ఫేస్‌బుక్ లైవ్‌లో ప్రశ్నించడం ఓ సామాజిక ఉద్యమకారుడి ప్రాణాలు తీసింది. ఒక మెడికల్ షాపు యజమాని జరిపిన కాల్పుల్లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న పర్వీందర్ సింగ్ జోటా మృతి చెందిన ఘటన పంజాబ్‌లోని మాన్సా జిల్లాలో చోటుచేసుకుంది.

రాష్ట్రంలో విచ్చలవిడిగా సాగుతున్న అక్రమ డ్రగ్స్, మత్తు పదార్థాల విక్రయాలను, మందుల దుకాణాల్లో డ్రగ్స్ అక్రమ విక్రయాలను పర్వీందర్ ప్రశ్నిస్తుంటారు. అలాంటి దుకాణాలను ఫేస్ బుక్ లైవ్ ద్వారా బయట పెడుతుంటారు. అలాగే మంగళవారం డ్రగ్స్ విక్రయాలపై మాన్సా జిల్లాలోని ఓ దుకాణదారుడిని ప్రశ్నించారు. దానిని ఫేస్‌బుక్‌లో లైవ్ చేయడం ప్రారంభించారు. దాంతో యజమానికి, పర్వీందర్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. తనతో పాటు ఒక వృద్ధుడిని ఉంచుకుని, ఆ దుకాణం నుంచే తాము మత్తు పదార్థాలు కొనుగోలు చేసినట్లు ఆయన వీడియోలో స్పష్టంగా చూపించారు. ఈ వ్యవహారంపై షాప్ యజమానికి, జోటాకు మధ్య వాగ్వాదం పెరిగింది. ఇదంతా లైవ్‌లో వస్తోంది.

ఆ సమయంలో మెడికల్ స్టోర్ యజమాని చేతిలో పిస్టల్ కనిపించింది. అతడు కాల్పులు జరపడంతో పర్వీందర్ నేలపై పడిపోయినట్లు ఆ దృశ్యాల్లో రికార్డయింది. కాల్పుల శబ్దం వచ్చిన వెంటనే జోటా మొబైల్ ఫోన్ కిందపడిపోవడంతో లైవ్ రికార్డింగ్ ఆగిపోయింది. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడు. పట్టపగలు జరిగిన ఈ దారుణ హత్య పంజాబ్లో రాజకీయ దుమారం రేపుతోంది. శాంతిభద్రతలు సరిగా లేవని ఆప్ ప్రభుత్వంపై విపక్షాలు విరుచుకుపడుతున్నాయి.

## గతంలో పద్మ అవార్డులతో సీఈసీలకు కాంగ్రెస్ లంచం

- కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ఆరోపణ



కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని విపక్షాల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతోన్న తరుణంలో కేంద్రమంత్రి పీయూష్ గోయల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ గతంలో పద్మ అవార్డుల రూపంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్లకు (సీఈసీ) లంచం ఇచ్చిందని ఆరోపించారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని ఎన్నికల కమిషనర్లందరూ స్వతంత్రంగా పనిచేశారన్నారు.

మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఎన్నికల కమిషనర్లుగా పనిచేసిన అధికారులకు.. పదవీ విరమణ తర్వాత రాజకీయ పదవులు, పద్మ అవార్డులు ఇచ్చి ప్రయోజనం చేకూర్చిందని ఆరోపించారు. గత కొన్నిరోజులుగా రాహుల్ గాంధీ ద్వంద్వ వైఖరి, పిల్ల చేష్టలను చూస్తున్నాం. ఆయన పార్టీ ఈసీలకు ఎన్నికల్లో టిక్కెట్లు ఇచ్చింది. మాజీ సీఈసీ టీఎన్ శేషన్ ను బీజేపీ అగ్రనాయకుడు ఎల్‌కే ఆద్వానీకి వ్యతిరేకంగా పనిచేసేలా కాంగ్రెస్ ప్రోత్సహించింది, ఆ పార్టీ తనకు అనుకూలంగా ఉన్న సీఈసీలందరికీ ప్రయోజనం చేకూర్చింది. మాజీ సీఈసీ ఎంఎస్ గిల్‌కు పద్మ విభూషణ్ అవార్డు ఇచ్చింది. 1986లో ఆర్కే త్రివేదిని గుజరాత్ గవర్నర్‌గా నియమించింది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్షంగా నియామకాలు చేపట్టేది. సంబంధిత వర్గాలు ఎవరితోనూ సంప్రదింపులు, చర్చలు లేకుండా నియామకాలు చేపట్టేది. ఇలాంటి పరిస్థితుల్లోనే ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం 2023లో సీఈసీ ఎంపికకు ఒక కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం కింద ప్రతిపక్ష నాయకుడు ఎంపిక కమిటీలో సభ్యుడిగా ఉన్నారని వెల్లడించారు.

## స్టార్ లింక్‌కు అనుమతులు నిలిపివేయండి

- కేంద్రానికి స్వదేశీ జాగరణ్ మంచ్ వినతి




దేశంలో స్టార్ లింక్ బ్రాడ్‌బాండ్ సేవలను ప్రారంభించేందుకు అవసరమైన అనుమతులను నిలిపివేయాలని ఆరెస్సెస్ అనుబంధ సంస్థ స్వదేశీ జాగరణ్ మంచ్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అనుమతుల జాప్యం విషయంలో భారత ప్రభుత్వంపై, వ్యాపారులపై స్టార్ లింక్ అధిపతి ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. మస్క్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని స్వదేశీ జాగరణ్ మంచ్ జాతీయ కో-కన్వీనర్ అశ్వినీ మహాజన్ తప్పుబట్టారు.

దేశ జాతీయ భద్రతకు సంబంధించిన ఆందోళనలను కారణంగా చూపుతూ స్టార్ లింక్‌ను నిరోధించే హక్కు భారత్‌కు ఉందని మహాజన్ పేర్కొన్నారు. తద్వారా అమెరికా వంటి వాణిజ్య భాగస్వాములకు సైతం ఒక సందేశం పంపొచ్చని అభిప్రాయపడ్డారు. స్టార్ లింక్ కమర్షియల్ సేవల ప్రారంభానికి మస్క్ అనుమతులు మాత్రమే కోరారని, భారత ప్రభుత్వం దాన్ని ఆమోదించడం గానీ, తిరస్కరించడం గానీ చేయలేదని పేర్కొన్నారు. అనుమతుల జాప్యంపై ఆరా తీయాలే తప్ప... భారత ప్రభుత్వం, వ్యాపారులు లక్ష్యంగా విమర్శలు చేయడం తగదని అభిప్రాయపడ్డారు. అవసరమైన అనుమతులు పొందకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్న ప్రయత్నం కనిపిస్తోందన్నారు.

ఉక్రెయిన్, ఇరాన్, రష్యా, చైనా, తైవాన్.. తదితర దేశాల్లో స్టార్ లింక్ విషయంలో భద్రతాపరమైన ఆందోళనలు ఉన్నాయని మహాజన్ పేర్కొన్నారు. జాతీయ భద్రతా కారణాలు చూపుతూ స్టార్ లింక్‌కు అనుమతులు నిరాకరించడం వల్ల దేశీయంగా అభివృద్ధి చేసిన శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను మారుమూల గ్రామాలకూ అందించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

## ఐసీసీపై అత్యంత క్రూరంగా ట్రంప్ వ్యాఖ్యలు: నవీ పిళ్ళై

అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతికూల వ్యాఖ్యలను నోబెల్ శాంతి బహుమతి విజేత నవీ పిళ్ళై ఖండించారు. ట్రంప్ వ్యాఖ్యలు పూర్తిగా చట్టవిరుద్ధమైనవని, అత్యంత క్రూరమైనవని ఆమె అన్నారు. ప్రపంచ దేశాలు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టును, అంతర్జాతీయ న్యాయ వ్యవస్థను రక్షించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. పిళ్ళైకు నోబెల్ శాంతి బహుమతి ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఆమె పనిచేసిన అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుపై అమెరికా ఆంక్షలు ప్రకటించింది. అమెరికాకు అత్యంత ఆప్త మిత్ర దేశమైన ఇజ్రాయెల్



మారణహోమానికి పాల్పడిందని పేర్కొంటూ ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అరెస్టుకు గతంలో ఐసీసీ వారెంట్లు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నోబెల్ శాంతి బహుమతి కోసం ప్రయత్నించి భంగపడిన ట్రంప్ ఆ బహుమతి ఐసీసీకి దక్కడాన్ని జీర్ణించుకోలేకపోయారు. అంతర్జాతీయ న్యాయసూత్రాలను బలోపేతం చేసినందుకు నవీ పిళ్ళైకు నోబెల్ శాంతి బహుమతి దక్కింది. దక్షిణాఫ్రికాలో జాతి వివక్ష అంతానికి జీవితాన్ని అంకితం చేసిన నల్లసూరీడు నెల్సన్ మండేలాకు న్యాయ సహాయం అందించడంతోపాటు గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడిందని నిర్ధరించిన కమిటీలో ఆమె సభ్యురాలిగా పనిచేశారు. మూడు అంతర్జాతీయ న్యాయస్థానాల్లో న్యాయమూర్తిగా వ్యవహరించారు. "ఈ రకమైన పనికి గుర్తింపు లభించడం అద్భుతం. నాకే కాదు నా సహచరులకు కూడా" అని పిళ్ళై అన్నారు.

## న్యూయార్క్‌లో మహమ్మద్ యూనస్‌కు నిరసనల సెగ



బంగ్లాదేశ్ మాజీ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్‌కు అమెరికాలో నిరసన సెగ తగిలింది. న్యూయార్క్‌లోని జాన్ ఎఫ్. కెన్నెడీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కొందరు బంగ్లాదేశ్ ప్రవాసులు ఆయనను నిలదీశారు. మీరు ఉగ్రవాది.. బంగ్లాదేశ్‌లో ప్రజలను చంపారు.. ఇక్కడికి ఎందుకు వచ్చారు?' అంటూ ప్రశ్నించారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచారని, వేలాది మంది పోలీసుల మరణాలకు బాధ్యత వహించాలని కొందరు నినాదాలు చేశారు. ఈ నెల 12న మహమ్మద్ యూనస్ ఖతార్ ఎయిర్‌వేస్ విమానంలో దోహా నుంచి న్యూయార్క్ చేరుకున్నారు. జేఎఫ్‌కే విమానాశ్రయంలోని టెర్మినల్-8 నుంచి యూనస్ వీల్‌చైర్‌లో వెళ్తుండగా కొందరు ఆయన వద్దకు వచ్చి నినాదాలు చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేశారని ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో వేలాది మంది పోలీసుల మరణాలు, పెద్ద సంఖ్యలో అరెస్టుల అంశాలను కూడా ప్రస్తావించారు. కొందరు నిరసనకారులు ఆయనను వెనక్కి వెళ్లాలని డిమాండ్ చేశారు. భద్రతా సిబ్బంది యూనస్‌ను సురక్షితంగా అక్కడి నుంచి తీసుకెళ్లారు. బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం పతనమైన తర్వాత 2024 ఆగస్టు 8న మహమ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా బాధ్యతలు చేపట్టారు. ఆయన ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతలు, రాజకీయ హింస, అరెస్టులు, మైనారిటీల భద్రత వంటి అంశాలపై విమర్శలు వెల్లువెత్తాయి. అలాగే యూనస్ తాత్కాలిక ప్రభుత్వ హయాంలో భారత్-బంగ్లాదేశ్ సంబంధాలూ బలహీనమయ్యాయి. 2025 మార్చిలో చైనా పర్యటన సందర్భంగా భారత ఈశాన్య రాష్ట్రాల భౌగోళిక స్థితి, ప్రాంతీయ వాణిజ్య అవకాశాలపై యూనస్ చేసిన వ్యాఖ్యలు విమర్శలకు దారితీశాయి.

# నాసా స్పేస్‌ఎక్స్ ప్రయోగం సక్సెస్





అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో (ఐఎస్ఎస్) నివసించే వ్యోమగాముల కోసం నాసా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్గో మిషన్ విజయవంతమైంది. ఫ్లోరిడాలోని కేప్ కెనావెరల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుంచి మంగళవారం సాయంత్రం 4:03 గంటలకు స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ రాకెట్ ద్వారా మానవ రహిత 'డ్రాగన్' కార్గో అంతరిక్ష నౌకను పంపారు. ఇందులో వ్యోమగాముల కోసం 2,800 కేజీలకు పైగా ఆహారం, రోజువారీ సామాగ్రి, నూతన పరికరాలు, అత్యంత కీలకమైన శాస్త్రీయ ప్రయోగ సామగ్రిని పంపినట్లు నాసా వెల్లడించింది.

### ఐఎస్ఎస్‌తో డాకింగ్

సుమారు 52 గంటల పాటు అంతరిక్షంలో ప్రయాణించిన తర్వాత, ఈ డ్రాగన్ అంతరిక్ష నౌక గురువారం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో కక్ష్యలోని ఐఎస్ఎస్‌తో దానికదే అనుసంధానం కానుంది. నాసా కోసం స్పేస్‌ఎక్స్ చేపట్టిన 35వ వాణిజ్య కార్గో డెలివరీ మిషన్ ఇది. వ్యోమగాములకు ఎటువంటి ఇబ్బంది కలగ కుండా నాసా క్రమం తప్పకుండా ఈ సరుకులను పంపిస్తోంది.

డ్రాగన్ నౌకలో అంతరిక్ష కేంద్రానికి విద్యుత్ ఉత్పత్తిని పెంచడానికి అవసరమైన నూతన సోలార్ అర్రే ప్యానెల్స్, మానవ ఆరోగ్యానికి సంబంధించిన విప్లవాత్మక ప్రయోగ సామాగ్రి కూడా ఉన్నాయి. అల్జీమర్స్, పార్కిన్సన్స్ వంటి వ్యాధుల పరిశోధన కోసం ప్రయోగశాలలో పెంచిన చిన్నపాటి మానవ మెదడు కణజాల నమూనాలు కూడా ఈ నౌక ద్వారా పంపించారు. నవంబర్ రెండో వారం వరకు ఐఎస్ఎస్‌తోనే ఉండనున్న ఈ డ్రాగన్ నౌక.. అక్కడ పూర్తయిన ప్రయోగాలు, శాస్త్రీయ నమూనాలను తీసుకుని తిరిగి భూమికి రానుంది.

## కుబేరుల రాజ్యం నడుపుతున్న మస్క్

### - అమెరికా సెనెటర్ బెర్నీ సాండర్స్ ఆగ్రహం



భారత్‌లో స్టార్‌లింక్ ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలకు అనుమతుల జాప్యంపై ప్రపంచకుబేరుడు ఎలాన్ మస్క్ చేస్తోన్న విమర్శలు కలకలం సృష్టిస్తున్నాయి. ఇప్పుడు ఆయనపై అమెరికా సెనెటర్ బెర్నీ సాండర్స్ ఎదురుదాడి చేశారు. అందరికంటే పెద్ద మోసగాడైన వ్యాపారవేత్తగా మస్క్‌ను ఆయన అభివర్ణించారు. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో మస్క్ 290 మిలియన్ డాలర్లు ఖర్చు చేశారని దుయ్యబట్టారు. ఆ ఖర్చుకు ఫలితం లభించింది. ఆ తర్వాత ఆయన సంపద 696 బిలియన్ డాలర్లు (రూ.66 లక్షల కోట్లు) పెరిగి ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్ గా మారారని సాండర్స్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కానీ మస్క్ ఇక్కడితో ఆగలేదు. కాంగ్రెస్ (అమెరికా పార్లమెంట్)లో రిపబ్లికన్ల పట్టు కొనసాగించేందుకు మస్క్ 366 మిలియన్ డాలర్లు ఖర్చు చేస్తున్నారు. మస్క్‌ను ఆపండి.. కుబేరుల రాజ్యానికి ముగింపు పలకండని సాండర్స్ మండిపడ్డారు.

భారత దేశంలో తన స్టార్ లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించకుండా కొందరు సంపన్న వ్యాపారవేత్తలు అడ్డుకుంటున్నారని మస్క్ ఆరోపించిన సంగతి తెలిసిందే. తద్వారా వారు భారత్‌లో తమ గుత్తాధిపత్యాన్ని కాపాడుకోవాలని చూస్తున్నట్లు విమర్శించారు. బీజేపీ ప్రచారాన్ని సామాజిక మాధ్యమాల్లో ముమ్మరం చేయడానికి అవసరమైన నిధుల్ని రిలయన్స్ సంస్థతో సంబంధం ఉన్న కంపెనీ సమకూర్చిందంటూ మీడియా కథనాలను షేర్ చేశారు. ఇప్పుడు మస్క్ ను ఉద్దేశించి సాండర్స్ అలాంటి విమర్శలే చేయడం గమనార్హం.

## హూతీల దెబ్బకు.. అజ్ఞాతవాసంలో సౌదీ యువరాజు

దశాబ్దకాలంలో ఎన్నడూ లేనివిధంగా సౌదీ అరేబియాపై హూతీ తిరుగుబాటుదారులు విరుచుకుపడుతున్నారు. దీంతో సౌదీ ప్రభుత్వం అనుక్షణం అప్రమత్తంగా ఉంటోంది.ఈ నేపథ్యంలో యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ఎప్పుడు ఏ రాజభవనంలో ఉంటున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రత్యేకంగా ఎంపిక చేసిన భద్రతా బృందం ఆయనను రక్షించేందుకు ఎప్పటికప్పుడు బంకర్లు, పటిష్ట భద్రత ఉన్న వేర్వేరు ప్యాలెస్లకు తరలిస్తోంది.

సౌదీ లోని విమానాశ్రయాలు, ఇందన మౌలిక సదుపాయాలు, నౌకామార్గాలే లక్ష్యంగా హూతీలు దాడులు చేస్తున్నారు. ఇటీవల రియాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన దాడిలో దాదాపు 13 మంది మృతి చెందగా.. 300మందికి పైగా గాయపడ్డారు. అప్పటి నుంచి యువరాజుకు అందిస్తోన్న భద్రతను మరింతపెంచారు.అలాగే బహిరంగ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. గతవారం సౌదీలో రక్తదాన కార్యక్రమం జరిగింది. ఆ తర్వాత నుంచి ఆయన బహిరంగంగా ఎక్కడా కనిపించడం లేదని అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. భద్రతాకారణాలరీత్యా ఆయన్ను ఒక రాజభవనం నుంచి మరొక రాజభవనం నుంచి తరలిస్తున్నారు.

ఈ ప్యాలెస్లలో కట్టుదిట్టమైన భద్రత ఉండటమే గాకుండా.. క్షిపణి దాడులను తట్టుకునేలా బంకర్లు ఉన్నాయి. హూతీల వద్ద బాలిస్టిక్ క్షిపణులతోపాటు ప్రయాణ సమయంలోనే దిశ మార్చుకోగల అధునాతన మిసైల్స్ కూడా ఉన్నాయి. ఇవి సౌదీ అరేబియా



ఉపయోగిస్తున్న పేట్రియాట్ ఇంటర్సెప్టర్లు, ఇతర రక్షణ వ్యవస్థలకు సవాల్ విసురుతుండటంతో సౌదీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. హూతీల దాడుతు యువరాజుపై ఒత్తిడి పెంచు తున్నాయి. సౌదీని చమురు ఆధారిత ఆర్థిక వ్యవస్థ గానే ఉంచకుండా బహుళ రంగాల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు ప్రతిష్టాత్మక ప్రణాళికతో ఆయన ముందుకు సాగుతుండగా అందుకు హూతీల దాడు లు సవాలు మారాయి. పర్యాటకంగానూ సౌదీ ఆశ యాలను, పెట్టుబడి ప్రాజెక్టులను ప్రమాదంలో పడే స్తున్నాయి. ఇలాంటి కాపాడుతుందనుకున్న మిత్ర దేశం అమెరికా దూరంగా ఉండటం, అదే విధంగా తుర్కియే, పాకిస్థాన్‌తో కుదుర్చుకున్న మక్కా ఒప్పందం అక్కరకు రాకపోవడంతో సౌదీ పరిస్థితి ఇప్పుడు గందరగోళంగా మారింది.



## రష్యాలో ఎలుగుబంట్ల ఊచకోత

రష్యాలో ఎలుగుబంట్ల ఊచకోత కొనసాగుతోంది. 2026 ప్రారంభం నుంచి అక్టోబర్ మొదటి వారం వరకు అంటే తొమ్మిది నెలల వ్యవధిలో సుమారు 3,500 ఎలుగుబంట్లను అధికారులు హతమార్చారు. సైబీరియా నుంచి దేశంలోని సుదూర తూర్పు (ఫార్ ఈస్ట్) ప్రాంతాల వరకు ఈ ఘటనలు భారీగా నమోదయ్యాయి. అధికారిక గణాంకాల ప్రకారం ఒక్క సైబీరియాలోనే దాదాపు 2,200 ఎలుగుబంట్లు, ఫార్ ఈస్ట్ ప్రాంతంలో 1,100కి పైగా ఎలుగుబంట్లను చంపారు. ఈ ఏడాది రష్యాలోని పలు ప్రాంతాల్లో ఎలుగుబంట్లు మానవ ఆవాసాల్లోకి ప్రవేశించి ప్రజలపై దాడులకు తెగబడ్డాయి. ఈ దాడుల్లో కొందరు పౌరులు ప్రాణాలు కోల్పోవడంతో, మానవ భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమించిన ఎలుగుబంట్లను ఏరివేయాలని అధికారులు నిర్ణయించి కాల్చిచంపారు. ప్రధానంగా అడవుల్లో సహజ సిద్ధంగా దొరికే పండ్లు, బెర్రీలు తగినంతగా లభించకపోవడం, వాతావరణ మార్పులు, తీవ్ర కరువు పరిస్థితులవల్ల ఆహార కొరత ఏర్పడి అవి గ్రామాలు, పట్టణాల వైపు వస్తున్నాయి.జనావాసాల సమీపంలో బహిరంగంగా పారబోసే వ్యర్థాలు, ఆహార అవశేషాలు వీటిని ఆకర్షిస్తున్నాయి. అయితే కేవలం ఎలుగుబంట్లను చంపడమే పరిష్కారం కాదని, అడవుల పర్యావరణ సమతుల్యతనుకాపాడుతూనే వ్యర్థాల నిర్వహణ సరిగ్గా చేపట్టడం, ప్రజలకు రక్షణ మార్గదర్శకాలు అందించడం అత్యవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

స్పోర్ట్స్

చైతన్యరథం

# సిరీస్ పట్టేస్తారా?

**- హైదరాబాద్‌లో ఉప్పల్ వేదికగా విండీస్‌తో నేడు నాలుగో టీ 20**
**- 5 మ్యాచ్‌ల సిరీస్‌లో 2-1 ఆధిక్యంలో టీమిండియా**




టీమిండియా, వెస్టిండీస్ జట్ల మధ్య నాలుగో టీ 20 బుధవారం హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరగనుంది. ఐదు టీ 20ల ఈ సిరీస్‌లో భారత్ ఇప్పటికే 2-1 ఆధిక్యంతో ఉంది. లక్నోలో జరిగిన తొలి టీ20లో భారత్ గెలుపొందగా, తరువాత రాంచీలో జరిగిన రెండో మ్యాచ్‌లో వెస్టిండీస్ రికార్డు స్థాయిలో 250 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించింది. తరువాత ఇండోర్‌లో జరిగిన మూడో మ్యాచ్‌లో టీమిండియా విజయం సాధించి సిరీస్‌లో 2-1 ఆధిక్యం సాధించింది. ఆ నేపథ్యంలో విండీస్‌కు మరో అవకాశం ఇవ్వకుండా హైదరాబాద్‌లో మ్యాచ్‌లోనే సిరీస్‌ను చేజిక్కించుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు.

**చివరి మ్యాచ్‌లో వైభవ్‌ను ఆడించాలి**

భారత మాజీ సహాయక కోచ్ అభిషేక్ నాయర్ కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నాడు. నాలుగో మ్యాచ్‌ను గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకున్నాక చివరి మ్యాచ్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అవకాశం ఇవ్వాలన్నాడు. భారత్ ముందు 3-1తో ఆధిక్యంలోకి వెళ్లి సిరీస్‌ను సొంతం చేసుకోవాలి. ఆ తర్వాత చివరి మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీకి అవకాశం ఇవ్వాలని నాయర్ అన్నాడు. కాగా.. విండీస్‌తో సిరీస్‌లో ఇప్పటివరకు వైభవ్‌కు తుది జట్టులో చోటు దక్కలేదు. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్‌లకే టీమ్‌ఇండియా యాజమాన్యం ఓపెనర్లుగా అవకాశాలు కల్పిస్తోంది.

**టాప్ ఆర్డర్‌లో మార్పులు వద్దు**

భారత మాజీ క్రికెటర్ ఛతేశ్వర్ పుజారా కూడా నాలుగో టీ 20పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఉప్పల్ పిచ్ ఎలా ఉండబోతుందన్న అంశం మీదే జట్ల గెలుపోటములు ఆధారపడి ఉంటాయని అభిప్రాయపడ్డాడు. అదే విధంగా భారత తుదిజట్టు కూర్పు గురించి కూడా పుజారా మాట్లాడాడు. టాపార్డర్‌లో ఎలాంటి మార్పులు ఉండకూడదనే కోరుకుంటున్నా. సంజూ శాంసన్, అభిషేక్ శర్మ ఓపెనర్లుగా రావాలి. ఇషాన్ కిషన్ మూడు, శ్రేయస్ అయ్యర్ నాలుగు, తిలక్ వర్మ ఐదో స్థానంలో యథావిధిగా వస్తారు. ఇక ఆల్రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డికి మరో అవకాశం ఇవ్వాలని కోరుకుంటున్నానన్నాడు.

## ఐదోసారి ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్'గా గిల్




భారత వన్డే, టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అరుదైన ఘనత సాధించాడు. సెప్టెంబర్ నెలకు గాను ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డు దక్కించుకున్నాడు. గిల్ ఈ అవార్డు అందుకోవడం రికార్డు స్థాయిలో ఇది ఐదోసారి. సెప్టెంబర్‌లో వెస్టిండీస్‌తో జరిగిన రెండు వన్డేల్లో గిల్ 333 పరుగులు చేశాడు. మరోవైపు మహిళల క్రికెట్‌లో స్టార్ యువ ఓపెనర్ షఫాలీ వర్మను ఈ అవార్డు వరించింది. అటు పురుషులు, ఇటు మహిళల క్రికెట్‌లో భారత క్రికెటర్లే 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డు దక్కించుకోవడం విశేషం.

వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో గిల్ అద్భుతంగా రాణించాడు. తిరువనంతపురంలో జరిగిన తొలి వన్డేలో 110 పరుగులతో అదరగొట్టిన ఈ స్టార్ బ్యాటర్.. ఆ తర్వాతి మ్యాచ్‌లో విధ్వంసకర ద్విశతకంతో చెలరేగాడు. కేవలం 133 బంతుల్లోనే 223 పరుగులు చేసి రికార్డు సృష్టించాడు. ఈ ప్రదర్శనతో గిల్ ఐదోసారి ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్ అవార్డును సొంతం చేసుకున్నాడు. గతంలో 2023 జనవరి, సెప్టెంబర్, 2025 ఫిబ్రవరి, జులై నెలల్లోనూ అతడికి ఈ అవార్డు దక్కింది. వెస్టిండీస్ మహిళా జట్టు కెప్టెన్ హేలీ మాథ్యూస్ కూడా ఐదుసార్లు ఈ అవార్డును గెలుచుకుంది.

## బంగ్లా, ఆఫ్ఘాన్ ఏకైక టెస్ట్ డ్రా

**- ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ లిట్టన్‌దాస్**



బంగ్లాదేశ్, ఆఫ్ఘానిస్తాన్ మధ్య అబదాబి వేదికగా జరిగిన ఏకైక టెస్ట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. 479 పరుగుల లక్ష్యసాధనకు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆఫ్ఘనిస్తాన్ ఐదోరోజు మంగళవారం ఆట ముగిసే సమయానికి ఎనిమిది వికెట్ల నష్టానికి 346 పరుగులు చేయటంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆఫ్ఘాన్ బ్యాటర్లలో సెదిఖుల్లా అటల్ 111 (332), రహ్మత్ షా 51 (123), ఖయాస్ అహ్మద్ 49 (80) పరుగులు చేశారు. ఈ మ్యాచ్‌లో ఒక సెంచరీ, మరో అర్ధ సెంచరీ చేసి, వికెట్ కీపర్‌గా తొమ్మిది క్యాచ్లు అందుకున్న లిట్టన్‌దాస్‌కు ప్లేయర్ ఆఫ్ ది అవార్డు ప్రకటించారు.

ఈ మ్యాచ్ లో లిట్టన్ 150కి పైగా పరుగులు చేయడంతో పాటు తొమ్మిది క్యాచ్లు అందుకున్నాడు. తద్వారా ప్రపంచంలో ఈ ఘనత సాధించిన తొలి క్రికెటర్‌గా నిలిచాడు. టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకు ఎవరూ ఈ ఘనత సాధించలేదు. ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన మ్యాచ్ ఐదో రోజు ఆటలో దాస్ అద్భుతమైన క్యాచ్‌తో ఇక్రమ్ అలీఖిల్‌ను ఔట్ చేయటంతో అతడి ఖాతాలో తొమ్మిది క్యాచ్‌లు చేరాయి. తొలి ఇన్నింగ్స్ లో ఐదు క్యాచ్‌లు అందుకున్న అతడు, రెండో ఇన్నింగ్స్ లోనూ నాలుగు క్యాచ్లు పట్టాడు.

# తొలి టెస్ట్‌లో ఆస్ట్రేలియా ఘన విజయం

**- 214 పరుగుల తేడాతో ఓడిన దక్షిణాఫ్రికా**
**- ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ మాట్ రెన్షా**
**- డబ్ల్యూటీసీ పట్టికలో కీలక మార్పులు**



దక్షిణాఫ్రికాతో మూడు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా దర్బన్ లోని కింగ్స్‌మీడ్ వేదికగా జరిగిన జరిగిన తొలి టెస్ట్‌లో 214 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా పేసర్ జోష్ హేజిల్‌వుడ్ ఆరు వికెట్లతో చెలరేగాడు. 421 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో చివరి రోజు మంగళవారం 206 పరుగులకే ఆలౌటైంది. హేజిల్‌వుడ్ 49 పరుగులిచ్చి ఆరు వికెట్లు పడగొట్టాడు. చివరి నాలుగు వికెట్లను కేవలం 16 బంతుల వ్యవధిలో ఐదు పరుగులకే ఆసీస్ పడగొట్టడం విశేషం. ఆస్ట్రేలియా విజయంలో మాట్ రెన్షా కీలక పాత్ర పోషించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 190 పరుగులు చేసిన అతడు.. రెండో ఇన్నింగ్స్‌లో 82 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అంతేకాకుండా బౌలింగ్‌లోనూ రాణించి బవుమా వికెట్‌ను పడగొట్టాడు. దీంతో అతడికి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

**బవుమా అజేయ ప్రస్థానానికి బ్రేక్!**

దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా టెస్టు కెప్టెన్‌గా తన తొలి ఓటమిని చవిచూశాడు. దీంతో టెస్టు కెప్టెన్‌గా వరుసగా 12 మ్యాచ్‌ల్లో ఓటమి ఎరుగని బవుమా ప్రస్థానానికి తెరపడింది. గతంలో దక్షిణాఫ్రికా కెప్టెన్‌గా తొలి ఓటమిని ఎదుర్కొనే ముందు అత్యధికంగా ఎనిమిది టెస్టుల వరకు ఓటమి లేకుండా సాగిన హషీమ్ ఆమ్లా రికార్డును బవుమా అధిగమించాడు.

**డబ్ల్యూటీసీ పట్టికలో కీలక మార్పులు**

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. దక్షిణాఫ్రికాపై తొలి టెస్టులో విజయంతో ఆస్ట్రేలియా తన అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది. మరోవైపు ఈ ఓటమితో దక్షిణాఫ్రికా రెండో స్థానం నుంచి మూడో స్థానానికి పడిపోయింది. న్యూజిలాండ్ రెండో స్థానానికి ఎగబాకింది. బంగ్లాదేశ్ నాలుగు, భారత్ ఐదో స్థానాల్లోనే కొనసాగుతున్నాయి. మిగతా జట్ల స్థానాల్లో ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదు.

# అగ్రస్థానంలోనే స్మృతి



భారత మహిళల జట్టు కెప్టెన్ స్మృతి మంధాన ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. మంగళవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్ జాబితాలో 790 పాయింట్లతో టాప్‌లో కొనసాగుతోంది. ఇటీవల హర్మన్‌ప్రీత్ కౌర్ నుంచి కెప్టెన్సీ బాధ్యతలు అందుకున్న స్మృతి.. బ్యాటింగ్‌లోనూ తన ఆధిపత్యాన్ని చాటుకుంటోంది. మరో భారత బ్యాటర్ హర్మన్‌ప్రీత్ కౌర్ 652 పాయింట్లతో తొమ్మిదో స్థానంలో నిలిచింది.

తాజా వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్(782) రెండో స్థానంలోనే కొనసాగుతోంది. మరోవైపు ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ ఎలీస్ పెర్రీ తిరిగి టాప్-10లోకి ప్రవేశించింది. మరోవైపు వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మ ఒక స్థానం దిగజారి తొమ్మిదో స్థానానికి పడిపోయింది.. ఆస్ట్రేలియా బౌలర్లు అన్నాబెల్ సదర్లాండ్, మేగన్ షట్ తమ స్థానాలను మెరుగుపరుచుకుని టాప్-5లోకి వచ్చారు.

**టీ20ల్లోనూ అదుర్స్..**

మహిళల టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లోనూ భారత ప్లేయర్లు సత్తా చాటుతున్నారు. టాప్-10లో ముగ్గురు భారత బ్యాటర్లు చోటు దక్కించుకున్నారు. షఫాలీ వర్మ 759 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉండగా.. స్మృతి మంధాన 754 పాయింట్లతో ఐదో స్థానంలో కొనసాగుతోంది. హర్మన్‌ప్రీత్ కౌర్ 656 పాయింట్లతో పదో స్థానంలో నిలిచింది. మహిళల టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్పిన్నర్లు శ్రీ చరణి, దీప్తి శర్మ తమ తొలి రెండు స్థానాలను పదిలపరుచుకున్నారు. శ్రీ చరణి 817 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. దీప్తి శర్మ 754 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతోంది. మహిళల టీ20 ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో టాప్-10లో ఉన్న ఏకైక భారత క్రికెటర్ దీప్తి శర్మ. ఆమె నాలుగో స్థానంలో కొనసాగుతోంది. వన్డే ఆల్‌రౌండర్ల జాబితాలో ఆరో స్థానంలో నిలిచింది.

# మా ప్రయాణాన్ని కొత్తగా ప్రారంభిస్తున్నాం..

**- మళ్లీ ఒక్కటైన క్రికెటర్ పృథ్వీ షా, నటి ఆకృతి అగర్వాల్**



భారత క్రికెటర్ పృథ్వీ షా, నటి ఆకృతి అగర్వాల్ మళ్లీ ఒక్కటయ్యారు. కొన్ని వారాల క్రితమే ఈ జంట తమ నిశ్చితార్థాన్ని రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా మళ్లీ తమ బంధాన్ని కొనసాగించాలని నిర్ణయించుకున్నట్లు ఆకృతి ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించారు. ఇతరుల అభిప్రాయాలకు ప్రభావితమై తొందరపాటు నిర్ణయం తీసుకున్నానని అంగీకరించింది. ఆకృతి చేసిన పోస్టును పృథ్వీ షా కూడా తన ఇన్‌స్టా స్టోరీలో పంచుకున్నాడు. నిశ్చితార్థాన్ని రద్దు చేసుకున్నప్పుడు.. సరైన రీతిలో మాట్లాడుకుని, ఒకరినొకరం అర్థం చేసుకునే అవకాశం ఇవ్వకుండానే నిర్ణయం తీసుకున్నాను. ఆ విషయంలో నేను తప్పుదారి పట్టానని ఇప్పుడు భావిస్తున్నాను. ఆ తర్వాత ఇద్దరం మనసు విప్పి మాట్లాడుకున్నాం. ఒకరినొకరం అర్థం చేసుకున్నాం. మా బంధాన్ని కొనసాగించాలని నిర్ణయించుకున్నాం. మేమిద్దరం ఒకరికొకరం సరిపోతాం. మా బంధానికి మరెవరి అవసరం లేదు. కొత్తగా మా ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నాం. మా నిర్ణయాన్ని గౌరవించాలని కోరుతున్నామని ఆకృతి తన పోస్టులో పేర్కొంది.

పృథ్వీ షా, ఆకృతి అగర్వాల్ ఈ ఏడాది మార్చిలో నిశ్చితార్థం చేసుకున్నారు. అయితే తమ భవిష్యత్తు లక్ష్యాలు, పరిస్థితులు వేర్వేరుగా ఉన్నాయని పేర్కొంటూ సెప్టెంబర్‌లో ఆ నిశ్చితార్థాన్ని రద్దు చేసుకుంటున్నట్లు ఆకృతి వెల్లడించిన సంగతి తెలిసిందే.

# నాని పక్కన హీరోయిన్‌గా రుక్మిణి వసంత్?



నేచురల్ స్టార్ నాని తన లైనప్‌లో మరో ఆసక్తికరమైనప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లుతెలుస్తోంది. ది ప్యారడైజ్ సినిమాతో ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయిన నాని ఈసారి మాస్, క్లాస్ రెండు సినిమాలను ఒకేసారి మొదలు పెట్టాడు. ఇప్పటికే సుజీత్ దర్శకత్వంలో బ్లడీ రోమియోని పట్టాలెక్కించిన నాని అది ఇంకా సెట్స్ మీదకు వెళ్లకుండానే.. కోలీవుడ్‌లో ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిన 96, సత్యం – సుందరం చిత్రాలతో సెన్సేషనల్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న ప్రేమ్ కుమార్ దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నట్లు టాక్‌నడుస్తోంది. ఈ సినిమా పూర్తిగా ఒక ఎమోషనల్ లవ్ స్టోరీ నేపథ్యంలో తెరకెక్కనుందని తెలుస్తోంది. ప్రేమకథలను అత్యంత సహజంగా, హృదయానికి హత్తుకునేలా తెరకెక్కించడంలో ప్రేమ్ కుమార్‌కు ప్రత్యేకశైలి ఉంది. 96 లాంటి కల్ట్ క్లాసిక్ తర్వాత ఆయన నుంచి వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. కేవలం రొమాన్స్ మాత్రమే కాకుండా, చక్కటి భావోద్వేగాలు ఈ చిత్రానికి ప్రధాన బలంగా ఉండబోతున్నట్లు సమాచారం.

ఈచిత్రంలో కథానాయిక పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా, స్ట్రాంగ్‌గా ఉండబో తోందని తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ కోసం మొదట పలువురు ప్రముఖ హీరోయిన్ల పేర్లను పరిశీలించినప్పటికీ, చివరికి టాలెంటెడ్ అండ్ బ్యూటిఫుల్ హీరోయిన్ రుక్మిణి వసంత్ పేరును ఖరారు చేసినట్లు టాక్ వినిపిస్తోంది. పాత్ర ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఆమెను ఈ చిత్రంలో హీరోయిన్‌గా ఫైనల్ చేసినట్లు సమాచారం. రుక్మిణి వసంత్ తన అద్భుతమైన నటనతో ఇప్పటికే సౌత్ ఇండియన్ ఇండస్ట్రీలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం డ్రాగన్ సినిమాలో ఎన్టీఆర్ సరసన నటిస్తోన్న ఈ భామకు నాని సినిమా మంచి ఛాన్స్ అని చెప్పొచ్చు. ఈ క్రేజీ కాంబినేషన్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.




# సోనీ లివ్‌లోనూ 'డీసీ' స్ట్రీమింగ్

ప్రేమ, నమ్మకద్రోహం, ప్రతీకారం.. ఈ మూడు అంశాల చుట్టూ సాగే కథతో ప్రేక్షకులను ఆకట్టుకున్న చిత్రం 'డీసీ'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఇప్పటికే సన్ నెక్స్ట్ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుండగా తాజాగా మరో ఓటీటీలో స్ట్రీమింగ్ కు సిద్ధమయింది. అక్టోబర్ 16 నుంచి ప్రముఖ డిజిటల్ వేదిక సోనీ లివ్ ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. హిందీ, తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రాన్ని వీక్షించవచ్చు. కొన్ని కథలు ప్రేమతో మొదలై అనూహ్య మలుపులు తిరుగుతాయి. మరికొన్ని నమ్మక ద్రోహం, ప్రతీకారం కారణంగా కొత్త దారులు వెతుక్కుంటాయి. మనుషుల మధ్య సంబంధాలు, క్లిష్ట పరిస్థితుల్లో వారు తీసుకునే నిర్ణయాలు జీవితాలను ఎలా ప్రభావితం చేస్తాయనే అంశాలను 'డీసీ' కథలో ఆసక్తికరంగా ఆవిష్కరించారు దర్శకుడు. ఇందులో లోకేష్ కనకరాజు, వామిక గబ్బి జంటగా నటించారు.

# 'కరికాల'లో సాక్షి మడోల్కర్

'బబుల్ గమ్' చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన సాక్షి మడోల్కర్... ఆ సినిమా ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోకపోయినా... అవకాశాలను మాత్రం పొందుతోంది. ప్రస్తుతం శ్రీవిష్ణు 'ఫ్యామిలీ ప్యాక్'లో నటిస్తున్న సాక్షి మడోల్కర్ తాజాగా మరో ప్రాజెక్ట్‌లో అవకాశం పొందింది. సందీప్ కిషన్ హీరోగా 'శంబాల' ఫేమ్ యుగంధర్ ముని రూపొందిస్తున్న 'కరికాల' సినిమాలో ఈమె హీరోయిన్‌గా చేస్తోంది. ఇప్పటికే ఈ సినిమాలో మరో హీరోయిన్‌గా కేథరిన్ థ్రెసా పేరును ప్రకటించారు. ఈ సినిమాను మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా మొదటి చాప్టర్ 2027 జూలై 2న , రెండో చాప్టర్ 2027 అక్టోబర్ 28న విడుదల కాబోతోన్నట్టుగా మేకర్స్ ప్రకటించారు. భారతీయ ప్రేక్షకులకు ఒక ప్రత్యేకమైన సోషియో–ఫాంటసీ అనుభవాన్ని అందించాలని లక్ష్యంగా 'కరికాల' టీం పని చేస్తోందన్నారు. ఈ సినిమాకి శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నారు. ఈ నెల 15న ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు జరగబోతున్నాయి.




# 'ది రాజాసాబ్' సంక్రాంతికి విడుదల చేయటం తప్పు..



'ది రాజాసాబ్' సినిమాను సంక్రాంతికి విడుదల చేసి పొరపాటు చేశామని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ అన్నారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన రాజాసాబ్ సినిమా భారీ అంచనాల మధ్య ఈ ఏడాది సంక్రాంతికి విడుదలైన బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. ఓటీటీలో విడుదలైన తర్వాత మరిన్ని విమర్శలు ఎదుర్కొంది. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న తాజా చిత్రం 'గరివిడి లక్ష్మి'. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ దసరా కానుకగా అక్టోబరు 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రమోషన్లలో 'ది రాజాసాబ్' ఫలితంపై టీజీ విశ్వ ప్రసాద్ స్పందించారు. ది రాజాసాబ్‌ను సరైన సీజన్‌లో విడుదల చేయలేదేమో. ఒకవేళ సంక్రాంతికి కాకుండా ఎప్పుడు వచ్చినా బాగా ఆడేది. సినిమాకున్న భారీదనాన్ని దృష్టిలో పెట్టుకుని మా వరకూ బాగానే విడుదల చేశాం. టికెట్ రేట్లు పెంచేందుకు ప్రయత్నించాం. దీంతో సినిమా ప్రీమియర్ ఆలస్యమైంది. అలా చేయకుండా ఉండాలింది. చాలా మంది అసహనానికి గురయ్యారు. ఇంకా చాలా కారణాలు ఉన్నాయన్నారు.

మా సంస్థనుంచి కొన్ని సీక్వెల్స్ వస్తాయి. ప్రతి సినిమా ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకుని చేస్తాం. వాటిల్లో 'గరివిడి లక్ష్మి' లాంటి వైవిధ్య చిత్రం ఉంటుంది. అలాగే 'మిరాయ్', 'జాంబీరెడ్డి' వంటి కొనసాగింపు చిత్రాలూ ఉంటాయి. 'స్పిరిట్' మూవీ విషయంలో నా పాత్ర చాలా తక్కువ. నేను కేవలం డిస్ట్రిబ్యూటర్‌గా మాత్రమే వ్యవహరిస్తున్నా. 2028లో ప్రభాస్‌తో ఓ మూవీ ఉంటుంది. అది కూడా భారీ స్థాయిలో తీస్తాం. కొన్ని సినిమాల విషయంలో తప్పులు జరిగాయి. ప్రస్తుతం పది సినిమాల వరకూ మా ప్రొడక్షన్ హౌస్‌లో షూటింగ్ జరుపుకొంటున్నాయి. భవిష్యత్లో తప్పులు జరగకుండా చూసుకుంటామని టీజీ విశ్వప్రసాద్ అన్నారు. దసరా సందర్భంగా 'జైలర్2', 'రణబాలి' వంటి భారీ చిత్రాలు విడుదలవుతున్నా, తామొక మంచి సినిమాతో వస్తున్నామని, 'గరివిడి లక్ష్మి' ఎక్కువ రోజులు థియేటర్‌లో ఆడుతుందని ధీమా వ్యక్తం చేశారు.

# సంగీత దర్శకుడిగా రామజోగయ్య శాస్త్రి కుమారుడు

ప్రముఖ నటుడు శ్రీకాంత్ కుమార్తె మేధ 'మైత్రి ఇన్ లవ్'తో వెండితెరకు పరిచయమవుతుండగా.. ఈ సినిమాతో మరో వారసుడు కూడా సినీ రంగ ప్రవేశం చేస్తుండటం విశేషం. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఇటీవలే ముహూర్తం జరుపుకొంది. ప్రముఖ గీత రచయిత రామజోగయ్య శాస్త్రి కుమారుడు సాయి హర్ష ఈ చిత్రంతో సంగీత దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ విషయాన్ని రామజోగయ్య శాస్త్రి 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అందిస్తున్న చిత్రంతో సాయి హర్ష తన ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నాడు. వినయం, అణకువతో మెలిగే మా అబ్బాయికి సంగీతమంటే ఎంతో మక్కువ. అతనికి మీ ఆశీర్వాదాలు కావాలని పేర్కొన్నారు.



# శ్రీవారి సేవలో విజయ్, రష్మిక దంపతులు



సినీనటుడు విజయ్ దేవరకొండ, రష్మిక దంపతులు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం నైవేద్య విరామ సమయంలో స్వామివారి సేవలో పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి శేషవస్త్రం కప్పి, వేదాశీర్వచనం అందించగా, పండితులు శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. దర్శనానంతరం ఆలయం వెలుపలికి వచ్చిన ఈ జోడీని చూసేందుకు అభిమానులు, భక్తులు పెద్ద ఎత్తున పోటీ పడ్డారు. విజయ్, రష్మిక ఇద్దరూ సాంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోతూ అందరికీ నమస్కరిస్తూ అభివాదం చేశారు. విజయ్ – రష్మిక జంటగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కిన రణబాలి సినిమా అక్టోబర్ 16 న రిలీజ్ కి సిద్ధమైంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రం భారీ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూనే వారు తిరుమల స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు సమాచారం. రణబాలి సినిమాపై విజయ్ దేవరకొండ చాలా ఆశలు పెట్టుకున్నాడు. లైగర్ తరువాత విజయ్‌కు హిట్ లేదు. ఈ సినిమాతో ఎలాగైనా ఒక మంచి హిట్ అందుకోవాలని చాలా ప్రయత్నిస్తున్నాడు. అందులో రష్మికతో పెళ్లి తరువాత వీరిద్దరూ కలిసి నటించిన చిత్రం కావడంతో అభిమానులు కూడా ఈ చిత్రం కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నారు.